# మనసులో మాట

KANCHARLA

నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. | సంచలన తెలుగు దిన పత్రిక








ప్రచురణ : విశాఖపట్నం -పబ్లిషర్ : కంచర్ల ఉపేంద్ర -సంపుటి : 1 -సంచిక : 315-బుధవారం-15 జూలై 2026-ఎడిటర్ : కంచర్ల అచ్యుతరావు- పేజీలు :8+16-వెల రూ.7/-

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం,తూర్పగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణ,గుంటూరు,ప్రకాశం,తిరుపతి,నెల్లూరు,కర్నూలు,కడప,హైదరాబాద్


## భారత్‌లోకి అమెరికా మాజీ సైనికులు!

- మరోసారి అక్రమ చొరబాట్ల కలకలం
- యూపీ సరిహద్దులో మాజీ నేవీ అధికారి అరెస్ట్
- మయన్మార్ మిలిటెంట్లతో సంబంధాలు
- నేపాల్ సరిహద్దు దాటేందుకు యత్నిస్తుండగా అరెస్ట్



3

## బంగ్లాదేశ్‌కు షేక్ హసీనా రాకపై ఉత్కంఠ

- స్వదేశానికి వస్తే చట్టపరమైన చర్యలు తప్పవని బంగ్లాదేశ్ మంత్రి వ్యాఖ్య
- అరెస్టు, జైలు శిక్షకు సిద్ధమేనని షేక్ హసీనా ప్రకటన
- కోర్టు తీర్పు మేరకే తదుపరి చర్యలు ఉంటాయని స్పష్టం

4




ఇరాన్ సైనిక సామర్థ్యం

## పూర్తిగా ధ్వంసం

- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన
- హర్మూజ్ నౌకలపై రక్షణకు 20 శాతం టోల్ బాదుడు

యూఎస్ కాంగ్రెస్‌కు అధికారిక సమాచారం

4





## పెరిగిన ధరలపై కాంగ్రెస్ ఆగ్రహం

- జూన్‌లో 4.38 శాతానికి చేరిన ద్రవ్యోల్బణం
- సామాన్యుడి బడ్జెట్ అతలాకుతలమైంది
- కేంద్ర ప్రభుత్వంపై జైరాం రమేశ్ విమర్శలు
- బీజేపీ పాలనలో ధరల భారమేననని మండిపాటు

**తెలంగాణ బ్యురో జూలై 14 (మనసులో మాట):**

దేశంలో రోజురోజుకూ పెరిగిపోతున్న నిత్యావసర వస్తువుల ధరలపై కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. జూన్ నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం

మిగతా 2వ పేజీలో..



# ఎగరబోతున్న తెలంగాణ ఆశయాలు

- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో సీఎం రేవంత్ రెడ్డి కీలక భేటీ
- ఢిల్లీ పర్యటనలో కేంద్ర మంత్రులతో సీఎం రేవంత్ రెడ్డి వరుస భేటీలు
- తెలంగాణ విమానాశ్రయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ తో చర్చలు సఫలం
- దేశ ఆర్థిక ప్రగతిలో భాగస్వామ్యం కానున్న తెలంగాణ
- రాష్ట్ర జీడీపీ వాటాను 10 శాతానికి పెంచడమే లక్ష్యమన్న సీఎం

**తెలంగాణ బ్యురో జూలై 14 (మనసులో మాట):**

తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక, ఆర్థిక ప్రగతికి విమానాశ్రయాల విస్తరణ ఎంతో అవసరమని గుర్తించిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆ దిశగా వేగంగా అడుగులు వేస్తున్నారు. తన దేశ రాజధాని ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన కేంద్ర మంత్రులతో వరుస సమావేశాలు నిర్వహిస్తూ అత్యంత బిజీగా గడుపుతున్నారు. రాష్ట్రానికి సంబంధించిన కీలక పెండింగ్ ప్రాజెక్టుల సాధనే లక్ష్యంగా కేంద్ర రహదారి రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై వారితో విస్తృతంగా చర్చించారు.కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, ఉన్నతాధికారులతో జరిపిన చర్చలు అత్యంత సానుకూల వాతావరణంలో ముగిశాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల పునరుద్ధరణ, నిర్మాణ పనులపై ఈ సమావేశంలో ఒక స్పష్టమైన అవగాహన కుదిరిందని

మిగతా 2వ పేజీలో..

**2028 జూన్ 2 నాటికి వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుల నిర్మాణం పూర్తి**

## రూ.8.21 లక్షల కోట్ల అప్పుల భారం బీఆర్ఎస్‌దే

- బీఆర్ఎస్ పాలనలో తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టారని విమర్శ
- రెండున్నరేళ్లలో రూ.2.08 లక్షల కోట్ల అసలు, వడ్డీలు చెల్లించిన కాంగ్రెస్ ప్రభుత్వం
- అప్పులు కడుతూనే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని వెల్లడి
- మల్లమ్మకుంట భూసేకరణ వేగవంతానికి కలెక్టర్‌కు ఆదేశాలు
- రైతులకు పూర్తి న్యాయం.. తగిన పరిహారం అందిస్తామని హామీ
- అలంపూర్ జులేకల్ బహిరంగ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వ్యాఖ్యలు

2





3

## సింగరేణి బొగ్గు గనులపై రాజకీయ రచ్చ

- బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలపై కిషన్‌రెడ్డి తీవ్ర విమర్శలు
- సింగరేణి భరోసా యాత్రలో ప్రభుత్వాలపై విరుచుకుపడ్డ కేంద్ర మంత్రి
- భూపాలపల్లి వేదికగా గత, ప్రస్తుత ప్రభుత్వాల తీరుపై ధ్వజమెత్తిన కిషన్‌రెడ్డి

## కాళేశ్వరం వైఫల్యంపై బీఆర్ఎస్‌ను నిలదీసిన పొన్నం

- కాళేశ్వరం సమస్యలకు బీఆర్ఎస్ ప్రభుత్వమే బాధ్యత అని మంత్రి ఆరోపణ
- నిపుణుల సూచనల మేరకే ప్రాజెక్టులో నీటి నిల్వలు చేపడతామని స్పష్టం
- కాంగ్రెస్ ప్రభుత్వం రాకముందే ప్రాజెక్టు కుంగిపోయిందని వ్యాఖ్య
- గత పాలకుల నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని విమర్శ
- బీఆర్ఎస్ ప్రచారాన్ని ప్రజల ముందు తిప్పికొడతామని వెల్లడి



3

## బోనాల పండుగలకు నిధులు విడుదల



3

- రాజధానిలో వైభవంగా ఆషాఢ బోనాల జాతర!
- జూలై 16 నుంచి నెల పాటు ఆధ్యాత్మిక శోభ
- ప్రధాన ఆలయాల్లో మొదలైన ఏర్పాట్లు
- భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు
- గోల్కొండతో మొదలై లాల్‌దర్వాజా వరకు
- బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవం
- 3,427 ఆలయాలకు రూ.15 కోట్ల నిధుల విడుదల



## కాపు ఉద్యమానికి తీరని లోటు..

3

### ముద్రగడకు బండి సంజయ్ నివాళి

- కాపు జాతి ఆత్మగౌరవ పోరాటానికి ముద్రగడ చిరస్మరణీయ నాయకుడు
- ముద్రగడ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపిన బండి సంజయ్



# కాపు ఉద్యమానికి తీరని లోటు..



- కాపుల హక్కుల కోసం తన జీవితాన్నే పోరాటంగా మార్చుకున్న యోధుడు
- కాపు జాతి ఆత్మగౌరవం కోసం ఆకలిని ఆయుధంగా మార్చుకుని నిరాహార దీక్షలు చేసిన నాయకుడు
- తన ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా కాపుల హక్కుల కోసం పోరాడిన త్యాగశీలి
- లాఠీలు ఎదురైనా... అరెస్టులు ఎదురైనా... ఒత్తిళ్లు వచ్చినా వెనక్కి తగ్గని ధీరుడు ముద్రగడ
- ముద్రగడ పద్మనాభం ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా
- ముద్రగడ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

**హైదరాబాద్, మనసులో మాట**

పదవుల కంటే ప్రజల పక్షాన నిలబడటమే గొప్పదని చాటిన నేత ముద్రగడ పద్మనాభం అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొనియాడారు. కాపు జాతి ఆత్మగౌరవానికి ప్రతీక ముద్రగడ అని అభివర్ణించారు. కాపుల హక్కుల కోసం తన జీవితాన్నే పోరాటంగా మార్చుకున్న యోధుడు. కాపు జాతి ఆత్మగౌరవం కోసం ఆకలిని ఆయుధంగా మార్చుకుని నిరాహార దీక్షలు చేసిన నాయకుడు ముద్రగడ పద్మనాభం మరణం తనను తీవ్రంగా కలిచి వేసిందని పేర్కొన్నారు. ముద్రగడ పద్మనాభం మరణవార్త తెలుసుకున్న బండి సంజయ్ కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఏమన్నారంటే..

ఆంధ్రప్రదేశ్ రాజకీయ, సామాజిక చరిత్రలో కాపు ఉద్యమం గురించి ప్రస్తావన వచ్చినప్పుడల్లా ముందుగా గుర్తుకు వచ్చే పేరు ముద్రగడ పద్మనాభం. కాపు సామాజిక వర్గం హక్కులు, ఆత్మగౌరవం, రాజకీయ ప్రాధాన్యం కోసం దశాబ్దాలుగా నిరంతరంగా పోరాడిన నాయకుడిగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు.

తూర్పుగోదావరి జిల్లాలోని కిర్లంపూడి కేంద్రంగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన ముద్రగడ పద్మనాభం, ఎమ్మెల్యేగా, మంత్రిగా ప్రజలకు సేవలందించారు. అధికారంలో ఉన్నప్పుడు మాత్రమే కాకుండా, అధికారానికి దూరంగా ఉన్న సమయంలో కూడా ప్రజా సమస్యలపై తన గళాన్ని వినిపించడం ఆయన ప్రత్యేకత. ముఖ్యంగా కాపు సామాజిక వర్గానికి రిజర్వేషన్లు, సముచిత గుర్తింపు కల్పించాలనే డిమాండ్‌తో చేపట్టిన ఉద్యమాలు రాష్ట్ర రాజకీయాల్లో విశేష ప్రభావం చూపాయి.

కాపు సమాజం ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంలో ముద్రగడ కీలక పాత్ర పోషించారు. తన డిమాండ్ల సాధన కోసం నిరాహార దీక్షలు, నిరసన కార్యక్రమాలు చేపట్టి ఉద్యమానికి కొత్త ఊపును తీసుకువచ్చారు. అనేక సందర్భాల్లో వ్యక్తిగత ఇబ్బందులను, రాజకీయ ఒత్తిడులను ఎదుర్కొన్నప్పటికీ తన లక్ష్యం నుంచి వెనక్కి తగ్గకపోవడం ఆయన సంకల్పబలానికి నిదర్శనం. ముద్రగడ పద్మనాభం వ్యక్తిత్వంలో నిక్కచ్చితనం, ధైర్యం, నిబద్ధత ప్రధానంగా కనిపిస్తాయి. రాజకీయ లాభనష్టాలను పక్కనపెట్టి తాను నమ్మిన అంశంపై చివరి వరకు నిలబడే నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. కాపు సమాజంలోని అనేక మంది ఆయనను ఉద్యమ స్ఫూర్తిగా, ఆత్మగౌరవ ప్రతీకగా భావిస్తారు.

నేటి రాజకీయ పరిస్థితుల్లో కూడా ముద్రగడ పేరు కాపు సమాజంలో విశేష ప్రభావాన్ని కలిగి ఉంది. ఆయన చేసిన పోరాటాలు, ఉద్యమాలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయి. కాపు జాతి హక్కుల కోసం అంకితభావంతో పనిచేసిన ఉద్యమనేతగా ముద్రగడ పద్మనాభం పేరు ఆంధ్రప్రదేశ్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది.




# హైదరాబాద్‌లో బ్రిక్స్ సదస్సు..

- ఉద్యోగ భద్రతపై మంత్రి వివేక్ కీలక వ్యాఖ్యలు
- హైదరాబాద్‌లో ప్రారంభమైన 15వ బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరమ్ సదస్సు
- ఉద్యోగ భద్రత ఉంటేనే ఉత్పాదకత పెరుగుతుందన్న మంత్రి వివేక్
- పదేళ్లలో 17 కోట్ల ఉద్యోగాలు సృష్టించామని తెలిపిన కేంద్ర మంత్రి మాండవీయ
- 14 దేశాల నుంచి 110 మంది ప్రతినిధులు హాజరు

**హైదరాబాద్, మనసులో మాట**

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించినప్పుడే వారి నుంచి మెరుగైన ఉత్పాదకతను సాధించగలమని తెలంగాణ కార్మిక, ఉపాధి శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. బ్రిక్స్ దేశాలు సామాజిక భద్రతా వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలని, కార్మిక హక్కులను పరిరక్షించడంతో పాటు నైపుణ్యాభివృద్ధిలో పెట్టుబడులు పెట్టాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లోని మారియట్ హోటల్‌లో భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) ఆధ్వర్యంలో ప్రారంభమైన 15వ బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరమ్ సమ్మిట్ 2026 ప్రారంభోత్సవంలో మంత్రి వివేక్ ప్రసంగించారు. జులై 14 నుంచి 16 వరకు మూడు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సుకు బ్రెజిల్, రష్యా, చైనా, దక్షిణాఫ్రికా సహా 14 దేశాల నుంచి దాదాపు 110 మంది ప్రతినిధులు హాజరయ్యారు. కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ ఈ సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సామాజిక భద్రత, నైపుణ్యాభివృద్ధి, కృత్రిమ మేధ (ఏఐ) వంటి రంగాల్లో బ్రిక్స్ దేశాల మధ్య పరస్పర సహకారానికి అపార అవకాశాలు ఉన్నాయని తెలిపారు. గత పదేళ్ల కాలంలో భారత్‌లో సుమారు 17 కోట్ల ఉద్యోగాలను సృష్టించామని, 2017లో 6 శాతంగా ఉన్న నిరుద్యోగిత రేటు 2025 నాటికి 3.1 శాతానికి తగ్గిందని వెల్లడించారు. ఇదే సమయంలో మహిళ ఉపాధి రేటు 22 శాతం నుంచి 38.8 శాతానికి వృద్ధి చెందిందని వివరించారు. రాబోయే రెండేళ్లలో వ్యవస్థీకృత రంగంలో 3.5 కోట్ల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా 'ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన'ను ప్రవేశ పెట్టినట్లు మాండవీయ తెలిపారు. మరోవైపు, తెలంగాణలో యువతకు ఆధునిక పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఇచ్చేందుకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేశామని మంత్రి వివేక్ వెల్లడించారు.

# ఎగరబోతున్న తెలంగాణ ఆశయాలు

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు గురించి ప్రస్తావించినా, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తక్షణమే స్పందించి అధికారులను ఆదేశిస్తున్నారని కొనియాడారు. తెలంగాణ ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి కేంద్రం నుంచి సంపూర్ణ సహకారం అందుతోందని రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల నిర్మాణ పనులను ఒక నిర్దిష్ట కాలపరిమితిలోగా పూర్తి చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్ణయించాయి. వచ్చే 2028 జూన్ 2 నాటికి, అంటే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నాటికి ఈ రెండు విమానాశ్రయాల పనులను వంద శాతం పూర్తి చేసి, అదే రోజు భక్తులు, ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని ఒక స్పష్టమైన లక్ష్యాన్ని పెట్టుకున్నట్లు రేవంత్ రెడ్డి ప్రకటించారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సైతం దీనిపై స్పందిస్తూ.. నిర్దేశిత గడువు లోపే విమానాశ్రయాల నిర్మాణాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. వరంగల్ (మామునూరు) విమానాశ్రయాన్ని కేవలం ఒక సాధారణ ఎయిర్‌పోర్ట్‌లా కాకుండా అంతర్జాతీయ ప్రమాణాలతో అద్భుతంగా నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఓరుగల్లు వైభవాన్ని ప్రతిబింబించేలా, కాకతీయ సంస్కృతి, కళాఖండాల ఆకృతులతో ఈ విమానాశ్రయం యొక్క ప్రధాన కట్టడాలను డిజైన్ చేయనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు.



దీనివల్ల వరంగల్ ప్రాంత పర్యాటక రంగానికి, పరిశ్రమల స్థాపనకు సరికొత్త ఊపు వస్తుందని, స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. భారత రక్షణ రంగానికి (డిఫెన్స్) వ్యూహాత్మకంగా ఆదిలాబాద్ విమానాశ్రయం ఎంతో అవసరమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాయి. ఈ ఎయిర్‌పోర్ట్ విస్తరణ మరియు పూర్తి స్థాయి నిర్మాణానికి గానూ రాష్ట్ర ప్రభుత్వం తరపున మరో 1500 ఎకరాల భూమిని సేకరించి కేంద్రానికి అప్పగించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సరిహద్దు జిల్లాలో ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తే అటు సైనిక అవసరాలకు, ఇటు వెనుకబడిన ఆదిలాబాద్ ప్రాంత ఆర్థిక ప్రగతికి ఎంతో మేలు జరుగుతుందని ఇరుపక్షాలు అభిప్రాయపడ్డాయి. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం 'వికసిత్ భారత్' నినాదంతో 2045 నాటికి దేశాన్ని 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని పెద్ద లక్ష్యాన్ని పెట్టుకుందని, ఇందులో తెలంగాణ భాగస్వామ్యం వహిస్తుందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. దేశ జనాభాలో కేవలం 2.50 శాతం మాత్రమే ఉన్న తెలంగాణ, దేశ మొత్తం జీడీపీలో 5 శాతం వాటాను కలిగి ఉండటం గర్వకారణమన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు, పరిశ్రమలు రావాలంటే విమానాశ్రయాల అనుసంధానత చాలా ముఖ్యమని, అందుకే తెలంగాణ జీడీపీ వాటాను 5 శాతం నుండి 10 శాతానికి పెంచేలా ప్రణాళికలు రూపొందించామని సీఎం వివరించారు.

కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక 'ఉడాన్' పథకం కింద దేశవ్యాప్తంగా ప్రాంతీయ విమానయాన రంగాన్ని బలోపేతం చేసేందుకు రూ.30 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు కేంద్ర పౌరవిమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు ఈ సందర్భంగా వెల్లడించారు. ఇందులో భాగంగానే తెలంగాణలోని వరంగల్, ఆదిలాబాద్ ప్రాజెక్టులకు అవసరమైన నిధులు, సాంకేతిక అనుమతులు వేగంగా మంజూరు చేస్తామన్నారు. అభివృద్ధి పనుల విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సంపూర్ణంగా సహకరిస్తున్న సీఎం రేవంత్ రెడ్డికి ఈ సందర్భంగా కేంద్రమంత్రి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.రాజకీయాలు ఎలా ఉన్నా, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధే ఏకైక లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సహకార స్ఫూర్తి (ఫెడరల్ స్ఫూర్తి) నిరంతరం కొనసాగుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కేంద్రాన్ని డిమాండ్ చేసి, ఒప్పించి రాష్ట్రానికి రావలసిన నిధులను, ప్రాజెక్టులను సాధించుకుంటామన్నారు. రాబోయే పార్లమెంట్ సమావేశాల సమయంలో తాను మళ్లీ ఢిల్లీకి వస్తానని, ఆ సమయంలో మిగిలిన కేంద్ర మంత్రులను కూడా వ్యక్తిగతంగా కలిసి రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన మరిన్ని అంశాలపై చర్చిస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీడియా ముఖంగా స్పష్టం చేశారు.

# రూ. 8.21 లక్షల కోట్ల అప్పుల భారం బీఆర్ఎస్‌దే: భట్టి విక్రమార్క

**హైదరాబాద్, మనసులో మాట**

గత బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని నిలువునా దోపిడీ చేసి, రూ. 8 లక్షల 21 వేల కోట్ల అపారమైన అప్పుల ఊబిలోకి నెట్టేసిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

అలంపూర్ నియోజకవర్గం వడ్డేపల్లి మండలం జులేకల్ గ్రామంలో ఏఐసీసీ సెక్రెటరీ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్సీ సంపత్ కుమార్ అధ్యక్షతన జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నాడు తాము రాష్ట్రాన్ని మిగులు బడ్జెట్‌తో, ధనిక రాష్ట్రంగా అప్పగిస్తే.. గత పాలకుల పదేళ్ల అనాలోచిత నిర్ణయాలు, అవినీతి వల్ల తెలంగాణ అప్పుల కుప్పగా మారిందని మండిపడ్డారు.

**రెండున్నరేళ్లలోనే రూ. 2.08 లక్షల కోట్ల చెల్లింపులు**

గత ప్రభుత్వం తెచ్చిన అప్పుల వల్ల ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర ఆర్థిక భారం పడిందని డిప్యూటీ సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వచ్చిన ఈ రెండున్నర సంవత్సరాల కాలంలోనే బిఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన అప్పులకు సంబంధించి రూ. 2 లక్షల 8 వేల కోట్ల అసలు, వడ్డీలను బ్యాంకులకు చెల్లించాల్సి వచ్చిందని వెల్లడించారు. "రూ. 8 లక్షల 21 వేల కోట్ల భారీ అప్పులు తెచ్చి ఆ నిధులను ఏం చేశారయ్యా? రాష్ట్రంపై పడి దోపిడీ చేశారు తప్ప రాష్ట్ర ప్రజలకు పైసా మేలు చేయలేదు. ఇంత ఆర్థిక సంక్షోభంలోనూ మేము ప్రతినెలా రూపాయి రూపాయి పోగేస్తూ.. పాత అప్పులు కడుతూనే సంక్షేమ పథకాలను విజయవంతంగా కొనసాగిస్తున్నాం" అని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గత ప్రభుత్వ అప్పుల భారాన్ని మోస్తూనే, నాడు ప్రారంభించిన 'షాదీ ముబారక్', 'కల్యాణలక్ష్మి' వంటి పథకాలను ఆపకుండా కంటిన్యూ చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. వీటితో పాటు అదనంగా అనేక విప్లవాత్మక కార్యక్రమాలను అమలు చేస్తున్నామని వివరించారు. తమ ప్రభుత్వం పాత పథకాలను కొనసాగిస్తూనే, అదనంగా ప్రతినెలా ఉద్యోగులకు సకాలంలో జీతాలు, రైతులకు ఉచిత కరెంట్ ఇస్తోందని, మహిళల ఉచిత ప్రయాణానికి గానూ రూ. 12 వేల కోట్లను ఆర్టీసీకి చెల్లించిందని వివరించారు. రూ. 22,500 కోట్లతో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు, అంతర్జాతీయ ప్రమాణాలతో 100 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రాగిజావతో కూడిన ఉదయం అల్పాహారం వంటి విప్లవాత్మక మార్పులు తెచ్చామని చెప్పారు. రాబోయే నవంబర్‌లో ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా రూ. 5 లక్షల 'ఇందిరమ్మ బీమా' పథకాన్ని ప్రారంభించబోతున్నామని ఆయన ఈ సందర్భంగా ప్రకటించారు.

**మళ్లీ వచ్చి ఏం బంద్ చేస్తారు?**

పదేళ్ల పాటు రాష్ట్రాన్ని నిలువునా దోపిడీ చేసి, ప్రజలను తాకట్టు పెట్టిన వారు ఇప్పుడు మళ్లీ వస్తున్నామంటూ ప్రగల్భాలు పలుకుతున్నారని భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

"మళ్లీ అధికారంలోకి వచ్చి ఏం చేస్తారు? పేదలకు ఇచ్చే 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను కట్ చేస్తారా? ప్రతి కుటుంబానికి ఇస్తున్న సన్న బియ్యాన్ని ఆపేస్తారా? కోటి 15 లక్షల కుటుంబాలకు రక్షణగా నిలిచే రూ. 5 లక్షల ఇందిరమ్మ బీమాను రద్దు చేస్తారా? లేక మహిళల ఉచిత బస్సు ప్రయాణాన్ని, డ్వాక్రా మహిళలకు అందిస్తున్న రూ. 76 వేల కోట్ల వడ్డీ లేని రుణాలను బంద్ చేస్తారా?" అని బిఆర్ఎస్ నాయకులను నిలదీశారు.



**మల్లమ్మకుంట భూసేకరణకు నేడే ఆదేశాలు**

పాలమూరు జిల్లా వలసల నివారణకు, వెనుకబడిన ప్రాంతాల సాగునీటి అవసరాలు తీర్చడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం పునరుద్ఘాటించారు. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో నార్లాపూర్ నుంచి ఉద్దండాపూర్ వరకు పెండింగ్ పనులను వేగవంతం చేశామని, భూసేకరణ నిధులన్నింటినీ క్లియర్ చేశామని చెప్పారు. ఆర్డీఎస్ (RDS) పరిధిలోని తుమ్మిళ్ల ప్రాజెక్టులో భాగంగా మల్లమ్మకుంట రిజర్వాయర్ నింపడానికి అవసరమైన 573 ఎకరాల భూసేకరణ ప్రక్రియను యుద్ధప్రతిపాదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఈ రోజే ఆదేశించనున్నట్లు ప్రకటించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా దాదాపు 87,500 ఎకరాలకు సాగునీరు అందుతుందని భరోసా ఇచ్చారు.

**బాలికల కోసం ప్రత్యేక జూనియర్ కళాశాల**

స్థానికంగా బాలికల కోసం ప్రత్యేక జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలన్న ప్రజల విన్నపంపై ఆయన సానుకూలంగా స్పందించారు. ప్రస్తుతం విద్యాశాఖను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారే పర్యవేక్షిస్తున్నారని చెబుతూ.. మహిళా విద్యపై సీఎంకు ఉన్న ప్రత్యేక శ్రద్ధను గుర్తు చేశారు. బాలికల కాలేజీ ఏర్పాటు అంశాన్ని వెంటనే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, త్వరలోనే అనుమతులు మంజూరు చేయించేందుకు చొరవ చూపుతానని హామీ ఇచ్చారు.ఈ సభలో మంత్రివర్యులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, స్థానిక పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి మాట్లాడారు.

**రైతులకు అన్యాయం జరగనివ్వం**

భూమితో రైతుకు ఉండే భావోద్వేగ బంధం తమ ప్రభుత్వానికి బాగా తెలుసని భట్టి విక్రమార్క అన్నారు. ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగకుండా, తక్కువ ధర నిర్ణయించి ఇబ్బంది పెట్టే పరిస్థితి ఉండబోదని స్పష్టం చేశారు.

# పెరిగిన ధరలపై కాంగ్రెస్ ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

ఒక్కసారిగా 4.38 శాతానికి పెరగడంతో మోదీ ప్రభుత్వంపై విమర్శల దాడిని ముమ్మరం చేసింది. గత 12 ఏళ్లుగా కొనసాగుతున్న భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ప్రభుత్వ పాలనలో ధరల పెరుగుదల కారణంగా దేశంలోని సామాన్య, మధ్యతరగతి కుటుంబాల బడ్జెట్ పూర్తిగా అతలాకుతలమైందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ మండిపడ్డారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విట్టర్) లో ఒక సుదీర్ఘమైన పోస్ట్ చేస్తూ కేంద్ర ప్రభుత్వ తీరును ఎండగట్టారు.

బీజేపీ ప్రభుత్వ 12 ఏళ్ల పాలనలో దేశ ప్రజలకు తప్పుడు హామీలు ఇవ్వడం మాత్రమే పెరిగిందని జైరాం రమేశ్ ఎద్దేవా చేశారు. క్షేత్రస్థాయిలో మాత్రం ద్రవ్యోల్బణం, తీవ్రమైన నిరుద్యోగం రూపంలో సామాన్య ప్రజలపై ప్రభుత్వం పెను భారాన్ని మోపిందని విమర్శించారు. ప్రభుత్వ అధికారిక గణాంకాలే జూన్ నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం ఏకంగా 17 నెలల గరిష్ఠ స్థాయికి చేరినట్లు స్పష్టంగా చూపిస్తున్నాయని ఆయన గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా ప్రజలు ధరల పెరుగుదలతో ఇంతలా ఇబ్బందులు పడుతుంటే, ప్రధాని నరేంద్ర మోదీ దీనిపై ఎప్పుడు స్పందిస్తారని, సామాన్యుల కష్టాల గురించి ఎప్పుడు మాట్లాడతారని జైరాం రమేశ్ సూటిగా ప్రశ్నించారు.

జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) తాజాగా విడుదల చేసిన నివేదికల ప్రకారం, మే నెలలో 3.93 శాతంగా నమోదైన వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం, జూన్ వచ్చేసరికి ఒక్కసారిగా 4.38 శాతానికి పెరిగింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నిర్దేశించుకున్న 4 శాతం ద్రవ్యోల్బణ నియంత్రణ లక్ష్య మార్కును ఇది దాటడం గమనార్హం. జనవరి నెల నుంచి అమల్లోకి వచ్చిన 2024 ప్రాతిపదిక సంవత్సరపు కొత్త శ్రేణి లెక్కల ప్రకారం, ద్రవ్యోల్బణం ఈ 4 శాతం మార్కును అధిగమించడం ఇదే మొదటి సారి కావడం గమనార్హం.

దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం ఈ స్థాయిలో పెరగడానికి ప్రధాన కారణం ఆహార వస్తువుల ధరలు విపరీతంగా పెరగడమేనని ప్రభుత్వ అధికారులు సైతం అంగీకరిస్తున్నారు. మే నెలలో 4.78 శాతంగా ఉన్న ఆహార ద్రవ్యోల్బణం, జూన్ నాటికి 5.32 శాతానికి చేరింది. ముఖ్యంగా వెండి, బంగారం, వజ్రాలు వంటి ఆభరణాలతో పాటు వంటింట్లో నిత్యం వాడే అల్లం, టమాటా, కిస్మిస్ వంటి నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకాయి. మరోవైపు బంగాళాదుంప, బఠానీలు, జీలకర్రతో పాటు కార్లు, మోటార్‌సైకిళ్లు, స్కూటర్ల ధరల పెరుగుదల వేగం కొంత తక్కువగా నమోదైనట్లు ఎన్ఎస్ఓ తన నివేదికలో వెల్లడించింది.

కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాలను పరిశీలిస్తే ధరల పెరుగుదల ప్రభావం పట్టణ ప్రాంతాల కంటే గ్రామీణ ప్రాంతాలపైనే చాలా ఎక్కువగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. దేశవ్యాప్తంగా సగటు రిటైల్ ద్రవ్యోల్బణం 4.38 శాతంగా ఉంటే, పల్లెటూళ్లలో ఇది ఏకంగా 4.74 శాతంగా నమోదైంది. అదే సమయంలో పట్టణ ప్రాంతాలలో ద్రవ్యోల్బణం రేటు 3.92 శాతంగా ఉంది. ఈ లెక్కలను బట్టి చూస్తే, ఆర్థికంగా వెనుకబడిన గ్రామీణ ప్రజలు నిత్యావసర వస్తువులను కొనుగోలు చేయడానికి పట్టణ వాసుల కంటే ఎక్కువ డబ్బు ఖర్చు చేయాల్సి వస్తోందని తెలుస్తోంది.



ద్రవ్యోల్బణం గరిష్ఠ స్థాయికి చేరడం వల్ల భవిష్యత్తులో దేశంలో బ్యాంకు వడ్డీ రేట్లు కూడా మరింత పెరిగే ప్రమాదం ఉందని జైరాం రమేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. అదే గనుక జరిగితే, బ్యాంకుల నుంచి గృహ రుణాలు (హోమ్ లోన్స్), వాహన రుణాలు తీసుకున్న మధ్యతరగతి ప్రజల నెలవారీ ఈఎంఐలు మరింత భారం కానున్నాయని హెచ్చరించారు. ఇప్పటికే ధరల దెబ్బకు సతమతమవుతున్న సామాన్యులపై ఈ వడ్డీ రేట్ల పెంపు అనేది కోలుకోలేని అదనపు భారంగా మారుతుందని ఆయన స్పష్టం చేశారు.

దేశంలో ఒకవైపు సామాన్య ప్రజలు రోజువారీ ఖర్చులకే ఇబ్బంది పడుతుంటే, పెద్ద పెద్ద పారిశ్రామిక వర్గాలు మరియు కార్పొరేట్ సంస్థల లాభాలు మాత్రం విపరీతంగా పెరుగుతున్నాయని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ఆరోపించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కేవలం బడా పెట్టుబడిదారుల ప్రయోజనాలకు, వారి లాభాలకు మాత్రమే అండగా నిలుస్తోందని మండిపడ్డారు. ధరల భారాన్ని మాత్రం ఏమీ లేని సామాన్య ప్రజల నెత్తిన రుద్దుతున్నారని, ఇదెక్కడి న్యాయమని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ విధానాలన్నీ సామాన్యుడిని దోచి కార్పొరేట్లకు పెట్టేలా ఉన్నాయని విమర్శించారు.

ద్రవ్యోల్బణంతో పాటు ప్రధాని నరేంద్ర మోదీ అవినీతి వ్యతిరేక వైఖరిని కూడా జైరాం రమేశ్ తీవ్రంగా తప్పుపట్టారు. ప్రధాని పదవి చేపట్టే సమయంలో మోదీ ఇచ్చిన హామీలన్నీ కేవలం బూటకపు మాటలేనని కొట్టిపారేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశంలో 'కనీస పాలన.. గరిష్ఠంగా నిజాలను కప్పిపుచ్చే ధోరణి' మాత్రమే కనిపిస్తోందని విమర్శించారు. వివాదాస్పద ఎన్నికల బాండ్ల పథకం, రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు, గుజరాత్ పెట్రోలియం కార్పొరేషన్ ఆయిల్ వ్యవహారాలపై కేంద్రం నుంచి ఇప్పటికీ సరైన సమాధానాలు రాలేదన్నారు. అలాగే పీఎం కేర్స్ నిధి నిర్వహణలో ఎలాంటి పారదర్శకత లేదని, అయోధ్య రామమందిర విరాళాల కేసులోనూ పూర్తిస్థాయి పారదర్శకత అవసరమని డిమాండ్ చేశారు. కేంద్ర విద్యాశాఖ పనితీరుపై కూడా కాంగ్రెస్ పార్టీ తరపున ఆయన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు.

# సింగరేణి బొగ్గు గనులపై రాజకీయ రచ్చ

- బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలపై కిషన్‌రెడ్డి నిప్పులు
- సింగరేణి భరోసా యాత్రలో కిషన్‌రెడ్డి ఆగ్రహం
- భూపాలపల్లి వేదికగా గత, ప్రస్తుత పాలకులపై విమర్శలు
- కేసీఆర్ చేతుల్లో జేబు సంస్థగా మారిన సింగరేణి
- పదిహేనేళ్లు వెనక్కి నెట్టేసారంటూ కేంద్రమంత్రి ఆరోపణ
- కార్మికుల కష్టార్జితాన్ని లూటీ చేశారంటూ కిషన్‌రెడ్డి మండిపాటు
- సొంత నియోజకవర్గాలకే సింగరేణి నిధుల మళ్ళింపు
- బొగ్గు గనుల ప్రాంతాల నిర్లక్ష్యంపై తీవ్ర ధ్వజం

తెలంగాణ బ్యూరో, మనసులో మాట

తెలంగాణ గుండెకాయ లాంటి సింగరేణి బొగ్గు గనుల రక్షణే ధ్యేయంగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) చేపట్టిన 'సింగరేణి భరోసా యాత్ర' రెండో రోజుకు చేరుకుంది. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో జరిగిన ఈ భారీ బహిరంగ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రగతికి ఊపిరిగా నిలిచిన సింగరేణి సంస్థను గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తమ స్వార్థ రాజకీయాల కోసం ఎలా వాడుకుంటున్నాయో ఆధారాలతో సహా వివరించారు. ఈ రెండు పార్టీల నిర్లక్ష్యం వల్ల సింగరేణి కార్మికులు ఈరోజు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అప్పటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) సింగరేణి సంస్థను తన సొంత జేబు సంస్థగా మార్చుకున్నారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఒకనాడు లాభాల బాటలో నడిచిన ఈ ప్రభుత్వ రంగ సంస్థ.. కేసీఆర్ తీసుకున్న తప్పుడు నిర్ణయాలు, అవినీతి విధానాల వల్ల ఏకంగా 15 సంవత్సరాలు వెనక్కి పడిపోయిందని ఆరోపించారు. కేసీఆర్ కుటుంబ సభ్యులు, వారి అనుచరులు సింగరేణి కాంట్రాక్టులను దక్కించుకుని వేల కోట్ల రూపాయలను నిస్సిగ్గుగా దోచుకున్నారని, దీనివల్ల సంస్థ ఆర్థికంగా కోలుకోలేని దెబ్బ తిన్నదని కిషన్ రెడ్డి దుయ్యబట్టారు. తెలంగాణ బొగ్గు గనుల్లో రాత్రింబగళ్లు కష్టపడి పని చేస్తున్న కార్మికుల చెమట చుక్కలతో సింగరేణి లాభాలను గడిస్తోందని, కానీ పాలకులు మాత్రం ఆ సంస్థను తమ సొంత ఆస్తిలా భావిస్తున్నారని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు గానీ, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పాలకులు గానీ సింగరేణిని తమ 'తాత జాగీరు' లాగా వాడుకుంటున్నారని ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. కార్మికుల సంక్షేమాన్ని గాలికొదిలేసి, సంస్థ నిధులను ఇతర అవసరాలకు తరలిస్తూ కార్మికుల నమ్మకాన్ని వమ్ము చేస్తున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం సంస్థకు ఆశించిన స్థాయిలో లాభాలు లేకపోవడంతో కార్మికులు తమ భవిష్యత్తుపై తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు.



సింగరేణి సంస్థ ద్వారా వచ్చే లాభాలను, కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులను చట్టప్రకారం బొగ్గు గనులు ఉన్న ప్రాంతాల అభివృద్ధి కోసమే ఖర్చు చేయాల్సి ఉంటుంది. భూపాలపల్లి, కొత్తగూడెం, మంచిర్యాల వంటి ప్రాంతాల ప్రజల తాగునీరు, రోడ్లు, విద్య, వైద్య అవసరాల కోసం ఈ నిధులు వాడాలి. కానీ, గత కేసీఆర్ ప్రభుత్వం ఈ నిధులను సింగరేణి ప్రాంతంలో ఖర్చు చేయకుండా.. కేసీఆర్ కుటుంబ సభ్యులైన కేటీఆర్, హరీష్ రావు ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల, సిద్ధపేట, గజ్వేల్ వంటి సొంత నియోజకవర్గాలకు చట్టవిరుద్ధంగా మళ్లించారని కిషన్ రెడ్డి ఆరోపించారు. ఇది సింగరేణి ప్రాంత ప్రజలకు చేసిన ద్రోహమని ఆయన అన్నారు. సింగరేణి సంస్థను మరింత విస్తరించి, లాభాల బాటలోకి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. గతంలో కేంద్రంలో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వం సింగరేణి సంస్థ అభివృద్ధి కోసం అదనంగా కొత్త కోల్ బ్లాకులను (బొగ్గు గనులు) కేటాయించినప్పటికీ, కేసీఆర్ ప్రభుత్వం వాటిని ఏమాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. కేవలం రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే కేంద్రం ఇచ్చిన అవకాశాలను బీఆర్ఎస్ సర్కార్ కాలరాసిందన్నారు. పైగా, సింగరేణి సమస్యలు లేదా అభివృద్ధి ప్రాజెక్టుల గురించి కేసీఆర్ తన పాలనా కాలంలో ఒక్కసారి కూడా కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపలేదని కిషన్ రెడ్డి వెల్లడించారు. కేవలం బీఆర్ఎస్ ప్రభుత్వమే కాకుండా, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో పయనిస్తోందని కిషన్ రెడ్డి మండిపడ్డారు. కేసీఆర్ పాలన ముగిసే సమయానికి తెలంగాణ జెన్‌కోకు కేవలం రూ.8,958 కోట్ల అప్పులు ఉంటే, ప్రస్తుతం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన కొన్ని నెలల్లోనే ఆ అప్పులు ఏకంగా రూ.26,875 కోట్లకు చేరుకున్నాయని అధికారిక గణాంకాలను బయటపెట్టారు. ఈ అప్పులను పూడ్చుకోవడానికి, కొత్తగా అప్పులు తెచ్చుకోవడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏకంగా అధికారులను, కేంద్ర సంస్థలను బెదిరించే స్థాయికి దిగజారిందని కిషన్ రెడ్డి విమర్శించారు. సింగరేణి సంస్థను నిర్వీర్యం చేసేందుకు కొందరు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని కిషన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. సింగరేణి గనుల్లో నాణ్యమైన బొగ్గు లభించడం లేదని, ఇక్కడి బొగ్గు వాడకం లాభదాయకం కాదంటూ పనిగట్టుకుని చేస్తున్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. ఇలాంటి ప్రచారం చేయడం వల్ల సంస్థ ప్రతిష్ఠ అంతర్జాతీయంగా దెబ్బతింటుందని, ఇది చాలా ప్రమాదకరమైన విషయమని హెచ్చరించారు. సింగరేణి బొగ్గుకు ఎంతో డిమాండ్ ఉందని, కేవలం ప్రభుత్వాల అసమర్థత వల్లే ఈ విధమైన వదంతులు వ్యాప్తి చెందుతున్నాయని, దీనివల్ల కార్మికుల్లో అభద్రతాభావం పెరుగుతోందని అన్నారు. సింగరేణి సంస్థ మళ్లీ పూర్వ వైభవాన్ని సాధించాలంటే కొత్త బొగ్గు గనుల తవ్వకాలు వేగవంతం కావాలని కిషన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా తాడిచర్ల2 బొగ్గు బ్లాక్ అందుబాటులోకి వస్తే సింగరేణి సంస్థకు భారీగా లాభాలు చేకూరుతాయని, కార్మికుల ఉద్యోగ భద్రతకు ఢోకా ఉండదని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు విజయవంతం కావడానికి కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. సింగరేణి కార్మికుల ప్రయోజనాల కోసం బీజేపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, భరోసా యాత్ర ద్వారా కార్మికుల గొంతుకగా నిలుస్తామని కిషన్ రెడ్డి భరోసా ఇచ్చారు.

# బోనాల పండుగలకు నిధులు విడుదల

- ఆలయాల అభివృద్ధి, నిర్వహణ కోసం భారీగా కేటాయింపులు

తెలంగాణ బ్యూరో, మనసులో మాట

తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక వైభవానికి, ఆచార సంప్రదాయాలకు నిలువుటద్దంగా నిలిచే ఆషాఢ మాస బోనాల ఉత్సవాలను ఈ ఏడాది అత్యంత ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లోని ఆలయాలన్నీ భక్తజనంతో కిక్కిరిసిపోనున్నాయి. ఈ మహోత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో, కన్నుల పండుగగా నిర్వహించేందుకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలు కలిసికట్టుగా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నాయి.

లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, ఏ ఒక్కరికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ, పోలీస్, దేవాదాయ, రోడ్లుభవనాలు, నీటి సరఫరా, విద్యుత్, ఆర్టీసీ వంటి అన్ని విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి పనులను పర్యవేక్షిస్తున్నారు. ఆలయాల వద్ద క్యూ లైన్ల ఏర్పాటు, తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, రహదారుల మరమ్మతులు, ట్రాఫిక్ నియంత్రణ వంటి పనులను సకాలంలో పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు.

బోనాల ఉత్సవాలు జూలై 16న గోల్కొండ శ్రీ జగదాంబ మహంకాళి అమ్మవారికి బోనం సమర్పించడంతో ప్రారంభమవుతాయి. ఆగస్టు 2న సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి బోనాలు, ఆగస్టు 3న రంగం కార్యక్రమం నిర్వహిస్తారు. ఇక ఆగస్టు 9న లాల్‌దర్వాజా శ్రీ సింహవాహిని మహంకాళి అమ్మవారి బోనాలతో పాటు, నగరంలోని ప్రధాన ఆలయాల్లో జరిగే వేడుకల కోసం అద్భుతమైన ఏర్పాట్లు చేస్తున్నారు. పూల అలంకరణలు, విద్యుద్దీపాలంకరణలతో నగరం అంతా అమ్మవారి కోవెలలా మెరిసిపోనుంది.

బోనాల పండుగలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన బల్కంపేట శ్రీ ఎల్లమ్మ అమ్మవారి కల్యాణోత్సవాలు జూలై 20, 21, 22 తేదీల్లో అత్యంత వైభవంగా జరగనున్నాయి. జూలై 20న ఎదుర్కోలు ఉత్సవం, 21న అత్యంత ఘనంగా అమ్మవారి కల్యాణం, 22న రథోత్సవం నిర్వహించబడుతుంది. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని, భక్తులు క్రమశిక్షణతో ఉత్సవాలను జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు. ఈ ఏడాది బోనాల పండుగ కోసం ప్రభుత్వం భారీగా నిధులను కేటాయించింది. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో పాత జీహెచ్ఎంసీ పరిధిలోని 3,427 దేవాలయాలకు రూ.15,05,41,150 కోట్లను విడుదల చేశారు. ఈ నిధులతో ఆలయాల మరమ్మతులు, భక్తులకు సౌకర్యాల కల్పనను వేగవంతం చేశారు. అమ్మవారికి సమర్పించే పట్టువస్త్రాలు, ఫలహారం బండ్ల ఊరేగింపు వంటి కార్యక్రమాలను కూడా ప్రభుత్వమే దగ్గరుండి పర్యవేక్షిస్తోంది. ప్రతి భక్తుడికి సురక్షితమైన, సౌకర్యవంతమైన దర్శనం కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. అత్యధిక రద్దీ ఉండే ఆలయాల వద్ద ప్రత్యేక క్యూ లైన్లు, వైద్య శిబిరాలు, అంబులెన్స్ సదుపాయం కల్పిస్తున్నాం. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని పోలీస్ శాఖకు సూచించాం. పారిశుద్ధ్య లోపం లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా జీహెచ్ఎంసీ ప్రత్యేక బృందాలను సిద్ధం చేసింది. భక్తిప్రపత్తులతో పండుగను జరుపుకోవాలని కోరుతున్నాం. గోల్కొండ జగదాంబ, ఉజ్జయిని మహంకాళి, కట్ట మైసమ్మ, అక్కన్నమాదన్న దేవాలయం, లాల్‌దర్వాజా సింహవాహిని, భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం వంటి నగరంలోని సుమారు 30 ప్రధాన దేవాలయాల్లో రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రులు, ప్రజాప్రతినిధులు పట్టువస్త్రాలు సమర్పిస్తారు. ఈ ప్రక్రియ అంతా అత్యంత సంప్రదాయబద్ధంగా జరుగుతుంది. పట్టువస్త్రాల సమర్పణ అనంతరం అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రమైన ఫలహారం బండ్ల ఊరేగింపును వైభవంగా నిర్వహిస్తాం. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న టీజీఎస్ఆర్టీసీ ఉచిత బస్సు సౌకర్యం మహిళలకు గొప్ప వరం. ఈ సౌకర్యం వల్ల రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉంది. రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. మహిళా భక్తులు అమ్మవారిని దర్శించుకుని, ఈ మహోత్సవాలను మరింత విజయవంతం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. భక్తులందరూ కలిసి తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటిచెబుదామని ఆకాంక్షించారు.

# కాళేశ్వరం వైఫల్యంపై బీఆర్ఎస్‌ను నిలదీసిన పొన్నం

- కాళేశ్వరం సమస్యలకు బీఆర్ఎస్ ప్రభుత్వమే బాధ్యత అని మంత్రి ఆరోపణ
- నిపుణుల సూచనల మేరకే ప్రాజెక్టులో నీటి నిల్వలు చేపడతామని స్పష్టం
- కాంగ్రెస్ ప్రభుత్వం రాకముందే ప్రాజెక్టు కుంగిపోయిందని వ్యాఖ్య
- గత పాలకుల నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని విమర్శ
- బీఆర్ఎస్ ప్రచారాన్ని ప్రజల ముందు తిప్పికొడతామని వెల్లడి

హైదరాబాద్, మనసులో మాట

తెలంగాణలో నీటి పారుదల ప్రాజెక్టులు, కరవు పరిస్థితులపై అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ వేడి ముదిరింది. మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.. విపక్ష బీఆర్ఎస్ పార్టీ తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కరవు పరిస్థితులు, రైతుల ఇబ్బందులను ఆసరాగా చేసుకుని బీఆర్ఎస్ నాయకులు చౌకబారు రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. రక్తం ప్యాకెట్లతో డ్రామాలు ఆడుతూ ప్రజలను తప్పుదోవ పట్టించాల్సిన అవసరం తమకు లేదని, కేవలం ఉనికిని కాపాడుకోవడానికే విపక్షాలు ఇలాంటి చీప్ పాలిటిక్స్ చేస్తున్నాయని తీవ్రంగా ఆక్షేపించారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడక ముందే కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయిందన్న పచ్చి నిజాన్ని ప్రతిపక్షాలు కావాలనే దాస్తున్నాయని పొన్నం ప్రభాకర్ విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఈ పరిస్థితికి రావడానికి, పిల్లర్లు కుంగిపోవడానికి పూర్తిగా గత బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతి, అలసత్వమే కారణమని ఆరోపించారు. నాసిరకం నిర్మాణాలు, ఇంజినీరింగ్ లోపాల వల్లనే ఆ ప్రాజెక్టు దెబ్బతిన్నదని, ఆ పాపాన్ని ఇప్పుడు తమ ప్రభుత్వంపై నెట్టేందుకు గులాబీ నేతలు ప్రయత్నించడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకలను, బీఆర్ఎస్ నాయకులు చేసిన మోసాలను తాము ఊరూరా తిరిగి ప్రజలకు వివరిస్తామని మంత్రి స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల సొమ్మును ఎలా వృథా చేశారో, ప్రాజెక్టు పేరిట ఏ విధంగా దోపిడీకి పాల్పడ్డారో వాస్తవాలతో సహా ప్రతి గ్రామంలోనూ ఎండగడతామన్నారు. ప్రజలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలని చూస్తున్న ప్రతిపక్షాల కుట్రలు ఇకపై సాగవని హెచ్చరించారు.

జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ తుది నివేదిక వచ్చిన తర్వాతే కాళేశ్వరం ప్రాజెక్టులో నీటిని నింపే విషయమై ప్రభుత్వం ఒక నిర్ణయానికి వస్తుందని మంత్రి వివరించారు. ఎన్‌డీఎస్ఏ నిపుణులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి, ప్రాజెక్టు సురక్షితంగా ఉందని చెబితే వెంటనే నీటిని నింపుతామన్నారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా, శాస్త్ర సాంకేతిక నిపుణులు, అనుభవజ్ఞులైన ఇంజినీర్లు ఇచ్చే సలహాలను పాటిస్తూ బాధ్యతాయుతంగా ముందుకు సాగుతామన్నారు. ప్రాజెక్టు మళ్లీ పూర్తి స్థాయిలో ఉపయోగంలోకి రావడానికి ఏం చేయాలో నిపుణులు సూచిస్తే వాటిని తూచా తప్పకుండా అమలు చేస్తామని ప్రకటించారు.

ప్రస్తుత కరవు పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రజలలో ఆందోళన కలిగించేలా బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారని పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడిగడ్డ, కన్నెపల్లి పంప్‌హౌస్ విషయాల్లో కావాలనే రాజకీయం చేస్తూ రచ్చ సృష్టిస్తున్నారని విమర్శించారు. కరవు అనేది ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన సమస్య అని, దానిని అందరం కలిసి ఎదుర్కోవాలే తప్ప.. శవాల మీద పేలాలు ఏరుకున్న చందంగా రాజకీయం చేయడం తగదని హితవు పలికారు.

ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు, పర్యావరణ నిపుణులు ఇప్పటికే హెచ్చరించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. తీవ్రమైన ఎల్‌నినో ప్రభావం వల్ల దేశవ్యాప్తంగా కరవు పరిస్థితులు నెలకొంటున్నాయని చెప్పారు. ఈ భయంకరమైన ప్రకృతి సవాలును ఎదుర్కోవడానికి ప్రభుత్వం వైపు నుంచి అన్ని రకాల ముందస్తు చర్యలు, నివారణ సూచనలు చేస్తున్నామని వెల్లడించారు. తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తుగా నిధులు కేటాయించి పనులను పర్యవేక్షిస్తున్నామన్నారు.

తక్కువ నీటి వనరులతో పండే ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మొగ్గు చూపాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ప్రస్తుత నీటి లభ్యత, కరవు తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ అధికారులు ఇచ్చే సలహాలను పాటించాలన్నారు. నీటి వినియోగం తక్కువగా ఉండే పంటల సాగు ద్వారా నష్టాల నుంచి బయటపడవచ్చని, వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.



ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుని నిలబడేలా రైతాంగాన్ని చైతన్యపరుస్తున్నామన్నారు. రాజకీయ పార్టీల మధ్య అంతర్గతంగా ఎన్ని విభేదాలు, సమస్యలు ఉన్నప్పటికీ.. కరవు వంటి సంక్షోభ సమయాల్లో అందరూ ఏకతాటిపైకి వచ్చి ప్రజలను ఆదుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా ప్రభుత్వానికి మంచి సలహాలు, సూచనలు ఇవ్వాలే తప్ప.. అనవసరపు రాద్ధాంతం చేయవద్దని హితవు పలికారు. ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవడానికి ప్రభుత్వం అన్ని శక్తులతో సిద్ధంగా ఉందని, ప్రజా ప్రయోజనాలే తమ ప్రథమ ప్రాధాన్యత అని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

# భారత్‌లోకి అమెరికా మాజీ సైనికులు!

మనసులో మాట

భారతదేశంలోకి అమెరికా మాజీ సైనికులు ఎలాంటి పత్రాలు లేకుండా అక్రమంగా చొరబడుతుండటం ఇప్పుడు దేశ భద్రతా వర్గాలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. భారత్ నుంచి నేపాల్ దేశంలోకి దొంగచాటుగా ప్రవేశించడానికి ప్రయత్నిస్తున్న ఒక అమెరికా మాజీ నేవీ అధికారిని ఉత్తర్ ప్రదేశ్‌లోని మహారాజ్‌గంజ్ జిల్లా సరిహద్దులో 'సహస్త్ర సీమా బల్' (ఎస్ఎస్‌బీ) బలగాలు వ్యూహాత్మకంగా అడ్డుకుని అరెస్ట్ చేశాయి. విదేశీయులకు సంబంధించిన ఎలాంటి గుర్తింపు కార్డులు లేదా ప్రయాణ పత్రాలు (పాస్‌పోర్ట్, వీసా) లేకుండా అతడు అనుమానాస్పదంగా యూపీ సరిహద్దుల్లో తిరుగుతుండటంతో బలగాలు తనిఖీలు చేపట్టాయి. భద్రతా బలగాల తనిఖీల్లో పట్టుబడిన ఆ విదేశీయుడిని అమెరికాలోని కాలిఫోర్నియా ప్రాంతానికి చెందిన జోర్డాన్ బ్రౌన్‌గా అధికారులు గుర్తించారు. సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద ఎస్ఎస్‌బీ జవాన్లు అతడిని ఆపి నిలదీయగా.. బ్రౌన్ అక్కడి నుంచి తప్పించుకుని పారిపోవడానికి తీవ్రంగా ప్రయత్నించినట్లు పోలీసులు వెల్లడించారు. అయితే అలర్ట్ అయిన జవాన్లు అతడిని చుట్టుముట్టి బంధించారు. అనంతరం అతడిని స్థానిక పోలీసులకు అప్పగించగా.. సరైన పత్రాలు లేకుండా దేశంలో తిరుగుతున్నందుకు ఇమిగ్రేషన్ చట్టాల కింద కేసు నమోదు చేసి లోతుగా విచారణ ప్రారంభించారు.


పోలీసులు, నిఘా వర్గాల ప్రాథమిక విచారణలో జోర్డాన్ బ్రౌన్ తన నేపథ్యానికి సంబంధించి పలు ఆసక్తికర విషయాలు వెల్లడించాడు. తాను కాలిఫోర్నియా యూనివర్సిటీలో ఉన్నత చదువులు చదువుకున్నానని, ఆ తర్వాత దాదాపు ఆరేళ్ల పాటు అమెరికా సైన్యంలో (నేవీ) పనిచేసినట్లు ఒప్పుకున్నాడు. గత 2025 నవంబర్ నెలలో తాను విమానంలో కాకుండా సముద్ర మార్గం ద్వారా దొంగచాటుగా భారత్‌లోకి ప్రవేశించినట్లు అధికారులు కనుగొన్నారు. దేశంలోకి వచ్చినప్పటి నుంచి అతడు గోవాలో శాశ్వతంగా నివసిస్తున్నాడని, ఈ మధ్య కాలంలో బెంగళూరు, లఖ్‌నవూ, గోరఖ్‌పూర్ వంటి కీలక నగరాలకు కూడా వెళ్లి వచ్చినట్లు నిఘా వర్గాలు గుర్తించాయి.

అయితే, విచారణ సాగుతున్న కొద్దీ జోర్డాన్ బ్రౌన్ అధికారుల ప్రశ్నలకు పొంతనలేని, పరస్పర విరుద్ధమైన సమాధానాలు చెబుతూ గందరగోళానికి గురిచేస్తున్నాడు. మూడేళ్ల క్రితం తనకు ఉత్తరాఖండ్‌కు చెందిన ఒక భారతీయ మహిళతో పరిచయం ఏర్పడిందని, 2024 అక్టోబర్‌లో తామిద్దరం పెళ్లి చేసుకున్నామని చెప్పాడు. కానీ, అదే సమయంలో తాను ఇటలీ పర్యటనలో ఉన్నానని చెప్పడం అనుమానాలకు తావిచ్చింది. ఆ తర్వాత తాను టూరిస్ట్ వీసాపై థాయ్‌లాండ్ వెళ్లానని, అక్కడ పాస్‌పోర్టు పోవడంతో సముద్ర మార్గంలో భారత్ వచ్చానని అన్నాడు. ఇప్పుడు గోవాలో పరిచయమైన ఒక నేపాల్ వ్యక్తిని కలవడానికి సరిహద్దు దాటుతున్నానని, తన అసలు పాస్‌పోర్ట్ బెంగళూరులోని ఒక స్నేహితుడి దగ్గర ఉందని చెప్పడంతో అధికారులు అతడి మాటలను నమ్మడం లేదు.

జోర్డాన్ బ్రౌన్ అరెస్ట్ వ్యవహారం కేవలం ఒక సాధారణ చొరబాటు కేసు కాకపోవచ్చని నిఘా సంస్థలు భావిస్తున్నాయి. ఎందుకంటే, ఇటీవల పొరుగు దేశమైన మయన్మార్‌లోని మిలిటెంట్లకు అత్యాధునిక యుద్ధతంత్రాలలో ఉగ్రశిక్షణ ఇస్తున్న అమెరికా మాజీ సైనికుడు మాథ్యూ వాన్‌డైక్‌తో పాటు ఐదుగురు ఉక్రెయిన్ పౌరులను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అరెస్ట్ చేసింది. ఈ నేపథ్యంలోనే బ్రౌన్ అరెస్ట్ ప్రాధాన్యత సంతరించుకుంది. అమెరికాకు చెందిన మాజీ సైనికులు టూరిస్ట్ వీసాల పేరుతో భారత్‌కు వచ్చి, ఇక్కడి నుంచి మిజోరాం సరిహద్దు ద్వారా మయన్మార్‌లోకి చొరబడి అక్కడి ఉగ్రవాద, తిరుగుబాటు ముఠాలతో చేతులు కలుపుతున్నట్లు దర్యాప్తులో తేలింది.

విదేశీ కిరాయి సైనికులు ఇతరులకు ఆయుధాలు, డ్రోన్లను చేరవేయడానికి భారత భూభాగాన్ని ఒక సురక్షితమైన రవాణా మార్గంగా (ట్రాన్సిట్ రూట్) వాడుకుంటున్నారా? అనే అనుమానాలకు అవుననే సమాధానాలు లభిస్తున్నాయి. కొన్నాళ్ల క్రితం కోల్‌కతాలో పట్టుబడిన మాథ్యూ వాన్‌డైక్ బృందం ఐరోపా దేశాల నుంచి అత్యాధునిక డ్రోన్లను తీసుకొచ్చి, ఈశాన్య భారత సరిహద్దుల గుండా మయన్మార్‌లోని తిరుగుబాటు ముఠాలకు స్మగ్లింగ్ చేసినట్లు పక్కా సమాచారం అందింది. ఇలా డ్రోన్లను దొంగరవాణా చేయడం, వాటిని అసెంబ్లింగ్ చేయడం, ఎలక్ట్రానిక్ యుద్ధరీతుల్లో మయన్మార్ ముఠాలకు శిక్షణ ఇవ్వడమే ఈ అంతర్జాతీయ ముఠాల పని అని రష్యా కూడా గతంలో తీవ్ర ఆరోపణలు చేసింది.

భారతదేశ భద్రతా నిబంధనల ప్రకారం విదేశీయులు ఎవరైనా సరే మిజోరాం వంటి సున్నితమైన ఈశాన్య సరిహద్దు రాష్ట్రాల్లో ప్రయాణించాలంటే ఖచ్చితంగా కేంద్ర ప్రభుత్వం జారీ చేసే 'రక్షిత ప్రాంత పర్మిట్' (ప్రొటెక్టెడ్ ఏరియా పర్మిట్ PAP) కలిగి ఉండాలి. కానీ, ఇప్పుడు అరెస్టయిన అమెరికా మాజీ సైనికులు మరియు విదేశీయులు ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండానే నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించారు. స్థానిక శక్తుల సహాయంతో రహస్యంగా ఈశాన్య భారతం నుంచి మయన్మార్‌లోకి ప్రవేశిస్తూ సరిహద్దు భద్రతకు పెద్ద సవాలుగా మారారు. ఇంతకీ ఈ వ్యవహారంలో కీలక సూత్రధారిగా ఉన్న మాథ్యూ వాన్‌డైక్ సాదాసీదా వ్యక్తి కాదు. 'సన్స్ ఆఫ్ లిబర్టీ ఇంటర్నేషనల్' అనే అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ ముసుగులో అతడు ఒక కిరాయి సైన్యాల ముఠాను నడుపుతున్నాడు. గతంలో లిబియా అంతర్యుద్ధం జరిగిన సమయంలో అక్కడి పాలకుడు గడాఫీకి వ్యతిరేకంగా స్వయంగా తుపాకీ పట్టి పోరాడటం ద్వారా ప్రపంచవ్యాప్తంగా వార్తల్లోకెక్కాడు. ఆ తర్వాత సిరియా అంతర్యుద్ధంలోనూ పాల్గొని అక్కడి తిరుగుబాటుదారులకు శిక్షణ ఇచ్చాడు. మోటార్ సైకిల్‌పై ఉత్తర ఆఫ్రికా, పశ్చిమాసియా దేశాల్లో విస్తృతంగా పర్యటించిన చరిత్ర ఇతనికి ఉంది.



# మన కాలపు మనస్సాక్షి

మలయాళ కవిత్వాన్ని ఒక విశాల నదిగా ఊహిస్తే, సచ్చిదానందన్ సుదూర మానవ అనుభవాల నుంచి సంద్రాల నుంచి ఆ నదిలో కలిసే ప్రవాహంలా కనిపిస్తాడు. చరిత్రలోని చేదు, ప్రవాసాల ధూళి, అనేక భాషల మాధుర్యం...

మలయాళ కవిత్వాన్ని ఒక విశాల నదిగా ఊహిస్తే, సచ్చిదానందన్ సుదూర మానవ అనుభవాల నుంచి సంద్రాల నుంచి ఆ నదిలో కలిసే ప్రవాహంలా కనిపిస్తాడు. చరిత్రలోని చేదు, ప్రవాసాల ధూళి, అనేక భాషల మాధుర్యం, మానవత్వపు అశాంత స్వప్నాలను వెంట తెచ్చుకునే కవితా ప్రవాహం అది. ఆయన కవిత్వ హృదయంలో మానవ స్వేచ్ఛ పట్ల అచంచలమైన నిబద్ధత ధ్వనిస్తుంది. రాజకీయ, సామాజిక, మత, భాషా, సాంస్కృతికాల్లో ఏ రూపంలో వచ్చిన అణచివేతనైనా ఆయన కవిత్వం ప్రశ్నిస్తుంది, ప్రతిఘటిస్తుంది. అయితే ఆ ప్రతిఘటన కేవలం నినాదంగా ఉండదు. కవిత్వంగా రూపాంతరం చెందుతుంది. మౌన నైతిక శక్తితో, లోతైన మానవీయతతో పాఠకుని మనసు తాకుతుంది.సచ్చిదానందన్ ఊహాజగత్తులో ప్రకృతిది కేంద్రస్థానం. చెట్లు, నదులు, పక్షులు, వర్షాలు, విత్తనాలు, ఋతువులు ఆయన కవితల్లో అలంకార వస్తువులు కావు. జీవంతో నిండిన రూపాలు. అవి మనుషులతో సంభాషిస్తాయి. వారి విధుల్లో భాగస్వాములవుతాయి. ఆయన కవిత్వంలో ప్రకృతి భూమితో విడిపోయిన మన బంధాన్ని గుర్తుచేసే జీవశక్తి. రవీంద్రనాథ్ ఠాగూర్ మానవ ఆత్మ వికాసంలో అనంతాన్ని అన్వేషించాడు. పాబ్లో నెరూడా సంఘర్షణలో చరిత్రను, ఆకలిలో విప్లవాన్ని కనుగొన్నాడు. ఆక్టావియో పాజ్ భాషా-ఏకాంతాల చిక్కుముడుల్లో దాగి ఉన్న ఆత్మను వెతికాడు. సచ్చిదానందన్ ఈ మూడు సంప్రదాయాలతో సంభాషిస్తూనే తన దైన ప్రత్యేక స్వరం నిలబెట్టుకున్నాడు.

సచ్చిదానందన్ కవిత్వ చూపు భూమి వైపు, ఎడారులు దాటుతున్న శరణార్థుల వైపు, కనిపించని భారాలు మోస్తున్న కార్మికుల వైపు, దురాశ ఫలితంగా ముప్పులో ఉన్న అడవుల వైపు, యుద్ధ ఛాయల కింద చిక్కిన పిల్లల వైపు చూస్తుంది. నెరూడాలాగే అన్యాయాల పట్ల కవిత్వం మౌనంగా ఉండకూడదని సచ్చిదానందన్‌కు తెలుసు. అయితే ఆయన మంద్ర స్వరంలోని శక్తిని ఎంచుకుంటాడు. సచ్చిదానందన్ కవిత్వంలో ప్రతిఘటన బిగించిన పిడికిలి కాదు, తెరిచి ఉన్న గాయం. ఆయన అరిచి ఒప్పించడు, నిశ్శబ్దాన్నే మాట్లాడిస్తాడు.సచ్చిదానందన్ కవిత్వ ప్రత్యేకత 'నైతికతను' శ్రద్ధగా మలచడంలో ఉంది. ప్రతి జీవికి వినిపించే హక్కు ఉందన్న భావంతో రాస్తాడు. ఆయన కవితల్లో పక్షులు ప్రకృతి అలంకారాలు కావు, అవి స్వేచ్ఛ గల పౌరులు. చాలామంది కవులు ప్రపంచం గురించి రాస్తారు. సచ్చిదానందన్ ప్రపంచాన్ని వింటాడు. అదే ఆయనను ప్రత్యేకంగా నిలబెడుతుంది. నేటి ప్రపంచం ఒక మహా విమానాశ్రయంలా కనిపిస్తే దానినుండి లక్షలాది మంది ప్రయాణిస్తున్నారు. కానీ చాలా కొద్దిమంది మాత్రమే నిజంగా గమ్యాన్ని చేరుకుంటున్నారు. దేశాలు తమ చుట్టూ కంచెలు కట్టుకుంటున్నాయి. మతాలేమో గోడల్ని నిర్మిస్తున్నాయి. మార్కెట్లు ప్రతిదాన్నీ వస్తువుగా మారుస్తున్నాయి. ఈ గందరగోళాల నడుమ సచ్చిదానందన్ కవిత్వం రాజకీయాల సరిహద్దుల్ని దాటి పలకరిస్తుంది పలవరిస్తుంది. కేరళ నుంచి పాలస్తీనాకు, లాటిన్ అమెరికా నుంచి ఆఫ్రికాకు, ఒక గ్రామీణ దారి నుంచి ప్రపంచ సంక్షోభాల వరకూ ప్రయాణిస్తూ మానవ గౌరవం అవిభాజ్యమన్న సందేశాన్ని మోస్తుంది. ఆయన కవితలు బాధకు జాతీయత ఉండదని గుర్తుచేస్తాయి. అందుకే అవి భాషల సరిహద్దులను దాటి ప్రతిధ్వనిస్తాయి.

ఆయన కవిత్వమంతటా లోతైన పర్యావరణ చైతన్యం ప్రవహిస్తుంది. ప్రపంచంలో పర్యావరణ విపత్తు ముఖ్యమైన ప్రమాదంగా దేశాలు గుర్తించకముందే ప్రకృతి విధ్వంసమంటే మానవ విధ్వంసమే అని ఆయన గ్రహించాడు. ఆయన కవిత్వంలో ఒక చెట్టు నరికివేత కేవలం పర్యావరణ సంఘటన కాదు. భూమి మనిషి చరిత్రలో ఒక అధ్యాయం చెరిపివేయడమే. ఆ సున్నితత్వమే ఆయన కవిత్వానికి అరుదైన నైతిక స్పృహను స్పర్శను అందిస్తుంది. ఆయన మనిషిని ప్రకృతి నుంచి వేరుగా చూడడు, ప్రకృతిలో భాగంగానే చూస్తాడు. మానవ నాగరికతలో భాగంగా పక్షులు, నదులు, అడవులు, మన చుట్టూ నిశ్శబ్దంగా జీవించే అనేక జీవులతో మనం మరచిపోయిన బంధాన్ని పునరుద్ధరించడంలోనే మనిషి మనుగడ వుందని ఆయన కవితలు సూచిస్తాయి. ఆయన రచనల్లో- చెట్లు జ్ఞాపకాల భాండాగారాలు. నదులు కాలంలో ప్రవహించే జీవిత చరిత్రలు.

స్థానికతకూ విశ్వజనీనతకూ మధ్య, వేర్లకూ వృక్షానికీ మధ్య, సాంస్కృతిక అస్తిత్వానికీ ప్రపంచ చైతన్యానికీ మధ్య నిరంతర సంభాషణ జరిపిన అరుదైన భారతీయ రచయితల్లో ఆయన ఒకరు. ఆయన కవిత్వం- విభజనలతో నిండిపోతున్న ఈ కాలంలో ఆతిథ్యంగా నిలుస్తుంది, గోడలు కడుతున్న చోట కిటికీలు తెరుస్తుంది, ఎడారులు విస్తరిస్తున్న చోట చెట్లను నాటుతుంది, పంజరాలు పెరుగుతున్న చోట పక్షులను విడుదల చేస్తుంది- బహుశా ఇదే కె. సచ్చిదానందన్ రచనల శాశ్వత ప్రాసంగికత. గడిచిపోయిన ప్రతి కాలం రాతి, ఉక్కులపై రాతల్ని, స్మారకాలను నిర్మిస్తుంది. కానీ కొద్ది కాలాల్లోని సృజనకారులే సజీవమైన మనస్సాక్షిని సృష్టిస్తారు. తమ భాషకే కాకుండా తమ కాలపు మనస్సాక్షిగా ఎదుగుతారు. అలాంటి అరుదైన మనస్సాక్షులలో కె. సచ్చిదానందన్ ఒకరు. సాహిత్యానికి నిజమైన మాతృభూమి దేశమో భాషో కాదని, మానవ హృదయమే నని నిరంతరం మనకు బోధిస్తున్న కవి సచ్చిదానందన్.

డాక్టర్ కంచర్ల అచ్యుతరావు
ఎడిటర్, మనసులో మాట దినపత్రిక



# బంగ్లాదేశ్‌కు షేక్ హసీనా రాకపై ఉత్కంఠ

- స్వదేశానికి వస్తే చట్టపరమైన చర్యలు తప్పవని బంగ్లాదేశ్ మంత్రి వ్యాఖ్య
- అరెస్టు, జైలు శిక్షకు సిద్ధమేనని షేక్ హసీనా ప్రకటన
- కోర్టు తీర్పు మేరకే తదుపరి చర్యలు ఉంటాయని స్పష్టం
- చట్టం ముందు అందరూ సమానమేనని మంత్రి షామా ఒబైద్ వ్యాఖ్య
- హసీనా భవిష్యత్తుపై న్యాయవ్యవస్థే తుది నిర్ణయం తీసుకుంటుందని వెల్లడి
- రాజకీయ సందేశం కోసమే హసీనా వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శ

**మనసులో మాట**



బంగ్లాదేశ్ రాజకీయాల్లో మరోసారి తీవ్ర ఉత్కంఠ రేపుతూ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా స్వదేశానికి తిరిగి వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఈ పరిణామంపై బంగ్లాదేశ్ ప్రస్తుత ప్రభుత్వం అత్యంత ఘాటుగా స్పందించింది. షేక్ హసీనా గనుక తిరిగి బంగ్లాదేశ్‌లో అడుగుపెడితే ఆమెను వెంటనే అరెస్ట్ చేసి జైలుకు తరలిస్తామని ఆ దేశ విదేశాంగ శాఖ సహాయ మంత్రి షామా ఒబైద్ ఇస్లాం చాలా స్పష్టంగా ప్రకటించారు. ఆమె ఎక్కడ లొంగిపోయినా సరే, దేశ సరిహద్దుల్లోకి రాగానే చట్టపరమైన నిబంధనల ప్రకారం తక్షణమే అరెస్ట్ ప్రక్రియ అమలవుతుందని వెల్లడించారు.

మాజీ ప్రధాని షేక్ హసీనా లొంగిపోవడానికి సిద్ధపడితే, ప్రస్తుతం దేశంలో అమలులో ఉన్న సాధారణ చట్టాల ప్రకారమే తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి షామా ఒబైద్ వివరించారు. చట్టం ఎవరికైనా ఒకేలా ఉంటుందని, తన పని తాను చేసుకుపోతుందని అన్నారు. హసీనా ఇప్పటికే కోర్టు ద్వారా దోషిగా తేలిన వ్యక్తి అని గుర్తుచేసిన ఆయన.. ఈ విషయంలో ప్రభుత్వం ప్రత్యేకంగా విచారించాల్సిన లేదా మినహాయింపులు ఇవ్వాల్సిన అవసరమేమీ లేదని తేల్చి చెప్పారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారు ఎవరైనా సరే శిక్ష అనుభవించాల్సిందేనని స్పష్టం చేశారు.

షేక్ హసీనా ఒకవేళ పొరుగు దేశమైన భారత్‌లో ఉన్న బంగ్లాదేశ్ రాయబార కార్యాలయంలో లొంగిపోయినా, లేదా నేరుగా బంగ్లాదేశ్ వచ్చి కోర్టులో లొంగిపోయినా సరే.. ముందుగా ఆమె జైలు గడప తొక్కాల్సిందేనని విదేశాంగ సహాయ మంత్రి స్పష్టం చేశారు. ఆమె దేశానికి తిరిగి వచ్చిన తర్వాత చట్టపరమైన విచారణ ఏ విధంగా సాగాలి, తదుపరి చర్యలు ఎలా ఉండాలనే అత్యంత కీలకమైన అంశాలను పూర్తిగా దేశ న్యాయవ్యవస్థే నిర్ణయిస్తుందని చెప్పారు. ఇందులో ప్రభుత్వ జోక్యం ఏమీ ఉండబోదని వివరించారు.

షేక్ హసీనాను తిరిగి దేశానికి రప్పించే చట్టపరమైన ప్రక్రియ గత తాత్కాలిక ప్రభుత్వ హయాంలోనే మొదలైందని, ప్రస్తుతం అధికారంలో ఉన్న బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) నేతృత్వంలోని ప్రభుత్వం కూడా అదే పంథాను కొనసాగిస్తోందని మంత్రి తెలిపారు. విదేశాల్లో తల దాచుకుంటూ తాను త్వరలోనే బంగ్లాదేశ్‌కు తిరిగి వస్తానంటూ హసీనా చేస్తున్న ప్రకటనలు కేవలం రాజకీయ సంకేతాల కోసమేనని ఆయన అభిప్రాయపడ్డారు. దేశం విడిచి పారిపోయిన లేదా అజ్ఞాతంలో ఉన్న అవామీ లీగ్ నాయకులు, కార్యకర్తల్లో తిరిగి ధైర్యం నింపేందుకే ఆమె ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారని, లొంగిపోవడం ఆమె అసలు ఉద్దేశం కాకపోవచ్చని విమర్శించారు.

బంగ్లాదేశ్‌లో 2024 జులై నెలలో ప్రభుత్వ ఉద్యోగాల రిజర్వేషన్లకు వ్యతిరేకంగా విద్యార్థులు పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టిన సంగతి తెలిసిందే. ఆ నిరసనలు క్రమంగా తీవ్రరూపం దాల్చి, చివరకు హసీనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమంగా మారాయి. ఆగ్రహించిన ఆందోళనకారులు ఏకంగా ప్రధానమంత్రి అధికారిక నివాసాన్ని ముట్టడించడంతో.. 2024 ఆగస్టు 5న షేక్ హసీనా తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ప్రాణభయంతో ఆమె హుటాహుటిన ఢాకా నగరాన్ని విడిచి భారత్‌కు చేరుకున్నారు. అప్పటి నుంచి ఆమె ఢిల్లీలోని ఒక సురక్షిత, రహస్య ప్రదేశంలో నివసిస్తున్నారు.

విద్యార్థుల నిరసనలను ఉక్కుపాదంతో అణచివేసే క్రమంలో మానవత్వానికి వ్యతిరేకంగా కఠిన నేరాలకు, హింసకు పాల్పడ్డారనే ఆరోపణలపై హసీనాపై బంగ్లాదేశ్‌లో అనేక కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాత ఏర్పాటైన యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం ఈ ఘోరాలపై ప్రత్యేక న్యాయ విచారణకు ఆదేశించింది. దీనిపై విచారణ జరిపిన బంగ్లాదేశ్ ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్ (ఐసీటీ) గతేడాది హసీనాకు మరణశిక్ష విధిస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. అయితే, ఈ తీర్పుతో పాటు తనపై వచ్చిన ఆరోపణలన్నీ పూర్తిగా రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగమేనని షేక్ హసీనా మొదటి నుంచి కొట్టిపారేస్తున్నారు.

ఇదిలా ఉండగా, ఇటీవల ఒక అంతర్జాతీయ వార్తా సంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో షేక్ హసీనా ఎంతో భావోద్వేగంగా మాట్లాడారు. తాను త్వరలోనే బంగ్లాదేశ్‌కు వెళ్లే ఆలోచనలో ఉన్నానని స్పష్టం చేశారు. స్వదేశానికి తిరిగి వెళ్లి కోర్టు ముందు లొంగిపోయేందుకు తనకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. రాజకీయాల కోసం తాను అరెస్టు కావడానికైనా, లేదా చావడానికైనా సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. ఒకవేళ తనకు మరణం సంభవించాల్సి వస్తే, అది పరాయి దేశంలో కాకుండా తన కన్న సొంత గడ్డపైనే జరగాలని కోరుకుంటున్నట్లు హసీనా ఆవేదన వ్యక్తం చేశారు.

కోర్టు తీర్పు వెలువడినప్పటి నుంచి షేక్ హసీనాను తమకు అప్పగించాలంటూ బంగ్లాదేశ్ ప్రభుత్వం భారత అధికార వర్గాలకు నిరంతరం లేఖలు రాస్తోంది. ఇప్పటికే పలుమార్లు అధికారిక లేఖలు పంపినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే హసీనా ఒక కీలక నిర్ణయానికి వచ్చారు. భారత ప్రభుత్వానికి తన వల్ల ఎలాంటి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతోనే తాను స్వదేశానికి వెళ్లాలని నిశ్చయించుకున్నట్లు తెలిపారు. ఈ ఏడాది డిసెంబర్ నెలలోనే తనతో పాటు అవామీ లీగ్ పార్టీకి చెందిన కీలక సీనియర్ నాయకులంతా కలిసి బంగ్లాదేశ్‌కు వెళ్లి అక్కడి న్యాయస్థానాల ముందు లొంగిపోవాలని ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నట్లు షేక్ హసీనా వెల్లడించారు.

# అయోధ్య విరాళాల చోరీ కేసు.. నేడు సిట్ ఫైనల్ రిపోర్ట్..?

దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన అయోధ్య రామమందిర విరాళాల చోరీ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తన నివేదికను బుధవారం(జూలై 15)న రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించే అవకాశం ఉంది. ముగ్గురు సభ్యులతో కూడిన సిట్ విరాళాల చోరీని దర్యాప్తు చేసింది. సిట్‌కు ఇచ్చిన అదనపు 15 రోజుల గడువు జూలై 15తో ముగియనుంది. దీంతో ఈ నివేదికను యూపీ అదనపు ప్రధాన కార్యదర్శి(హోం) సంజయ్ ప్రసాద్‌కు సమర్పించే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే, దర్యాప్తులో మరిన్ని అంశాలను పూర్తి చేసేందుకు సిట్ మరింత సమయం కోరుతుందా లేదా అనే దానిపై ఇంకా స్పష్టత లేదు. ఈ దర్యాప్తులో భాగంగా ఆర్థిక లావాదేవీలు, బ్యాంకు ఖాతాలు, సీసీటీవీ ఫుటేజ్, ఎలక్ట్రానిక్ ఆధారాలు, పత్రాలు, సాక్షులు, నిందితుల వాంగ్మూలాన్ని సిట్ పరిశీలించింది. ఈ నివేదికలో దోపిడీకి పాల్పడిన వ్యక్తులనే కాకుండా, పరిపాలనా లోపాలు, పర్యవేక్షణ వైఫల్యాలు, బాధ్యులైన అధికారుల్ని గుర్తించే అవకాశం ఉంది. విరాళాల సేకరణ, భద్రపరిచే విధానం, నగదు లెక్కింపు, బ్యాంకులో జమ, ఆడిట్, పర్యవేక్ష వ్యవస్థల్లో సంస్కరణలను సూచించే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే ఈ కేసులో అక్రమంగా మళ్లించిన నిధుల ఆనవాళ్లు గుర్తించేందుకు అయోధ్య పోలీసులు ఇన్‌కమ్ ట్యాక్స్(ఐటీ) డిపార్ట్మెంట్ సహాయం కోరారు. ఇప్పటివరకు అరెస్టయిన 8 మంది నిందితులు, వారి కుటుంబ సభ్యులకు సంబంధించిన దాదాపు 50 బ్యాంక్ ఖాతా లావాదేవీలను 2022 నుంచి పరిశీలిస్తారు. దోచుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నిధుల్ని బంధువుల ఖాతాల ద్వారా బదిలీ చేశారా? స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడుటు పెట్టారా? స్థిరాస్తులు కొనుగోలు చేశారా? ఇతర ఆర్థిక సాధనాల్లో పెట్టుబడి పెట్టారా? అనే కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ దర్యాప్తులో మరికొందరు వ్యక్తుల ప్రమేయం ఉంటే వారి అరెస్టులు, ఆస్తుల స్వాధీనం వంటి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.



# ఇరాన్ సైనిక సామర్థ్యం పూర్తిగా ధ్వంసం

- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన
- హర్మూజ్ నౌకలపై రక్షణకు 20 శాతం టోల్ బాదుడు
- యూఎస్ కాంగ్రెస్‌కు అధికారిక సమాచారం
- జూలై 7 నుంచే మళ్లీ యుద్ధ రంగంలోకి దిగినట్లు లేఖ
- శాంతి ఒప్పందాన్ని ఉల్లంఘించిన ఇరాన్
- దౌత్య ప్రయత్నాలను పక్కనబెట్టి నౌకలపై దాడులు
- వాణిజ్య నౌకలపై 20 శాతం టోల్ రక్షణ పన్ను
- ఓవల్ ఆఫీస్ నుంచి ట్రంప్ హెచ్చరికలు

**పశ్చిమాసియా, మనసులో మాట**



పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు మరింత ముదిరాయి. ఇరాన్‌కు సంబంధించిన సైనిక సామర్థ్యాన్ని తాము పూర్తిగా ధ్వంసం చేశామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. హర్మూజ్ జలసంధి ప్రాంతంలో ఇరాన్ ఉనికి లేకుండా చేసేందుకు, వారి సైనిక శక్తిని పూర్తిగా నిర్వీర్యం చేసే దిశగా అమెరికా బలగాలు భీకర దాడులు కొనసాగిస్తున్నాయని ఆయన వెల్లడించారు. శత్రుదేశం కోలుకోలేని విధంగా అమెరికా సైన్యం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోందని, ఇరాన్ దాడుల ఆటకట్టించేందుకు తాము వెనకడుగు వేసే ప్రసక్తే లేదని ట్రంప్ స్పష్టం చేశారు.

ఇరాన్ దేశంపై తాము తిరిగి సైనిక చర్యలను ప్రారంభించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారికంగా యూఎస్ కాంగ్రెస్‌కు తెలియజేశారు. ఈ మేరకు కాంగ్రెస్‌కు ఒక లేఖ పంపిన ఆయన, జూలై 7 నుంచే ఇరాన్‌పై దాడులను పునరుద్ధరించినట్లు స్పష్టం చేశారు. హర్మూజ్ జలసంధి గుండా వెళ్తున్న అంతర్జాతీయ నౌకలపై ఇరాన్ వరుస దాడులకు తెగబడటంతో, అంతర్జాతీయ నిబంధనల ప్రకారం నౌకల రక్షణ కోసం తాము ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని ట్రంప్ ఆ లేఖలో విడమరిచి చెప్పారు.

ఇటీవల కాలంలో అమెరికా, ఇరాన్ దేశాల మధ్య దౌత్యపరమైన చర్చలు జరిగి ఒక శాంతి ఒప్పందం కుదిరినప్పటికీ.. ఇరాన్ దాన్ని ఏమాత్రం గౌరవించలేదని ట్రంప్ ఆరోపించారు. ఒప్పందం కుదిరిన కొద్ది రోజులకే ఇరాన్ దాన్ని ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించిందన్నారు. తాము ఎంతో చిత్తశుద్ధితో శాంతి కోసం ప్రయత్నించినప్పటికీ, గతవారమే ఇరాన్ ఏకంగా మూడు అంతర్జాతీయ నౌకలపై దాడులు చేసిందని మండిపడ్డారు. ఒప్పందంలో తమకు నచ్చని అంశాలు ఉన్నాయనే నెపంతో వారు దాన్ని రద్దు చేసుకున్నారని, ఇటువంటి పిచ్చి చేష్టలను తాము ఎంతమాత్రం సహించబోమని ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణించే ఇతర దేశాల వాణిజ్య నౌకల నుంచి భారీగా 20 శాతం టోల్ పన్ను వసూల్ చేయనున్నట్లు ట్రంప్ కుండబద్ధలు కొట్టారు. ఇరాన్ ముఠాల దాడుల నుంచి అంతర్జాతీయ వాణిజ్య నౌకలకు అమెరికా సైన్యం పూర్తి రక్షణ కల్పిస్తోందని, ఇందుకు గాను తమకు భారీగా ఆర్థిక ఖర్చులు అవుతున్నాయని వివరించారు. ప్రపంచంలోనే అత్యంత సంపన్నమైన ఈ ప్రాంతానికి తాము ఉచితంగా రక్షణ కల్పించలేమని, రక్షణ కోసం అమెరికా పెడుతున్న ఖర్చులను ఆయా దేశాల నుంచే తిరిగి వసూల్ చేసుకుంటామని ఆయన తేల్చిచెప్పారు.

వైట్‌హౌస్‌లోని ఓవల్ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడిన ట్రంప్, ఇరాన్‌పై ఈ రాత్రి మరింత భీకరమైన దాడులు చేయబోతున్నట్లు హెచ్చరించారు. ఇప్పటికే ఆ దేశాన్ని అన్ని రంగాల్లోనూ దెబ్బతీశామని, వారి ఆర్థిక వనరులను కట్టడి చేశామని చెప్పారు. ఇందులో భాగంగా ఇరాన్ ఓడరేవులపై తాము మళ్లీ పూర్తి స్థాయిలో దిగ్బంధనం విధిస్తున్నట్లు ప్రకటించారు. అయితే ఈ దిగ్బంధనం కేవలం ఇరాన్ నౌకలకే పరిమితమని, హర్మూజ్ జలసంధిలో ఇతర దేశాల వాణిజ్య నౌకల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు, ఆటంకాలు ఉండబోవని ఆయన హామీ ఇచ్చారు.

చమురు అవసరాల కోసం అమెరికా ఎవరిపైనా ఆధారపడటం లేదని, ముఖ్యంగా గల్ఫ్ దేశాల చమురు తమకు అస్సలు అవసరం లేదని ట్రంప్ స్పష్టం చేశారు. ప్రపంచంలోనే అత్యధిక చమురు నిల్వలు ప్రస్తుతం అమెరికా వల్లే ఉన్నాయని ఆయన గర్వంగా ప్రకటించారు. ఒకవేళ వెనెజువెలా నిల్వలను కూడా కలిపితే.. ప్రపంచ చమురు సరఫరాలో 50 శాతానికి పైగా వాటా తమ పరిధిలోనే ఉంటుందన్నారు. తమ స్వంత అవసరాల కోసం కాకుండా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ స్థిరత్వం కోసం మరియు మిత్రదేశాల ప్రయోజనాల కోసమే తాము ఈ ప్రాంతంలో జోక్యం చేసుకుంటున్నామని వివరించారు.

పశ్చిమాసియాలో తమకు అత్యంత నమ్మకమైన మిత్ర దేశాలైన ఇజ్రాయెల్, సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ (యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్)ల భద్రతను కాపాడేందుకే అమెరికా ఈ సైనిక చర్యలకు పూనుకుందని ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ దూకుడు కారణంగా ఈ దేశాల ఉనికికి, ఆర్థిక ప్రయోజనాలకు ముప్పు వాటిల్లకుండా అమెరికా సైన్యం ఒక కవచంలా నిలబడుతుందని చెప్పారు. మిత్రపక్షాల రక్షణ బాధ్యతను తాము ఎంతో సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని, ఈ ప్రాంతంలో శాంతిభద్రతలను కాపాడటంలో అమెరికా పాత్ర ఎల్లప్పుడూ అగ్రగామిగానే ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

అమెరికా జరిపిన మెరుపు దాడుల్లో ఇరాన్ సైన్యానికి చెందిన టాప్ కమాండర్లలో అత్యధిక మంది అంతమొందించబడ్డారని ట్రంప్ సంచలన విషయాలు వెల్లడించారు. ఇరాన్ అగ్రనేత అలీ ఖమేనీ ఇప్పటికే చనిపోయాడని, సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ కూడా 90 శాతం చనిపోయినట్లేనని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఇరాన్ వద్ద ఎలాంటి నౌకాదళం గానీ, వైమానిక దళం గానీ మిగలలేదని.. అంతా సర్వనాశనమైందని చెప్పారు. వారి గగనతల రక్షణ వ్యవస్థలను సైతం అమెరికా క్షిపణులు పూర్తిగా ధ్వంసం చేశాయని, అత్యున్నత నాయకత్వం మొత్తం హతమవడంతో ఇరాన్ సైన్యం ఇప్పుడు నాయకుడు లేని నౌకలా మారిందని ట్రంప్ విశ్లేషించారు.

# అణు ముప్పును తప్పించిన ప్రధాని మోడీ!

- 2022లో ఉక్రెయిన్‌పై అణు దాడిని మోడీనే అడ్డుకున్నారు.
- పుతిన్ మోడీ మాటకు విలువనిస్తారు.
- భారత్, చైనా నాయకుల మాటకు రష్యా ప్రాధాన్యం.
- సంచలన వ్యాఖ్యలు చేసిన పోలాండ్ మంత్రి.



రష్యాఉక్రెయిన్ యుద్ధంలో భారత ప్రధాని నరేంద్రమోడీ కీలక పాత్ర పోషించాలని పోలాండ్ ఉప విదేశాంగ మంత్రి వ్లాడిస్లావ్ టియోఫిల్ బార్టోషెవ్స్కీ సంచలన వ్యాఖ్యలు చేశారు. 2022లో ఉక్రెయిన్‌పై వ్యూహాత్మక అణ్వాయుధాలను ప్రయోగించకుండా పుతిన్‌ను మోడీ అడ్డుకున్నారని చెప్పారు. మోడీ జోక్యంతోనే అణు యుద్ధంగా మారలేదని వెల్లడించారు. ఒక వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రపంచంలో కొద్ది మంది నేతల మాటలే వింటారని, అందులో ప్రధాని మోడీ ఒకరని అన్నారు. భారత్‌రష్యాల మధ్య దశాబ్దాల స్నేహ సంబంధాలు ఉన్నాయని, శాంతి చర్చల్లో భారత్ ప్రత్యేక స్థానం సంపాదించుకుందని ఆయన తెలిపారు. ప్రధాని మోడీ ప్రపంచవ్యాప్తంగా గౌరవం పొందిన నేత అని, ఆయన అభిప్రాయాలను పుతిన్ సీరియస్‌గా పరిగణిస్తారని పోలాండ్ మంత్రి అన్నారు. భారత్‌తో పాటు చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్ కూడా పుతిన్‌తో మాట్లాడగలితే నాయకుడని తెలిపారు. రష్యా శత్రువులుగా భావించని దేశాల నుంచి వచ్చే సూచనల్ని పుతిన్ ప్రాధాన్యం ఇస్తారని ఆయన అభిప్రాయపడ్డారు. గతంలో రష్యా నుంచి భారత్ ముడి చమురు కొనుగోలు చేయడాన్ని విమర్శించిన విషయాన్ని మంత్రి గుర్తు చేసుకున్నారు. అయితే తక్కువ ధరల కారణంగా భారత్ ఈ నిర్ణయం తీసుకుందని ఇప్పుడు అర్థమైందని, ఈ అంశంపై భారత్‌పోలాండ్ మధ్య విభేదాలు తగ్గాయని అన్నారు. ఇటీవల సెయింట్ పీటర్స్ బర్గ్ అంతర్జాతీయ ఆర్థిక వేదికపై పుతిన్ మోడీని కొనియాడారు. ఆయనపై ఒత్తిడి తీసుకురావడం ఎవరి వల్ల సాధ్యం కాదని అన్నారు.

# ప్రధాని మోడీపై మరోసారి బేర్ గ్రిల్స్ ప్రశంసల జల్లు!

- మోడీ ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన నాయకుడు
- మరోసారి ప్రధాని మోడీపై బేర్ గ్రిల్స్ ప్రశంసలు
- 2019లో ''మ్యాన్ వర్సెస్ వైల్డ్''లో మోడీతో సాహసయాత్ర



బ్రిటిష్ అడ్వెంచరర్, ప్రముఖ టెలివిజన్ వ్యాఖ్యాత బేర్ గ్రిల్స్ మరోసారి ప్రధాని మోడీపై ప్రశంసలు కురిపించారు. ప్రపంచంలోని అత్యంత శక్తివంతమైన నాయకుల్లో మోడీ ఒకరు అంటూ సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ప్రస్తుతం వైరల్‌గా మారింది. మాజీ అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా, బ్రిటన్ యువరాజు ప్రిన్స్ విలియంతో పాటు ప్రధాని మోడీతో కలిసి దిగిన ఫొటోలను పంచుకున్న బేర్ గ్రిల్స్.. నిజమైన గొప్ప నాయకులు ఎప్పుడూ గట్టిగా మాట్లాడేవారు కాదని వ్యాఖ్యానించారు. బేర్ గ్రిల్స్ తన పోస్ట్‌లో.. ''ప్రపంచంలోని అత్యంత శక్తివంతమైన నాయకుల్లో కొందరిని కలిశాను. కానీ నిజంగా గొప్ప నాయకులు ఎప్పుడూ పెద్దగా హడావుడి చేయరు.'' అని రాశారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశమయ్యాయి.

''మ్యాన్ వర్సెస్ వైల్డ్''లో మోడీతో సాహసయాత్ర 2019లో ఉత్తరాఖండ్‌లోని జిమ్ కార్బెట్ నేషనల్ పార్క్‌లో చిత్రీకరించిన 'మ్యాన్ వర్సెస్ వైల్డ్' ప్రత్యేక ఎపిసోడ్‌లో ప్రధాని మోడీ, బేర్ గ్రిల్స్ కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అడవుల్లో ట్రెక్కింగ్ చేయడం, భారీ వర్షంలో ప్రయాణించడం, గడ్డి, వెదురు సహాయంతో తాత్కాలిక తెప్ప తయారు చేయడం వంటి సాహస కార్యక్రమాలు చేపట్టారు. అదే సమయంలో పర్యావరణ పరిరక్షణ అవసరంపై ఇద్దరూ చర్చించారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ.. యువకుడిగా హిమాలయాల్లో గడిపిన రోజులు తన జీవితాన్ని పూర్తిగా మార్చాయని, ప్రకృతితో తనకు ప్రత్యేక అనుబంధాన్ని ఏర్పరిచాయని చెప్పారు. మనిషి ప్రకృతిని శత్రువుగా కాకుండా మిత్రుడిగా భావించాలని.. మనిషి ప్రకృతికి సహకరిస్తే.. ప్రకృతి కూడా మనిషికి సహకరిస్తుంది.'' అని పేర్కొన్నారు.

ఇక అడవిలో ప్రయాణించే సమయంలో పులుల నుంచి రక్షణ కోసం బేర్ గ్రిల్స్ ఒక తాత్కాలిక ఈటె తయారు చేశారు. అయితే దానిని ఆయుధంగా ఉపయోగించేందుకు ప్రధాని మోడీ నిరాకరించారు. ''నా పెంపకం ఏ ప్రాణినైనా చంపడానికి అనుమతించదు. కానీ మీరు పట్టుకోమంటున్నారు కాబట్టి దీన్ని చేతిలో ఉంచుకుంటాను.'' అంటూ మోడీ చెప్పిన మాటలు అప్పట్లో ట్రెండింగ్‌గా మారాయి. ఈ కార్యక్రమంలో ప్రధాని మోడీ స్వచ్ఛ భారత్ అభియాన్ గురించి కూడా ప్రస్తావించారు. వ్యక్తిగత పరిశుభ్రత భారతీయ సంస్కృతిలో భాగమని.. అదే విధంగా సమాజ పరిశుభ్రతపై కూడా ప్రతి ఒక్కరిలో బాధ్యత పెరగాల్సిన అవసరం ఉందని చెప్పారు.

కార్యక్రమం ప్రసారమైన తర్వాత.. బేర్ గ్రిల్స్‌కు హిందీ రాకపోయినా మోడీతో ఎలా మాట్లాడారనే సందేహం పలువురిలో వ్యక్తమైంది. దీనిపై తర్వాత 'మన్ కీ బాత్' కార్యక్రమంలో స్పందించిన ప్రధాని మోడీ.. షూటింగ్ మొత్తం సమయంలో ఇద్దరూ రియల్ టైమ్ ట్రాన్స్‌లేషన్ ఇయర్‌పీస్ టెక్నాలజీని ఉపయోగించినట్లు వెల్లడించారు.

**గతంలోనూ మోడీపై ప్రశంసలు**

'మ్యాన్ వర్సెస్ వైల్డ్' కార్యక్రమం తర్వాత కూడా బేర్ గ్రిల్స్ పలు సందర్భాల్లో ప్రధాని మోడీని ప్రశంసించారు. ఆయనను ''గొప్ప క్రీడాస్ఫూర్తి కలిగిన వ్యక్తి'', ''అసాధారణ ప్రపంచ నాయకుడు'' అంటూ అభివర్ణించారు.

# పర్షియన్ గల్ఫ్‌లో ఉద్రిక్తతలు: చిక్కుకున్న భారత నౌకలు!



అమెరికాఇరాన్‌ల మధ్య మళ్లీ యుద్ధ వాతావరణం నెలకొనడంతో వ్యూహాత్మక హర్మూజ్ జలసంధిలో నౌకల రవాణాకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో భారత జెండాతో ఉన్న 7 నౌకలు, అందులోని 148 మంది భారతీయ సిబ్బంది పర్షియన్ గల్ఫ్‌లోనే చిక్కుకుపోయినట్లు తాజాగా కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. అలాగే, భారత్‌కు వస్తున్న ఎరువులు, ఇతర సరుకులతో కూడిన మరో 11 విదేశీ నౌకలను సురక్షితంగా తరలించేందుకు (ఎవాక్యుయేషన్) ఏర్పాట్లు జరుగుతున్నట్లు తెలిసింది. ప్రస్తుతం గల్ఫ్ రీజియన్‌లో చిక్కుకున్న భారతీయ నావికులను రక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం భారత నౌకాదళంతో (ఇండియన్ నేవీ) నిరంతరం సమన్వయం చేసుకుంటున్నట్లు సమాచారం.

**మిస్సైల్ దాడుల్లో భారతీయుడి మృతి..**

ఇటీవల ఇరాన్‌అమెరికాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం రద్దయ్యాక గల్ఫ్ ప్రాంతంలో దాడులు ముదిరాయి. హర్మూజ్ జలసంధి గుండా వెళ్తున్న యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (UAE) కు చెందిన 'మొంబాసా', 'అల్ బహియా' అనే రెండు ఆయిల్ ట్యాంకర్లపై మిస్సైల్ దాడులు జరిగాయి. ఈ ప్రమాదంలో ఒక భారతీయ నావికుడు మరణించగా, ఆరుగురు గాయపడ్డారు. తమ హెచ్చరికలను బేఖాతరు చేయడం వల్లే ఈ దాడులు చేసినట్లు ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (IRGC) ప్రకటించింది. తాజా ఘటనతో కలిపి ఈ ఏడాది ఫిబ్రవరి 28 నుంచి మొదలైన ఈ పశ్చిమాసియా ఘర్షణల్లో ఇప్పటివరకు ప్రాణాలు కోల్పోయిన భారతీయ నావికుల సంఖ్య 14కు చేరినట్లు జాతీయ మీడియా స్పష్టం చేస్తోంది.

**మార్గాల వివాదం..**

**పట్టుబడుతున్న అమెరికా, ఇరాన్**

హర్మూజ్ జలసంధిని దాటడానికి రెండు మార్గాలు ఉన్నాయి. ఒమన్ సరిహద్దుల గుండా వెళ్లే దక్షిణ మార్గాన్ని అమెరికా, అంతర్జాతీయ నౌకాయాన సంస్థ (IMO) సమర్థిస్తుండగా, తమ జలాల గుండా వెళ్లే ఉత్తర మార్గాన్నే వాడాలని ఇరాన్ పట్టుబడుతోంది. ఇరాన్ దాడుల భయంతో దక్షిణ మార్గంలో నౌకల రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. కొన్ని నౌకలు తమ లొకేషన్ ట్రాకర్లను (ట్రాన్స్‌పాండర్లు) నిలిపివేసి రహస్యంగా ప్రయాణిస్తున్నట్లు సమాచారం.

**భద్రతా ఛార్జీలపై ట్రంప్ ప్రకటన**

ఇరాన్ ఈ జలసంధిని మూసివేస్తామని హెచ్చరించడంతో, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. హర్మూజ్ జలసంధి ఎప్పటికీ తెరిచే ఉంటుందని, దానికి అమెరికా సైన్యమే సంరక్షకుడిగా ఉంటుందని స్పష్టం చేశారు. అయితే, ఈ మార్గం గుండా వెళ్లే అన్ని రకాల సరుకు రవాణాపై 20 శాతం భద్రతా రుసుము (ఛార్జీ) వసూలు చేస్తామని ట్రంప్ ప్రకటించడం అంతర్జాతీయంగా సంచలనం సృష్టిస్తోంది. ఈ ప్రతిపాదనను అంతర్జాతీయ నౌకాయాన సంస్థ (IMO) తో పాటు ఇరాన్ కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.



# విడిపోతుంది, కలుస్తుంది, వస్తువులను మింగేస్తుంది.. కొరియా శాస్త్రవేత్తల అద్భుత ఆవిష్కరణ!

- జీవకణంలా ఆకారం మార్చుకునే లిక్విడ్ మెటల్ రోబో ఆవిష్కరణ
- దక్షిణ కొరియాలోని సియోల్, గచోన్ యూనివర్సిటీ శాస్త్రవేత్తల విజయం
- అయస్కాంత క్షేత్రాలతో నియంత్రణ.. ఇరుకు ప్రదేశాల్లోకి సులభంగా ప్రయాణం
- విడిపోవడం, తిరిగి కలవడం, వస్తువులను మింగేయడం దీని ప్రత్యేకతలు
- వైద్యం, పరిశ్రమలు, విపత్తు సహాయక చర్యల్లో వినియోగించే అవకాశం

టెక్నాలజీ రంగంలో మరో అద్భుతం ఆవిష్కృతమైంది. దక్షిణ కొరియా శాస్త్రవేత్తలు జీవకణంలా ప్రవర్తించే, తన ఆకారాన్ని మార్చుకోగల ఒక వినూత్నమైన లిక్విడ్ మెటల్ రోబోను అభివృద్ధి చేశారు. సియోల్ నేషనల్ యూనివర్సిటీ, గచోన్ యూనివర్సిటీ పరిశోధకులు సంయుక్తంగా రూపొందించిన ఈ రోబో, సాఫ్ట్ రోబోటిక్స్ రంగంలో ఒక మైలురాయిగా నిలవనుంది. ఈ అధ్యయన వివరాలు ప్రముఖ సైన్స్ అడ్వాన్సెస్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఈ రోబోను ద్రవరూప లోహం (లిక్విడ్ మెటల్), అయస్కాంత కణాలతో తయారుచేశారు. దీని బయటి పొరపై నీటిని వికర్షించే (సూపర్ హైడ్రోఫోబిక్) కణాలతో కవచంలా ఏర్పాటు చేశారు. దీనివల్ల ఇది తన ఆకారాన్ని కోల్పోకుండా స్థిరంగా ఉంటుంది. బయటి నుంచి అయస్కాంత క్షేత్రాలను ఉపయోగించి బ్యాటరీలు లేదా మోటార్లు లేకుండానే దీనిని నియంత్రించవచ్చు. ఈ రోబో తన పరిమాణం కన్నా చిన్నవైన, ఇరుకైన ప్రదేశాల్లోకి కూడా సులభంగా దూరిపోయి, బయటకు వచ్చాక తిరిగి తన అసలు ఆకారాన్ని సంతరించుకోగలదు. అంతేకాదు, అవసరమైనప్పుడు చిన్నచిన్న రోబోలుగా విడిపోవడం, మళ్లీ అన్నీ కలిసి ఒకే రోబోగా మారిపోవడం దీని ప్రత్యేకత. శరీరంలోని కణాలు బాహ్య పదార్థాలను మింగేసినట్టుగా (ఫాగోసైటోసిస్), ఈ రోబో కూడా చిన్న వస్తువులను తనలో ఇముడ్చుకుని ఒకచోటి నుంచి మరోచోటికి రవాణా చేయగలదు. ఈ టెక్నాలజీ భవిష్యత్తులో వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా రక్తనాళాల్లో ఏర్పడిన అడ్డంకులను తొలగించడానికి, శరీరంలోని నిర్దిష్ట భాగాలకు మందులను చేరవేయడానికి, అతి సూక్ష్మమైన సర్జరీలు చేయడానికి దీనిని ఉపయోగించవచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ప్రస్తుతం ప్రయోగశాల దశలో ఉన్న ఈ రోబో, భవిష్యత్తులో పరిశ్రమలు, విపత్తు సహాయక చర్యల్లో కూడా కీలకపాత్ర పోషించగలదని అంచనా వేస్తున్నారు.

# ఫిఫా నాకౌట్ మ్యాచ్‌లు: బెంగళూరు హోటళ్లకు అర్ధరాత్రి దాటాక కూడా అనుమతి

- తెల్లవారుజామున 3:30 గంటల వరకు తెరిచి ఉంచేందుకు ప్రభుత్వ అనుమతి
- జులై 14, 15, 19 తేదీలకు మాత్రమే ఈ వెసులుబాటు వర్తింపు
- అభిమానుల సౌకర్యార్థం, ప్రజా భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ ఈ నిర్ణయం

నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి శివకుమార్ ప్రకటన ఫిఫా ప్రపంచకప్ 2026 పోటీల నేపథ్యంలో ఫుట్‌బాల్ అభిమానులకు కర్ణాటక ప్రభుత్వం తీపి కబురు అందించింది. సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లను పురస్కరించుకుని బెంగళూరు నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లను తెల్లవారుజామున 3:30 గంటల వరకు తెరిచి ఉంచేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఈ వెసులుబాటుతో అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగే మ్యాచ్‌లను క్రీడాభిమానులు ప్రత్యేక స్క్రీనింగ్‌ల ద్వారా వీక్షించే అవకాశం లభించింది. నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (NRAI) చేసిన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మంగళవారం వెల్లడించారు. జులై 14, 15, 19 తేదీల్లో ఈ ప్రత్యేక మినహాయింపు అమలులో ఉంటుందని ఆయన పేర్కొన్నారు. వివిధ దేశాల మధ్య ఉన్న సమయ వ్యత్యాసం కారణంగా, ఈ మ్యాచ్‌లు భారత కాలమానం ప్రకారం అర్ధరాత్రి దాటిన తర్వాతే ప్రసారం కానున్నాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి డీకే శివకుమార్ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ, "ఫుట్‌బాల్ క్రీడ ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందికి స్ఫూర్తినిస్తుంది. అభిమానుల అభ్యర్థన మేరకు బెంగళూరులో ఆహార సేవల సమయాన్ని అర్ధరాత్రి 1 గంట నుంచి 3:30 గంటల వరకు పొడిగిస్తున్నాం. ప్రజా భద్రత, శాంతిభద్రతలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూనే ఈ నిర్ణయం తీసుకున్నాం" అని తెలిపారు. కర్ణాటక పోలీస్ చట్టం నిబంధనల ప్రకారం ఇందుకు సంబంధించి తక్షణ ఉత్తర్వులు జారీ చేయాలని బెంగళూరు పోలీస్ కమిషనర్ సీమంత్ కుమార్ సింగ్‌ను ప్రభుత్వం ఆదేశించింది.

# విషాదంలోనూ రాజకీయమేనా..!

**(మనసులో మాట ప్రత్యేక ప్రతినిధి)**

రాష్ట్రంలో విషాదకర సంఘటనలు జరిగినప్పుడు వాటిని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం అధికార, ప్రతిపక్షాలకు అలవాటుగా మారిపోయింది.తాజాగా చోటు చేసుకున్న బోటు ప్రమాదం విషయంలో కూడా పార్టీలు ఇంచుమించు ఇదే ధోరణిని అవలంబించడం దురదృష్టకరం.కూటమి ప్రభుత్వం సరే.. బోటు ప్రమాదం జరిగిన తర్వాత కాస్త అటు ఇటుగా ఆలస్యం జరిగినా స్పందించి గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం ప్రయత్నాలు చేసింది.అలాగే ప్రమాదం నుంచి బయటపడిన మత్స్యకారుడు చిన్నా వైద్య సహాయం కోసం ఏర్పాట్లు చేసింది.మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడంలో కూడా ప్రభుత్వం తనవంతు చర్యలు తీసుకోండి ఈ సహాయం ఇప్పటికీ తక్కువే అనిపించవచ్చేమో గాని రానున్న రోజుల్లో మరింత సాయం అందించేదో లేదో ఈలోగా ప్రతిపక్ష వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రంగంలోకి దిగిపోయి ఈ విషాద ఘటనను రాజకీయ ప్రయోజనం కోసం వాడుకునే ప్రయత్నాన్ని విస్తృతంగా చేసింది..చేస్తోంది! ప్రభుత్వం తన పని తాను చేస్తుండగానే వైసిపి నాయకులు విమర్శల దాడి ప్రారంభించారు.ఈరోజంటే జగన్ విశాఖ వచ్చి హడావిడి చేశారు గాని వైసిపి నాయకులు ఒకరి తర్వాత విశాఖపట్నం వచ్చి హడావిడి చేస్తూనే ఉన్నారు.ఇప్పటికే జగన్మోహన్ రెడ్డి ఆసుపత్రిలో కోలుకుంటున్న చిన్నాని ఫోన్లో పరామర్శించారు..ఈరోజు ప్రత్యక్షంగా వచ్చారు.ఇలా రావడం తప్పు కాదు కాని ఇప్పటికే ఆందోళనలో..ఆవేదనతో ఉన్న మత్సకార కుటుంబాలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడడం విమర్శలకు గురైంది. ఈ విషయంలో స్వయంగా మత్స్యకారులే వైసిపి తీరుపై విరుచుకుపడుతున్నారు. వారి ఆవేదనలో అర్థం లేకపోలేదు. ఐదేళ్లు అధికారంలో ఉన్న జగన్మత్సకారుల్ని ఏనాడూ పట్టించుకోలేదు.అప్పట్లో రైతుభరోసా..వాహనమిత్ర వంటి పథకాలను అమలు చేసిన జగన్ ప్రభుత్వం మత్స్యకార భరోసా విషయంలో మొహం చాటేసింది. జగన్ ఐదేళ్ళ పాలనలో ఇలాగే అరవై మూడు మంది మత్స్యకారులు గల్లంతయితే ఒక్క కుటుంబానికి కూడా సాయం అందలేదు సరి కదా మరణ ధృవీకరణ సర్టిఫికెట్లు కూడా సకాలంలో అందలేదన్న విమర్శ ఉంది. ఓటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 63 మంది మత్స్యకారులకు కుటుంబానికి ఐదు లక్షలు రూపాయల చొప్పున బీమా సొమ్ము అందింది. ఇకపోతే.. 2023లో విశాఖ హార్బర్లో అగ్ని ప్రమాదం జరిగి సుమారు 45 మరబోట్లు పూర్తిగా,మరో 15 పడవలు పాక్షికంగా కాలిపోయాయి. ఈ ప్రమాదంలో సుమారు 50 కోట్ల రూపాయల మేరకు నష్టం జరిగినా జగన్ ప్రభుత్వం పెద్దగా సాయం అందించలేదని విమర్శలు ఉన్నాయి. అప్పట్లోనే చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ మత్స్యకారులకు వ్యక్తిగతంగా సహాయం అందించారు. అంతేకాదు.. అప్పట్లో మత్స్యకారుల చెరువులు, రిజర్వాయర్లను ఒక జీవో ద్వారా సొంత మనుషులకు కట్టబెట్టే ప్రయత్నాన్ని జగన్ సర్కార్ చేసిందని విమర్శలు ఉన్నాయి.ఇప్పుడు ఆ జీవో రద్దయింది.వైసీపీ ప్రభుత్వం హయాంలోనే ఆక్వా రంగం పూర్తిగా దెబ్బ తినేసింది. ఆనాడు మత్స్యకారులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిన జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు విశాఖపట్నం వచ్చి మత్స్యకార కుటుంబాలకు ఒక్కొక్కరికి కోటి రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సానుభూతి పొందడమే కాకుండా కూటమి ప్రభుత్వాన్ని అస్థిర పరిచే ప్రయత్నాలు చేస్తుందన్న విమర్శలు పెద్ద ఎత్తున మొదలయ్యాయి.




# భగ్గుమన్న చమురు

పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయంగా మార్కెట్లు ఒడుదొడుకులను ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో దేశీయ మార్కెట్లు మంగళవారం నష్టాల్లో ప్రారంభ య్యాయి. హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలతో చమురు మంటలు భగ్గుమంటున్నాయి. దాంతో సూచీలపై ప్రతికూల ప్రభావం పడింది. హర్మూజ్‌ను దిగ్బంధిస్తున్నాం.. టోల్ వసూలు చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో మరోసారి చమురు ధరలు భారీగా పెరిగాయి. నెలరోజుల గరిష్ఠానికి చేరాయి. బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ ఒక బ్యారెల్‌కు రెండు శాతం పెరిగి 85 డాలర్లకు చేరింది. యూఎస్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ క్రూడ్ రెండు శాతం పెరిగి 80 డాలర్లకు పెరిగింది. గత సెషన్‌లో 9.6 శాతం పెరిగింది. 2020 మే తర్వాత ఒకేరోజు ఈ స్థాయి పెరుగుదల నమోదైంది. ఈ పరిణామాల నేపథ్యంలో.. ఉదయం 9.39 గంటల సమయంలో సెన్సెక్స్ 412 పాయింట్లు పడిపోయి, 77,203 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 107 పాయింట్లు నష్టపోయి, 24,103 వద్ద కదలాడుతోంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 42 పైసలు పడిపోయి, 96.10కి కుంగింది. నిఫ్టీ సూచీలో హిందాల్కో, సిప్లా, భారతీ ఎయిర్‌టెల్, నెస్లె, టీసీఎస్ షేర్లు లాభాల్లో ఉండగా.. శ్రీరామ్ ఫైనాన్స్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎంఅండ్ఎం షేర్లు నష్టపోతున్నాయి. ఇక, సోమవారం అమెరికా మార్కెట్లు నష్టపోగా.. ఆసియా మార్కెట్లు అదే బాటలో ఉన్నాయి.

# పాత vs కొత్త ట్యాక్స్: ఏది బెస్ట్?




ఆదాయపు పన్ను దాఖలు చేసే సీజన్ వచ్చిందంటే చాలా మంది పన్ను చెల్లింపుదారుల ముందుకొచ్చే పెద్ద సందేహం.. పాత ట్యాక్స్ విధానం ఎంచుకోవాలా? లేక కొత్త ట్యాక్స్ విధానం తీసుకోవాలా? ఈసారి మాత్రం ఎక్కువ మంది ఉద్యోగులకు కొత్త ట్యాక్స్ విధానమే లాభదాయకంగా ఉండొచ్చని తాజా విశ్లేషణలు చెబుతున్నాయి. అయితే భారీ మొత్తంలో పన్ను మినహాయింపులు క్లెయిమ్ చేసే వారికి పాత విధానం ఇంకా ప్రయోజనకరంగా ఉండే అవకాశముందని నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం కొత్త ట్యాక్స్ విధానమే డిఫాల్ట్‌గా అమల్లో ఉంది. పన్ను చెల్లింపుదారులు ప్రత్యేకంగా పాత విధానాన్ని ఎంపిక చేయకపోతే వారి ఆదాయపు పన్ను రిటర్న్ కొత్త విధానం ప్రకారమే ప్రాసెస్ అవుతుంది. అందువల్ల రిటర్న్ దాఖలు చేసే ముందు రెండు విధానాల్లో పన్ను లెక్కలు వేసుకుని నిర్ణయం తీసుకోవడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. గ్రాంట్ థార్న్టన్ భారత్ 202526 ఆర్థిక సంవత్సరానికి చేసిన విశ్లేషణ ప్రకారం.. 60 ఏళ్లలోపు జీతభత్యాలు తీసుకునే వ్యక్తి పాత విధానంలో సెక్షన్ 80C కింద రూ.1.5 లక్షలు, సెక్షన్ 80D కింద రూ.25 వేల ఆరోగ్య బీమా, రూ.2 లక్షల HRA, రూ.50 వేల స్టాండర్డ్ డిడక్షన్ కలిపి మొత్తం రూ.4.25 లక్షల డిడక్షన్లు క్లెయిమ్ చేసినా, రూ.25 లక్షల వార్షిక ఆదాయంపై పన్ను సుమారు రూ.4,52,400 చెల్లించాల్సి ఉంటుంది. అదే కొత్త ట్యాక్స్ విధానంలో రూ.75 వేల స్టాండర్డ్ డిడక్షన్‌తో పన్ను రూ.3,19,800 మాత్రమే ఉంటుంది. అంటే దాదాపు రూ.1,32,600 వరకు ఆదా అవుతుంది. ఇదే విధంగా రూ.50 లక్షల వార్షిక ఆదాయం ఉన్నవారికి కూడా కొత్త విధానంలో దాదాపు రూ.1.32 లక్షల వరకు పన్ను ఆదా అవుతుందని చెబుతున్నారు. రూ.75 లక్షలు, రూ.1 కోటి ఆదాయం ఉన్నవారికి 10 శాతం సర్‌చార్జ్ వర్తించినప్పటికీ కొత్త ట్యాక్స్ విధానంలో సుమారు రూ.1.46 లక్షల వరకు ఆదా అవుతుందని ఈ నివేదిక పేర్కొంది.

అయితే పాత ట్యాక్స్ విధానం పూర్తిగా ఉపయోగం లేకుండా పోయిందని భావించాల్సిన అవసరం లేదని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా సెక్షన్ 24(b) కింద హోమ్ లోన్ వడ్డీపై రూ.2 లక్షల వరకు మినహాయింపు, మెట్రో నగరాల్లో అధిక HRA, 80CCD(1B) కింద NPSలో అదనపు పెట్టుబడులు, సీనియర్ సిటిజన్ తల్లిదండ్రుల ఆరోగ్య బీమాపై అధిక 80D డిడక్షన్లు వంటి ప్రయోజనాలు పొందే వారికి పాత విధానం ఇంకా లాభదాయకంగా ఉండే అవకాశం ఉందని వెల్లడించారు. మొత్తం డిడక్షన్లు రూ.8 లక్షలకు పైగా ఉంటే రెండు విధానాలను తప్పనిసరిగా పోల్చి చూసి నిర్ణయం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. "పాత, కొత్త ట్యాక్స్ విధానాల్లో ఏది ఎంచుకోవాలన్నది అందరికీ ఒకేలా ఉండదు. కొత్త విధానం తక్కువ పన్ను రేట్లు, సులభమైన విధానాన్ని అందిస్తున్నప్పటికీ, ఎక్కువ డిడక్షన్లు, మినహాయింపులు పొందే వారికి పాత విధానం మెరుగైన ఫలితాలు ఇవ్వొచ్చు. కాబట్టి కేవలం పన్ను రేట్లను చూసి కాకుండా, వ్యక్తిగత ఆదాయం, డిడక్షన్లు, మినహాయింపుల ఆధారంగా పన్ను లెక్కలు వేసుకుని నిర్ణయం తీసుకోవాలి" అని నిపుణులు సూచిస్తున్నారు. జీతభత్యాలు పొందే ఉద్యోగులకు ప్రతి ఏడాది ట్యాక్స్ విధానాన్ని మార్చుకునే అవకాశం ఉంటుంది. కంపెనీ TDS కొత్త విధానం ప్రకారం కట్ చేసినా, ఐటీఆర్ దాఖలు చేసే సమయంలో పాత విధానాన్ని ఎంచుకుని అదనంగా చెల్లించిన పన్నును రీఫండ్ రూపంలో పొందే అవకాశం ఉంటుంది. అయితే వ్యాపార లేదా వృత్తి ఆదాయం ఉన్న వారు మాత్రం ట్యాక్స్ విధానం ఎంపికలో మరింత జాగ్రత్తగా ఉండాల్సి ఉంటుందని చెబుతున్నారు. నిపుణుల సూచన ప్రకారం.. ఐటీఆర్ ఫైల్ చేసే ముందు ఆదాయపు పన్ను శాఖ అందుబాటులో ఉంచిన ట్యాక్స్ కాలిక్యులేటర్ ద్వారా రెండు విధానాల్లో పన్ను లెక్కలు వేసుకోవాలన్నారు. డిడక్షన్లు తక్కువగా ఉంటే కొత్త విధానం ఎక్కువ ప్రయోజనం ఇవ్వొచ్చని, భారీ డిడక్షన్లు ఉంటే రెండు విధానాలను పోల్చి చూసి తమకు ఏది లాభదాయకమో నిర్ణయం తీసుకోవడం ఉత్తమమని సూచిస్తున్నారు.



# వన్‌ప్లస్‌కు పశ్చిమ మార్కెట్ల గుడ్‌బై!

ఒకప్పుడు "ఫ్లాగ్‌షిప్ కిల్లర్" గా మార్కెట్లోకి అడుగుపెట్టి, సగం ధరకే ప్రీమియం ఫీచర్లను అందిస్తూ గ్లోబల్ మొబైల్ రంగంలో సంచలనం సృష్టించిన ప్రముఖ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ 'వన్‌ప్లస్' తన సుదీర్ఘ ప్రయాణాన్ని ముగించే దిశగా అడుగులు వేస్తోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. వన్‌ప్లస్ బ్రాండ్ అమెరికా, యూరప్ మార్కెట్ల నుండి మొబైల్ విక్రయాలను పూర్తిగా నిలిపివేయడానికి సిద్ధమవుతోంది. జర్మనీకి చెందిన ప్రముఖ మీడియా సంస్థ 'విన్‌ఫ్యూచర్' కథనం ప్రకారం.. వన్‌ప్లస్, దాని మాతృ సంస్థ 'ఒప్పో'తమ వ్యాపార వ్యూహంలో భాగంగా ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన రెండు పశ్చిమ దేశాల మార్కెట్ల నుండి వన్‌ప్లస్ బ్రాండ్ పూర్తిగా నిష్క్రమించబోతోంది. ఇప్పటికే దీనికి సంబంధించి రహస్య ప్రెస్ మీటింగ్‌లు కూడా పూర్తయ్యాయని, అయితే ఈ నిర్ణయం వెనుక గల ఖచ్చితమైన కారణాలను వెల్లడించడానికి కంపెనీ ప్రతినిధులు నిరాకరించినట్లు సమాచారం.

**భారత్, చైనా మార్కెట్లలో యథాతథం**

ఈ నిష్క్రమణ వార్తల్లో భారత్, చైనా మార్కెట్ల ప్రస్తావన ఎక్కడా రాలేదు. ఒప్పో(Oppo) గొడుగు కింద వన్‌ప్లస్ బ్రాండ్ కేవలం ఒక సబ్‌ప్రొడక్ట్ లైన్‌గా మాత్రమే ఈ రెండు దేశాల్లో కొనసాగే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. అంటే తక్కువ బడ్జెట్ ఫోన్లు, టాబ్లెట్‌ల విక్రయాలకే పరిమితం కానుందని సమాచారం. నిజానికి వన్‌ప్లస్ బ్రాండ్ ఇప్పటికీ మనుగడ సాగించడానికి ప్రధాన కారణం భారతదేశమే. వన్‌ప్లస్ గ్లోబల్ సేల్స్‌లో సగానికి పైగా వాటా భారత్ నుంచే వస్తోంది. ముఖ్యంగా ఇక్కడి మిడ్‌రేంజ్ మార్కెట్లో వన్‌ప్లస్ 'నార్డ్' (Nord) సిరీస్ ఫోన్లకు విపరీతమైన డిమాండ్ ఉంది.

**పాత ఫోన్ల యూజర్ల పరిస్థితి ఏంటి?**

అయితే, ఇప్పటికే వన్‌ప్లస్ ఫోన్లు వాడుతున్న కస్టమర్ల విషయంలో కంపెనీ సానుకూలంగా స్పందించింది. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న మరియు ఇప్పటికే విక్రయించిన డివైజ్‌లకు సాఫ్ట్‌వేర్ అప్‌డేట్‌లు, ఆఫ్టర్ సేల్స్ సర్వీస్ యథావిధిగా కొనసాగుతాయని స్పష్టం చేసింది. కాకపోతే.. ఇకపై కొత్త ఫోన్ల లాంచ్ ఉండదు, కొత్త స్టాక్ రాదు, ఎలాంటి మార్కెటింగ్ ప్రచారాలు జరగవు. ప్రస్తుతం అమెరికా, యూరప్‌లలో మిగిలి ఉన్న స్టాక్‌ను రాబోయే కొద్ది వారాల్లో విక్రయించి క్లియర్ చేయనున్నారు. ఇప్పటికే జర్మనీ, ఫ్రాన్స్, స్పెయిన్ దేశాల్లోని వన్‌ప్లస్ ఆన్‌లైన్ స్టోర్స్ దాదాపు ఖాళీ అయ్యాయి.

యూరప్ మార్కెట్లో వన్‌ప్లస్ వదిలిన స్థానాన్ని ఒప్పో భర్తీ చేయాలని చూస్తోంది. కానీ, ఒప్పో ఫోన్ల ధరలు వన్‌ప్లస్ కంటే చాలా ఎక్కువ. ఒక వాల్యూఫర్‌మనీ బ్రాండ్ స్థానాన్ని ప్రీమియం బ్రాండ్‌తో భర్తీ చేయాలనుకోవడం పెద్ద మైనస్ అని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఒప్పో నుండి దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉన్నప్పటికీ.. ఇటీవల విడుదలైన 'వన్‌ప్లస్ 15' (OnePlus 15) పాశ్చాత్య దేశాలలో ఈ బ్రాండ్ నుండి వచ్చిన చివరి ఫ్లాగ్‌షిప్ ఫోన్‌గా మిగిలిపోనుంది.

# క్రెడిట్ కార్డులతో ఎల్ఐసీ ప్రీమియంల బంద్!




ప్రముఖ ప్రభుత్వరంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(LIC) తమ పాలసీదారులకు ఊహించని షాక్ ఇచ్చింది. తన అధికారిక వెబ్‌సైట్ అంటే కస్టమర్ పోర్టల్, మొబైల్ యాప్‌లో క్రెడిట్ కార్డ్ (Credit Card) ద్వారా ప్రీమియం చెల్లించే ఆప్షన్‌ను పూర్తిగా నిలిపివేసింది. గత 15 రోజుల క్రితమే గుట్టుచప్పుడు కాకుండా ఈ నిర్ణయం అమలులోకి వచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఎల్ఐసీ అధికారిక వేదికలపై కేవలం నెట్ బ్యాంకింగ్, డెబిట్ కార్డ్, యూపీఐ (UPI) ఆప్షన్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.

**ఎందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు?**

సాధారణంగా గూగుల్ పే, ఫోన్ పే వంటి ఇతర థర్డ్ పార్టీ ప్లాట్‌ఫామ్‌లలో క్రెడిట్ కార్డుతో ఎల్ఐసీ ప్రీమియం చెల్లిస్తే కస్టమర్లపై అదనపు రుసుములు పడేవి. కానీ, ఎల్ఐసీ అధికారిక యాప్‌లో క్రెడిట్ కార్డుతో చెల్లించినప్పుడు ఆ కార్డ్ గేట్‌వే ఛార్జీలను వినియోగదారుల తరఫున ఎల్ఐసీనే భరించేది. అయితే, ఇటీవల కాలంలో క్రెడిట్ కార్డుల ద్వారా ప్రీమియం చెల్లించే వారి సంఖ్య భారీగా పెరిగింది. దీనివల్ల బ్యాంకులు, పేమెంట్ గేట్‌వేలకు ఎల్ఐసీ చెల్లించాల్సిన ఫీజుల భారం కోట్లాది రూపాయలకు చేరింది. ఈ అదనపు ఆర్థిక భారాన్ని తగ్గించుకోవడానికే ఎల్ఐసీ తన పోర్టల్ నుండి క్రెడిట్ కార్డ్ చెల్లింపుల ఆప్షన్‌ను శాశ్వతంగా తొలగించినట్లు మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

**ఇప్పుడు చెల్లింపులు ఎలా?**

ఒకవేళ ఖచ్చితంగా క్రెడిట్ కార్డునే ఉపయోగించి ఎల్ఐసీ ప్రీమియం చెల్లించాలనుకుంటే, ఈ క్రింది ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవచ్చు. గూగుల్ పే (Google Pay), ఫోన్ పే (PhonePe), పేటీఎం (Paytm), అమెజాన్ పే (Amazon Pay) వంటి యాప్స్ ద్వారా క్రెడిట్ కార్డు ఉపయోగించి ప్రీమియం చెల్లించవచ్చు. అయితే, ఈ యాప్స్ ద్వారా చెల్లించేటప్పుడు వర్తించే ట్రాన్సాక్షన్, కన్వీనియన్స్ ఫీజుల భారాన్ని వినియోగదారులే స్వయంగా భరించాల్సి ఉంటుంది. ఎలాంటి అదనపు రుసుములు (Extra Charges) లేకుండా ఉచితంగా ప్రీమియం చెల్లించాలనుకుంటే ఎల్ఐసీ అధికారిక యాప్‌లో UPI, డెబిట్ కార్డ్, నెట్ బ్యాంకింగ్ మార్గాలను ఎంచుకోవాల్సి ఉంటుంది.

### కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డ్ యూజర్ల అసంతృప్తి

యాక్సిస్ బ్యాంక్ (Axis Bank), ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ (IDFC First Bank) వంటి సంస్థలతో కలిసి ఎల్ఐసీ జారీ చేసిన కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డులకు కూడా ఈ కొత్త నిబంధన వర్తిస్తుంది. ఇతర ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ప్రీమియం చెల్లించినప్పుడు రివార్డు పాయింట్లు లభించినప్పటికీ, గేట్‌వే ఛార్జీల భారం పడటంతో ఈ కో-బ్రాండెడ్ కార్డుల వల్ల అసలు ప్రయోజనం ఏముందని పాలసీదారులు సామాజిక మాధ్యమాల్లో పెదవి విరుస్తున్నారు.

# ధ్రువ స్పేస్‌కు ₹60 కోట్లు

**హైదరాబాద్:**

భారత అంతరిక్ష రంగం అభివృద్ధికి ప్రత్యేకించిన 'అంతరిక్ష వెంచర్ క్యాపిటల్ ఫండ్' నుంచి పెట్టుబడులు అందుకున్న దేశీయ తొలి సంస్థగా హైదరాబాద్‌కు చెందిన ధ్రువ స్పేస్ నిలిచింది. ఈ సంస్థకు రూ.60 కోట్లు లభించాయి. భారత ప్రభుత్వానికి చెందిన ఇన్‌స్పేస్ ఆధ్వర్యంలోని అంతరిక్ష వెంచర్ వద్ద రూ.1,000 కోట్లు ఉండగా, సిడ్బీ పూర్తి అనుబంధ సంస్థ సిడ్బీ వెంచర్ క్యాపిటల్ లిమిటెడ్ ఈ మొత్తాన్ని నిర్వహిస్తోంది. స్వదేశీ ఉపగ్రహాల తయారీ సామర్థ్యాలను బలోపేతం చేసుకోవడం, సరికొత్త ఉత్పత్తుల ఆవిష్కరణను వేగవంతం చేయడం, మౌలిక వసతులను అంతర్జాతీయ స్థాయికి విస్తరించేందుకు ఈ నిధులు వినియోగిస్తామని ధ్రువస్పేస్ సహ వ్యవస్థాపకుడు, సీఎఫ్ఓ చైతన్య దొర సూరపరెడ్డి పేర్కొన్నారు.
సిడ్బీ వెంచర్ క్యాపిటల్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ అరూప్ కుమార్ స్పందిస్తూ.. ఆవిష్కరణలు, తయారీ సామర్థ్యం, అంతరిక్ష ప్రయోగాల నిర్వహణ, వాణిజ్య విస్తరణను ఒకే చోట అందించే సంస్థలే రేపటి తరం అంతరిక్ష దిగ్గజాలుగా వృద్ధి చెందుతాయన్నారు. తమ తొలి పెట్టుబడి ఆ నమ్మకాన్ని ప్రతిబింబిస్తోందని తెలిపారు.

# తగ్గిన బంగారం ధరలు..

మంగళవారం బంగారం ధరలు మరింత తగ్గాయి. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంపై 110 రూపాయలు.. 22 క్యారెట్ల బంగారంపై 100 రూపాయలు.. 18 క్యారెట్ల బంగారంపై 80 రూపాయలు తగ్గింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం.. ఉదయం 10 గంటల ప్రాంతంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 1,42,800 రూపాయల వద్ద.. 22 క్యారెట్ల బంగారం ధర 1,30,900 రూపాయల వద్ద.. 18 క్యారెట్ల బంగారం ధర 1,07,100 రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది.



# మార్కెట్ అంచనాలను మించిన హెచ్‌సీఎల్ టెక్!

- వార్షికాదాయ వృద్ధి 1-4 శాతంగా అంచనా
- ఒక్కో షేరుకు రూ.12 మధ్యంతర డివిడెండ్
- సంస్థ ఉద్యోగుల సంఖ్యలో 3,292 తగ్గుదల
- క్యూ1 లాభంలో 20% వృద్ధి
- రూ.4,624 కోట్లుగా నమోదు
- రూ.34,579 కోట్లకు ఆదాయం




**న్యూఢిల్లీ:**

దేశీయ ఐటీ సేవల సంస్థ హెచ్‌సీఎల్ టెక్ ఆర్థిక ఫలితాలు మార్కెట్ అంచనాలను మించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (202627)లో జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికి (క్యూ1) కంపెనీ రూ.4,624 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం (202526)లో ఇదే కాలానికి నమోదైన రూ.3,843 కోట్ల లాభంతో పోలిస్తే 20 శాతం వృద్ధి కనబరిచింది. ఈ క్యూ1లో కంపెనీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 14 శాతం పెరిగి రూ.34,579 కోట్లకు చేరుకుంది. ఈ ఆర్థిక సంవత్సరం మొత్తానికి ఆదాయ వృద్ధి అంచనాను గతంలో ప్రకటించిన 14 శాతంగా కొనసాగిస్తున్నట్లు సంస్థ వెల్లడించింది. కాగా, వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.12 మధ్యంతర డివిడెండ్ చెల్లించనున్నట్లు హెచ్‌సీఎల్ టెక్ బోర్డు ప్రకటించింది. డివిడెండ్‌కు అర్హులైన వాటాదారుల ఎంపికకు రికార్డు తేదీని ఈ నెల 17గా నిర్ణయించిన కంపెనీ.. 27న చెల్లింపులు చేపట్టనున్నట్లు తెలిపింది. మరిన్ని ముఖ్యాంశాలు.. ఏప్రిల్‌జూన్ త్రైమాసికంలో సంస్థ.. జర్మనీ కార్ల దిగ్గజం మెర్సిడెస్ బెంజ్ నుంచి 114 కోట్ల డాలర్ల విలువైన మెగా ఏఐ డీల్‌తో సహా మొత్తం 240 కోట్ల డాలర్ల విలువైన కొత్త ఆర్డర్లను దక్కించుకుంది. సంస్థ చరిత్రలో ఇవే అత్యధిక క్యూ1 ఆర్డర్లని హెచ్‌సీఎల్ టెక్ సీఈఓ, ఎండీ సీ విజయ్ కుమార్ తెలిపారు. అడ్వాన్స్‌డ్ ఏఐ సేవల ద్వారా సంస్థకు గడిచిన మూడు నెలల్లో 17.1 కోట్ల డాలర్ల ఆదాయం సమకూరింది. ఈ విషయంలో త్రైమాసిక ప్రాతిపదికన 10.6 శాతం, వార్షిక ప్రాతిపదికన ఏకంగా 62.1 శాతం వృద్ధిని నమోదు చేసింది. జూన్ త్రైమాసికంలో హెచ్‌సీఎల్ టెక్ మొత్తం ఉద్యోగుల సంఖ్య 3,292 తగ్గి 2,23,889కి పరిమితమైంది. మూడు నెలల్లో కంపెనీ సిబ్బంది ఈ స్థాయిలో తగ్గడం గడిచిన రెండేళ్లలో ఇదే మొదటిసారి.

**రూ.3,500 కోట్లతో ఏఐ డేటా సెంటర్ల ఏర్పాటు**

దేశంలో 50 మెగావాట్ల వరకు సామర్థ్యంతో ఏఐ డేటా సెంటర్ల ఏర్పాటు కోసం రూ.3,500 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు బోర్డు ఆమోదం తెలిపిందని హెచ్‌సీఎల్ టెక్ సోమవారం ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగా వెల్లడించింది. డేటా సెంటర్ల ఏర్పాటు కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్న కొత్త అనుబంధ విభాగాల ద్వారా ఈ పెట్టుబడులు పెట్టనున్నట్లు సంస్థ తెలిపింది. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల నుంచి ఏఐ ఆధారిత సేవలు, పరిష్కారాలకు గిరాకీ పెరుగుతున్న తరుణంలో ఈ విభాగం పూర్తి స్థాయి వ్యాపార అవకాశాలను చేజిక్కించుకునేందుకు ఫుల్ స్టాక్ ఏఐ మార్కెట్లోకి ప్రవేశిస్తున్నట్లు కంపెనీ ప్రకటించింది.

గత త్రైమాసికంలో 1,059 మంది ఫ్రెషర్లను ఉద్యోగంలో చేర్చుకున్నట్లు సంస్థ తెలిపింది. కాగా, ఉద్యోగుల వలసల (అట్రిషన్) రేటు 12.7 శాతానికి పెరిగింది.

# సీఎస్‌కే కొత్త కోచ్ రేసులో ముగ్గురు.. భారత్ నుంచి ఇద్దరు క్రికెట్ దిగ్గజాలు!

- సీఎస్‌కే కొత్త కోచ్ రేసులో ముగ్గురు.. భారత్ నుంచి ఇద్దరు క్రికెట్ దిగ్గజాలు!
- 18 ఏళ్ల అనుబంధానికి స్టీఫెన్ ఫ్లెమింగ్ ముగింపు
- సీఎస్‌కే కొత్త కోచ్ రేసులో ముగ్గురు పేర్లు
- చెన్నై యాజమాన్యం ఎవరిని ఎంపిక చేస్తుందో



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) చరిత్రలో అత్యంత విజయవంతమైన కోచ్‌లలో ఒకరిగా గుర్తింపు పొందిన స్టీఫెన్ ఫ్లెమింగ్.. చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే)తో తన 18 ఏళ్ల అనుబంధానికి ముగింపు పలికాడు. 2008లో ఐపీఎల్ ప్రారంభ సీజన్‌లో సీఎస్‌కే తరపున ఆటగాడిగా బరిలోకి దిగిన ఫ్లెమింగ్.. 2009 నుంచి హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టి ఫ్రాంచైజీని విజయాల బాటలో నడిపించాడు. ఫ్లెమింగ్ మార్గదర్శకత్వంలో సీఎస్‌కే ఐదు ఐపీఎల్ టైటిళ్లు, రెండు చాంపియన్స్ లీగ్ టీ20 ట్రోఫీలను గెలుచుకుంది. అంతేకాదు 10 ఐపీఎల్ ఫైనల్స్, 12 సార్లు ప్లేఆఫ్స్‌కు చేరి లీగ్‌లో అత్యంత స్థిరమైన జట్టుగా నిలిచింది. దాదాపు రెండు దశాబ్దాల పాటు సీఎస్‌కే విజయాల వెనుక ప్రధాన శక్తిగా ఫ్లెమింగ్ నిలిచాడు.

**స్వయంగా తప్పుకున్న ఫ్లెమింగ్:**

అయితే గత మూడు సీజన్లుగా సీఎస్‌కే ఆశించిన స్థాయిలో రాణించలేదు. 2023లో టైటిల్ గెలిచిన తర్వాత 2024లో ఐదో స్థానం, 2025లో పదో స్థానం, 2026లో ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలోనే న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ స్టీఫెన్ ఫ్లెమింగ్ జట్టు నుంచి స్వయంగా తప్పుకున్నాడు. పరస్పర అంగీకారంతోనే వైదొలిగినట్లు ఫ్లెమింగ్ సహా చెన్నై యాజమాన్యం కూడా తెలిపింది. ఫ్లెమింగ్ వైదొలగడంతో ఇప్పుడు అతడి స్థానాన్ని భర్తీ చేసే కోచ్ ఎవరు అనే చర్చ సోషల్ మీడియాలో మొదలైంది. సీఎస్‌కే కొత్త కోచ్ రేసులో ముగ్గురు పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. అందులో ఇద్దరు భారత దిగ్గజాల పేర్లు ఉన్నాయి.

**రాహుల్ ద్రవిడ్:**

టీమిండియాకు 2024 టీ20 ప్రపంచ కప్‌ను అందించిన మాజీ హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ సీఎస్‌కేకు ప్రధాన ఎంపికగా కనిపిస్తున్నాడు. ప్రస్తుతం ఏ జట్టుకూ కోచ్‌గా వ్యవహరించని ద్రవిడ్‌కు ఎంతో అనుభవం ఉంది. 2018లో భారత అండర్19 జట్టును ప్రపంచ ఛాంపియన్‌గా నిలబెట్టిన ఆయన.. ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్‌కు కూడా కోచ్‌గా పనిచేశాడు. ద్రవిడ్ ప్రశాంత స్వభావం, యువ ఆటగాళ్లను తీర్చిదిద్దే నైపుణ్యం సీఎస్‌కే సంస్కృతికి బాగా సరిపోతాయని క్రికెట్ వర్గాలు అంటున్నాయి. మంచి అవకాశం వస్తే మళ్లీ కోచింగ్ బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు ద్రవిడ్ ఇటీవలే వెల్లడించాడు.

**మార్క్ బౌచర్:**

దక్షిణాఫ్రికా మాజీ వికెట్ కీపర్‌బ్యాటర్ మార్క్ బౌచర్ కూడా సీఎస్‌కే పరిశీలనలో ఉన్న మరో బలమైన అభ్యర్థి. 2019 నుంచి 2022 వరకు దక్షిణాఫ్రికా జాతీయ జట్టుకు హెడ్ కోచ్‌గా పనిచేసిన బౌచర్.. ఆ తర్వాత ముంబై ఇండియన్స్‌కు కూడా కోచ్‌గా సేవలందించాడు. అతని నాయకత్వంలో ముంబై 2023 సీజన్‌లో ప్లేఆఫ్స్‌కు చేరింది. అంతకుముందు దక్షిణాఫ్రికా దేశవాళీ జట్టు 'టైటాన్స్'ను నడిపించిన అనుభవం కూడా బౌచర్‌కు ఉంది. అంతర్జాతీయ, ఫ్రాంచైజీ క్రికెట్‌లో అతని అనుభవం సీఎస్‌కేకు ఉపయోగపడే అవకాశం ఉంది.

**ఎంఎస్ ధోనీ:**

చెన్నై అభిమానులు ఎక్కువగా కోరుకునే పేరు ఎంఎస్ ధోనీ. ప్రస్తుతం అధికారికంగా ఐపీఎల్‌కు రిటైర్మెంట్ ప్రకటించకపోయినా.. 2026 సీజన్‌లో కాలి కండరాల గాయం కారణంగా ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. ఇటీవలే 45 ఏళ్లు పూర్తి చేసుకున్న ధోనీ.. త్వరలో ఆటకు వీడ్కోలు పలికే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే సీఎస్‌కే హెడ్ కోచ్‌గా ధోనీ బాధ్యతలు చేపట్టే అవకాశం కూడా ఉందని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జట్టుతో అతనికి ఉన్న అనుబంధం, ఆటగాళ్లపై ప్రభావం, వ్యూహాత్మక ఆలోచనలు సీఎస్‌కేను మళ్లీ విజయాల బాటలో నడిపించగలవు.

**సీఎస్‌కే ముందు పెద్ద సవాలు:**

స్టీఫెన్ ఫ్లెమింగ్ వంటి దిగ్గజ కోచ్ స్థానాన్ని భర్తీ చేయడం అంత తేలికైన విషయం కాదు. కొత్త కోచ్ జట్టును మళ్లీ టైటిల్ పోరులో నిలబెట్టడమే కాకుండా.. ఆధునిక టీ20 క్రికెట్‌కు తగ్గట్టుగా సీఎస్‌కే ఆటతీరును మార్చాల్సిన బాధ్యత కూడా ఉంటుంది. కోచ్ రేసులో ప్రస్తుతం రాహుల్ ద్రవిడ్, మార్క్ బౌచర్, ఎంఎస్ ధోనీ పేర్లు బలంగా వినిపిస్తున్నా.. చివరికి చెన్నై యాజమాన్యం ఎవరిని ఎంపిక చేస్తుందో అనేది ఆసక్తికరంగా మారింది.



## రీఎంట్రీ మ్యాచ్‌లో రికార్డుల వర్షం..

# చరిత్ర సృష్టించిన బుమ్రా..

భారత స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా వన్డే క్రికెట్‌లో ఘనంగా రీఎంట్రీ ఇచ్చాడు. 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్ తర్వాత 968 రోజుల విరామం అనంతరం ఇంగ్లండ్‌తో జరుగుతున్న తొలి వన్డేలో బరిలోకి దిగిన బుమ్రా, రీఎంట్రీ మ్యాచ్‌లోనే రెండు అరుదైన రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరుగుతున్న తొలి వన్డేలో టాస్ గెలిచిన ఇంగ్లండ్ బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి స్పెల్‌లో నాలుగు ఓవర్లు వేసిన బుమ్రాకు వికెట్ దక్కలేదు. అయితే పవర్‌ప్లే అనంతరం రెండో స్పెల్‌లో తొలి బంతికే ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్‌ను ఔట్ చేసి తన సత్తా చాటాడు. రోహిత్ శర్మ ఫస్ట్ స్లిప్‌లో అద్భుత క్యాచ్ అందుకోవడంతో బుమ్రా ఖాతాలో కీలక వికెట్ చేరింది.. ఈ వికెట్‌తో బుమ్రా.. ఇంగ్లండ్ గడ్డపై వన్డేల్లో 31 వికెట్లు పూర్తి చేసి కొత్త చరిత్ర సృష్టించాడు. దీంతో ఇంగ్లండ్‌లో అత్యధిక వన్డే వికెట్లు తీసిన భారత బౌలర్‌గా నిలిచాడు. ఈ జాబితాలో ఇప్పటివరకు రవీంద్ర జడేజా 30 వికెట్లతో అగ్రస్థానంలో ఉండగా, బుమ్రా అతడిని అధిగమించాడు. భువనేశ్వర్ కుమార్ (28), మదన్ లాల్ (27), మహ్మద్ షమీ (26) తదుపరి స్థానాల్లో ఉన్నారు. అంతేకాకుండా హ్యారీ బ్రూక్ వికెట్ బుమ్రా వన్డే కెరీర్‌లో 150వ వికెట్ కావడం మరో విశేషం. దీంతో వన్డేల్లో 150 వికెట్లు పూర్తి చేసిన భారత బౌలర్ల జాబితాలో చోటు దక్కించుకున్నాడు. కేవలం 4,605 బంతుల్లోనే ఈ ఘనత సాధించిన బుమ్రా, అత్యంత వేగంగా 150 వన్డే వికెట్లు తీసిన భారత బౌలర్ల జాబితాలో మహ్మద్ షమీ (4,070 బంతులు), కుల్దీప్ యాదవ్ (4,513 బంతులు) తర్వాత మూడో స్థానంలో నిలిచాడు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే, ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్నాడు. అయితే భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కూడా తాము ముందుగా బౌలింగ్ చేయాలనే ఆలోచనతోనే ఉన్నామని వెల్లడించాడు. టీ20 సిరీస్ అనంతరం జట్టులో మంచి వాతావరణం ఉందని, అందరూ బాగా సన్నద్ధమయ్యారని గిల్ తెలిపాడు. బుమ్రా రీఎంట్రీతో భారత బౌలింగ్ దళానికి మరింత బలం చేకూరిందని అభిమానులు భావిస్తున్నారు.



## ఫ్లెమింగ్ ఔట్..CSK కోసం

# రంగంలోకి ద్రావిడ్ ?

చెన్నై సూపర్ కింగ్స్ హెడ్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన కోచ్ పదవికి రాజీనామా చేస్తూ, చెన్నై సూపర్ కింగ్స్ జట్టుతో బంధం తెంపుకున్నారు. దాదాపు 18 సంవత్సరాలుగా ఆ జట్టుకు సేవలు అందించిన స్టీఫెన్ ఫ్లెమింగ్... 2008లో ప్లేయర్ గా కూడా ఆడారు. అనంతరం హెడ్ కోచ్ బాధ్యతలు తీసుకున్నారు. వరుస సీజన్లలో చెన్నై ప్రదర్శన సరిగ్గా లేకపోవడంతో, స్టీఫెన్ ఫ్లెమింగ్ తప్పుకున్నట్లు సమాచారం.

**స్టీఫెన్ ఫ్లెమింగ్ స్థానంలో ఎవరంటే ?**

చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు దూరమైన స్టీఫెన్ ఫ్లెమింగ్ స్థానంలో కొత్త హెడ్ కోచ్ కోసం ప్రయత్నాలు మొదలు పెట్టింది యాజమాన్యం. ఈ క్రమంలోనే హేమంగ్ బదానీ, బ్రెండన్ మెక్‌కల్లమ్, రవిచంద్రన్ అశ్విన్ లాంటి వాళ్ళ పేర్లు తెరపైకి వచ్చాయి. కానీ రాహుల్ ద్రావిడ్ కు కోచింగ్ బాధ్యతలు ఇవ్వాలని చెన్నై సూపర్ కింగ్స్ జట్టు నిర్ణయం తీసుకున్నట్లు నేషనల్ మీడియాలో సరికొత్త కథనం వైరల్ గా మారింది. ఈ మేరకు రాహుల్ ద్రావిడ్ తో చర్చలు కూడా జరుగుతున్నాయట.



## భారత్‌తో జరుగుతున్న తొలి వన్డేలో

# 258 పరుగులకు ఇంగ్లండ్ ఆలౌట్

ఇంగ్లండ్ పర్యటనలో భాగంగా బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరుగుతున్న తొలి వన్డేలో భారత బౌలర్లు సత్తా చాటారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆతిథ్య ఇంగ్లండ్ జట్టును 47.5 ఓవర్లలో 258 పరుగులకే ఆలౌట్ చేశారు. భారత స్పిన్నర్ అక్షర్ పటేల్ నాలుగు వికెట్లతో ఇంగ్లండ్ పతనాన్ని శాసించగా, మాజీ కెప్టెన్ జో రూట్ (76 నాటౌట్) ఒంటరి పోరాటం చేశాడు. అతనికి తోడుగా లియామ్ డాసన్ (68) అర్ధ శతకంతో రాణించాడు. దీంతో టీమిండియా ముందు 259 పరుగుల లక్ష్యం నిలిచింది. ఇన్నింగ్స్ ఆరంభంలో ఇంగ్లండ్ ఓపెనర్లు బెన్ డకెట్ (43), జాకబ్ బెథెల్ (14) తొలి వికెట్‌కు 61 పరుగులు జోడించి శుభారంభం అందించారు. అయితే, ఈ దశలో భారత బౌలర్లు పుంజుకున్నారు. కేవలం 19 పరుగుల వ్యవధిలోనే ఇంగ్లండ్ 4 కీలక వికెట్లు కోల్పోయి 80/5 స్కోరుతో కష్టాల్లో పడింది. కెప్టెన్ హ్యారీ బ్రూక్ (1), జోస్ బట్లర్ (5), సామ్ కరన్ (0) సింగిల్ డిజిట్‌కే పరిమితమై పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో క్రీజులో నిలిచిన జో రూట్, లియామ్ డాసన్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. వీరిద్దరూ ఏడో వికెట్‌కు 121 పరుగుల విలువైన భాగస్వామ్యం నెలకొల్పి జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించడంలో కీలక పాత్ర పోషించారు. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని అక్షర్ పటేల్ విడదీశాడు. డాసన్ ఔటయ్యాక, ఇంగ్లండ్ ఇన్నింగ్స్ మళ్లీ తడబడింది. చివర్లో జోఫ్రా ఆర్చర్ (12) వేగంగా ఆడినా, అక్షర్ తన స్పిన్‌తో టెయిలెండర్లను చుట్టేశాడు. భారత బౌలర్లలో అక్షర్ పటేల్ 4 వికెట్లతో అద్భుత ప్రదర్శన చేయగా, ప్రసిద్ధ్ కృష్ణ, అరంగేట్ర బౌలర్ గుర్నూర్ బ్రార్ చెరో 2 వికెట్లు తీశారు.





# మనదే లార్డ్స్

క్రికెట్ మక్కాగా పేరున్న లార్డ్స్‌లో, ఇంగ్లాండ్ లాంటి మేటి జట్టుతో భారత మహిళలకు టెస్టు మ్యాచ్. ఇటీవలే టీ20 ప్రపంచకప్‌లో పేలవ ప్రదర్శన చేసిన హర్మన్‌ప్రీత్ సేన పెద్దగా అంచనాల్లేకుండా ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగింది. మైదానంలోకి దిగాక కసితో కదిలిన అమ్మాయిలు.. ఫేవరెట్‌గా మ్యాచ్‌లో అడుగుపెట్టిన ఆతిథ్య జట్టుకు పెద్ద షాకే ఇచ్చారు. తొలి ఇన్నింగ్స్‌లో క్రాంతి గౌడ్ అయిదు వికెట్ల ప్రదర్శన.. రెండో ఇన్నింగ్స్‌లో యాస్తిక భాటియా అద్భుత శతకం.. రెండు ఇన్నింగ్స్‌ల్లో స్మృతి మంధాన సూపర్ అర్ధశతకాలు.. ఇంకా మిగతా అమ్మాయిల కృషీ తోడై లార్డ్స్‌లో భారత్ ఏకంగా 270 పరుగుల భారీ విజయాన్నందుకుని చరిత్ర సృష్టించింది. లాంఛనం పూర్తయింది. ఇంగ్లాండ్‌తో లార్డ్స్‌లో ఏకైక టెస్టులో మూడో రోజే విజయాన్ని ఖాయం చేసుకున్న భారత మహిళల జట్టు.. నాలుగో రోజు ప్రత్యర్థిని చుట్టేసి 270 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి ఏడు వికెట్లు తీసిన పేసర్ క్రాంతి గౌడ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. 457 పరుగుల భారీ ఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 130/6తో ఆఖరి రోజైన సోమవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లాండ్.. మరో 56 పరుగులు జోడించి 186 పరుగులకే ఆలౌటైంది. అమీ జోన్స్ (54) ఓవర్‌నైట్ వ్యక్తిగత స్కోరుకు కేవలం రెండు పరుగులే జత చేసి ఔటైయింది. ఒక పరుగుతో బ్యాటింగ్ కొనసాగించిన ఎకిల్‌స్టోన్ (50) పోరాడింది. ఇసీ వాంగ్ (33 బంతుల్లో 1), లారెన్ ఫైలర్ (22 బంతుల్లో 4 నాటౌట్)తో కలిసి భారత విజయాన్ని ఆలస్యం చేసింది. వాంగ్, లారెన్ బెల్ (0) వికెట్లను దీప్తి శర్మ పడగొట్టడంతో ఇంగ్లాండ్ 159/9తో ఓటమికి అడుగు దూరంలో నిలిచింది. అర్ధసెంచరీ తర్వాత ఎకిల్‌స్టోన్‌ను స్నేహ్ రాణా (4/42) బౌల్డ్ చేసి ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌కు తెరదించింది. స్నేహ్‌తో పాటు సయాలి (2/24), క్రాంతి గౌడ్ (2/54), దీప్తి శర్మ (2/36) విజయంలో కీలకపాత్ర పోషించారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 285, ఇంగ్లాండ్ 170 పరుగులు చేశాయి.

మనసులో మాట



# అలా ఏ నాయికనీ విమర్శించొద్దు!

అందం.. అభినయంతో మెప్పించినా.. ప్రతిభావంతురాలైన నటిగా పేరు తెచ్చుకున్నా కానీ గత చిత్రాల విషయంలో విజయానికి అడుగు దూరంలోనే నిలిచిపోయారు నటి భాగ్యశ్రీ బోర్సే. ఇప్పుడామె 'లెనిన్' చిత్రంతో విజయాన్ని రుచి చూశారు. అఖిల్ అక్కినేని కథానాయకుడిగా నటించిన ఈ చిత్రం ఇటీవల విడుదలైన నేపథ్యంలో సోమవారం 'ఈనాడు సినిమా'తో ముచ్చటించారు భాగ్యశ్రీ.

అందుకే ఆ రోజు కన్నీళ్లు ఆగలేదు..

''తొలి విజయం ఎప్పుడూ మనసుకు దగ్గరగా ఉంటుంది. నేనీ పరిశ్రమలో స్థిరపడాలని వచ్చా. దాని కోసం నేను మరింత బాగా కష్టపడేలా ప్రోత్సాహాన్నిచ్చేది.. స్ఫూర్తినిచ్చేది సక్సెసే. అందుకే 'లెనిన్'తో నాకొచ్చిన ఈ తొలి విజయం చాలా ప్రత్యేకం. అందుకే ఆ రోజు వేదికపై భావోద్వేగానికి గురయ్యా. దీని తర్వాత నాకు మళ్లీ మరో విజయం దక్కొచ్చు. కానీ, నేను మళ్లీ ఇలా ఏడవకపోవచ్చు (నవ్వుతూ). తొలి విజయాన్ని అందుకున్నప్పుడు పొందినంత స్వచ్ఛమైన ఆనందం మళ్లీ కలగకపోవచ్చు. ఈ ప్రయాణంలో వ్యక్తిగతంగా నేను తెలుసుకుంది ఒకటే. ఈ పరిశ్రమలో జయాపజయాలు సహజం. కొన్నిసార్లు విజయం దక్కుతుంది. కొన్నిసార్లు పరాజయాలు పలకరిస్తాయి. ఫలితమేదైనా..పరిస్థితులు ఎలాంటివైనా ధైర్యంగా అనుకున్నది చేసుకుపోవడమే నాకు చిన్నప్పటి నుంచీ అలవాటు''.

అమ్మానాన్నలకి అదే నిజమైన విజయం

''జయాపజయాల విషయంలో మా అమ్మానాన్న ఆలోచనలు వేరుగా ఉంటాయి. ఓ నటిగా నా విషయంలో వాళ్లెప్పుడూ చాలా గర్వపడుతుంటారు. వాళ్లకి సక్సెస్ అంటే నేను నా పాత్రకి పరిపూర్ణంగా న్యాయం చేయడమే. వాళ్లు సినిమా చూడటానికి వెళ్లినప్పుడు తెరపై భాగ్యశ్రీ కనిపించకూడదు. ఓ కుమారి, ఓ మహాలక్ష్మి, భారతి.. ఇలా ఆ పాత్రలే కనిపించాలనుకుంటారు. అదే వాళ్లకి నిజమైన సక్సెస్. సమాజం దృష్టిలో విజయం అంటే అది ఆ సినిమా సాధించే వసూళ్లు. కానీ, నేను, మా ఫ్యామిలీ దానికిచ్చే నిర్వచనం తెరపై భాగ్యశ్రీని చూశామన్న ఫీల్ కలగకూడదు. అలాగే ఒక్క తప్పునీ ఎత్తి చూపించలేని రీతిలో నా నటన ఉండాలి. అదే నాకు అసలైన సక్సెస్. ఒకవేళ రేపెవరైనా నాతో.. 'నువ్వు ఈ సీన్ ఇంకా బాగా చేయాల్సింది, ఫలానా సీన్‌లో ఓ యాక్టర్‌గా నువ్వు నాకు నచ్చలేదు.. నీ నటనతో కనెక్ట్ అవ్వలేకపోయా' అని చెప్తే అప్పుడు నటిగా ఫెయిలయ్యానని ఒప్పుకుంటా. ఆ తప్పుని నా మీద వేసుకుంటా. అంతే కానీ, బాక్సాఫీస్ నంబర్స్ సరిగా రాలేదని... 'ఇది నీ ఫెయిల్యూర్' అని చెప్పడం, హీరోయిన్స్‌ని తప్పుపట్టడం సరికాదని నేను నమ్ముతా''

నా విషయంలోనూ అలాంటి మాటలే..

''అగ్రతారలు అమితాబ్ బచ్చన్ కావొచ్చు.. ప్రస్తుతం నేను కలిసి పని చేస్తున్న నా సహ నటుడు శివ కార్తికేయన్ కావొచ్చు.. వాళ్లంతా తమ సినీ ప్రయాణంలో కష్ట కాలాన్ని దాటొచ్చిన వాళ్లే. వాళ్లందరికీ ఫ్లాప్స్ వచ్చాయి. కింద పడ్డారు. ఒకానొక సమయంలో జనాలు 'అమితాబ్ పని అయిపోయింద'నీ అన్నారు. కానీ, ఆయన 'కౌన్ బనేగా కరోడ్‌పతి'తో మళ్లీ స్టార్ట్ చేసి.. జీవితంలో అన్నింటిని తిరిగి సాధించారు. ఈ పరిశ్రమలో నాకు నా సీనియర్స్ చెప్పిందొకటే. 'సక్సెస్ ఎంత ఫాస్ట్‌గా వస్తే.. నీ రన్ అంత షార్ట్‌గా ఉంటుంది. విజయం ఎంత ఆలస్యంగా వస్తే.. నీ కెరీర్ అంత సుదీర్ఘంగా సాగుతుంది'. నేను దీన్నే నమ్ముతా. ఓ నటిగా ప్రతి సినిమాకీ ప్రాణం పెట్టే పని చేయాలనుకుంటా. అలా ఉండగలిగినప్పుడే ఈ పరిశ్రమలో సుదీర్ఘ ప్రయాణం చేయగలను అనుకుంటున్నా. వరుసగా రెండు మూడు పరాజయాలు ఎదురవగానే 'ఐరెన్ లెగ్', 'అన్ లక్కీ' అనే మాటలు వినిపిస్తుండటం సహజం. 'కాంత', 'ఆంధ్ర కింగ్ తాలూకా' చిత్రాల తర్వాత నేనూ అలాంటి మాటలు విన్నా. కానీ, అలా ఏ నాయికనీ విమర్శించడం సరికాదు. ఎందుకంటే ఎడిటింగ్‌లో ఆఖరి నిర్ణయం మనది కాదు. కథ విషయంలో తుది నిర్ణయం మనదవ్వదు. ఆఖరికి స్టోరీ మారుతుందా? లేదా? అనేదీ స్పష్టత ఉండదు. ప్రేక్షకులకి ఇవ్వన్నీ తెలియాలి. ఒకవేళ రేపటిరోజున ఎడిటింగ్ రూమ్‌లో దర్శకుడు, నిర్మాత, హీరోతో పాటు నేనూ ఉంటే అలాంటి విమర్శల్ని సమానంగా తీసుకుంటా''.

ఆ దేవుడి దయతో..

''నేను ఏ కథనైనా ఓ సగటు ప్రేక్షకుడిలా వినడానికే ఇష్టపడతా. ఈ కథని ఓ ప్రేక్షకుడైతే ఎలా స్వీకరిస్తాడు.. అది వాళ్ల మనసుల్ని తాకేలా ఉందా? లేదా? అలాగే ఓ ప్రేక్షకుడిలా ఇది నా మనసుకు దగ్గరైందా? లేదా? అనేదానిపై తొలుత దృష్టిపెడతా. దాని తర్వాత ఆ పాత్ర ఎలా ఉంది.. అది సినిమాకి ఎంత ముఖ్యం.. ఆ పాత్ర లేకపోతే సినిమా ఉందా? లేదా? అనే అంశాల్ని గమనిస్తా. ఇవన్నీ చక్కగా కుదిరి.. ఆ కథ మనసుకు నచ్చిందంటే మరో ఆలోచన లేకుండా రంగంలోకి దిగిపోతా. నిజానికి 'లెనిన్' కథని తొలుత నాకే వినిపించారు.



## మార్పునకు నాంది ఈ విజయం!

సమంత ప్రధాన పాత్రధారిగా రూపొందిన 'మా ఇంటి బంగారం' ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్ల వసూళ్ల మైలురాయిని అందుకుని అరుదైన ఘనతని సొంతం చేసుకుంది. భారతదేశంలోనే అత్యధిక వసూళ్లని సాధించిన మహిళా ప్రధానమైన చిత్రాల్లో 'మా ఇంటి బంగారం' ఆరో స్థానాన్ని దక్కించుకుందని సినీ వర్గాలు తెలిపాయి. నందినీరెడ్డి దర్శకత్వంలో సమంత ప్రధాన పాత్రధారిగా నటిస్తూనే, తన భర్త రాజ్ నిడిమోరు, హిమాంక్‌రెడ్డి దువ్వూరుతో కలిసి నిర్మించిన చిత్రమిది. తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో విడుదలైంది. హాస్యం, యాక్షన్ మేళవింపుగా రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకుల మెప్పు పొందింది. రూ.100 కోట్ల మైలురాయిని చేరుకోవడంపై ఆనందం వ్యక్తం చేస్తూ ఇన్‌స్టాలో ఓ పోస్ట్‌ని పంచుకున్నారు సమంత. ''ఈ చిత్రం గురించి ప్రేక్షకులు మాట్లాడుకుంటున్నారా? మేం చేస్తున్న ప్రచారం వాళ్లకు చేరువవుతోందా? అసలు ఈ సినిమా అంటూ ఒకటి ఉందని వాళ్లకి తెలుసా? అని విడుదలకు ముందు తీవ్రంగా ఆలోచించడం నాకు బాగా గుర్తుంది. అప్పుడే నా స్నేహితుడు ఒక ప్రదర్శనకారుడికి ఫోన్ చేసి మాట్లాడాడు. ఆ సంభాషణని నేనూ వింటున్నానని అతనికి తెలియదు. ఈ సినిమా గురించి మీరేం అనుకుంటున్నారని అడగ్గానే ఏమాత్రం సంకోచించకుండా 'ఒక హీరోయిన్ సినిమాని ఎవరైనా ఎందుకు చూస్తారు? ఆమె ఒక పెద్ద హీరో సినిమాలో నటిస్తే పర్వాలేదు. ఎందుకంటే గ్లామర్ వల్లే ఆమె ప్రేక్షకులకు తెలుసు. కానీ ఒక నాయికా ప్రధానమైన పాత్రలో ఎవరు చూస్తారు?' అన్నారు. ఎవరైనా ఒక సాహసం చేయడానికి సిద్ధపడినప్పుడే నిజమైన మార్పు వస్తుందని అనుకుంటున్నా. చాలాసార్లు ఆ సాహసాలు ఫలించవు. కానీ అప్పుడప్పుడు, అవి ఫలిస్తాయి. మా విషయంలోనూ అది ఫలించింది. ఇది గొప్ప మార్పునకు నాంది అవుతుందని ఆశిస్తున్నా. తదుపరి ఏ ప్రదర్శనకారుడికైనా ఫోన్ చేసి మహిళా ప్రధాన చిత్రం గురించి అడిగితే సమాధానం వెంటనే 'కాదు...' అని రాకూడదని నేను ఆశిస్తున్నా'' అంటూ ఆ పోస్ట్‌లో రాసుకొచ్చారు. సినిమా విజయోత్సాహంలో ఉన్న ఆమె త్వరలోనే పండంటి బిడ్డకు స్వాగతం పలకనున్నారు. 'మా ఇంటి బంగారం' సినిమా రూ.100 కోట్ల వసూళ్లు సాధించడంపై పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు ఆమెకు శుభాకాంక్షలు చెప్పారు.





## కొత్త ఇంట్లోకి అడుగుపెట్టిన శృతి హాసన్..

ప్రముఖ హీరోయిన్ శృతి హాసన్ తన జీవితంలో మరో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. చెన్నైలో నిర్మించిన తన కొత్త ఇంట్లోకి ఇటీవల ఆమె గృహప్రవేశం చేశారు. కుటుంబ సభ్యులు, సన్నిహిత బంధువుల సమక్షంలో సంప్రదాయ పద్ధతిలో ఈ హౌస్‌వార్మింగ్ పూజా కార్యక్రమం నిర్వహించారు. నిజానికి గతంలో ఈ ముద్దుగుమ్మ ముంబైలో ఉండే వారు. ప్రస్తుతం అక్కడి నుంచి చెన్నైకి షిఫ్ట్ అయ్యి కొత్త ఇంట్లోకి అడుగుపెట్టారు. హౌస్‌వార్మింగ్ కార్యక్రమం సందర్భంగా ఇంటిని పూలతో అందంగా అలంకరించి, ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ప్రస్తుతం శృతి హాసన్ కొత్త ఇంట్లో జరిగిన గృహప్రవేశ వేడుకకు సంబంధించిన కొన్ని ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ ఫోటోల్లో సంప్రదాయ దుస్తుల్లో కనిపించిన శృతి చాలా సంతోషంగా, ప్రశాంతంగా కనిపించారు. ఈ సందర్భంగా ఆమె అభిమానులు కంగ్రాట్స్ తెలియజేస్తూ సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు. హీరో కమల్ హాసన్ కుమార్తెగా సినీ రంగంలో అడుగుపెట్టిన శృతి, ప్రస్తుతం దక్షిణాది, బాలీవుడ్ చిత్రాల్లో బిజీగా ఉన్నారు. నటిగా మాత్రమే కాకుండా గాయనిగా, సంగీత దర్శకురాలిగా కూడా ఆమె తన ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. శృతి హాసన్ చెన్నైకి షిఫ్ట్‌కి కావడం వెనక తన సింగింగ్ కెరీర్‌పై పూర్తి స్థాయిలో ఫోకస్ చేయడానికే అని అంటున్నారు.

## విజయ్ సేతుపతి 'ట్రైన్' వచ్చేస్తోంది.. రిలీజ్ ఆగస్టులోనే

'మక్కల్ సెల్వన్' విజయ్ సేతుపతి కథానాయకుడిగా, ప్రముఖ దర్శకుడు మిస్కిన్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'ట్రైన్'. ఈ చిత్రాన్ని 2026 ఆగస్టులో థియేటర్లలో విడుదల చేయనున్నట్లు ప్రముఖ నిర్మాత కలైపులి ఎస్. థాను అధికారికంగా ప్రకటించారు. చెన్నైలో ఇటీవల జరిగిన టీజర్ లాంచ్ కార్యక్రమంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. ఇటీవల విడుదలైన 43 సెకన్ల నిడివి గల టీజర్, చిత్రంపై అంచనాలను భారీగా పెంచింది. వేగంగా దూసుకెళ్తున్న 'బ్లూ మౌంటెన్ ఎక్స్‌ప్రెస్' రైలును కొంతమంది సాయుధులు తమ అధీనంలోకి తీసుకోవడం, ఆపదలో ఉన్న ప్రయాణికులను కాపాడేందుకు విజయ్ సేతుపతి చేసే వీరోచిత పోరాటం వంటి ఉత్కంఠభరిత సన్నివేశాలతో టీజర్‌ను ఆకట్టుకునేలా రూపొందించారు. ఈ కార్యక్రమంలో నిర్మాత మాట్లాడుతూ, "ఈ సినిమాను ఆగస్టులో ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తాం" అని పేర్కొనగా, దర్శకుడు మిస్కిన్ సరదాగా జోక్యం చేసుకుంటూ కచ్చితమైన తేదీని ప్రకటించాలని కోరారు. ఆగస్టు 14న మరో సినిమా ఉందంటూ ఆయన చమత్కరించడంతో సభలో నవ్వులు పూశాయి. ఈ చిత్రానికి కథ అందించడమే కాకుండా, మిస్కిన్ స్వయంగా సంగీతాన్ని సమకూర్చడం విశేషం. ఈ కథను ప్రత్యేకంగా విజయ్ సేతుపతి కోసమే సిద్ధం చేశానని, ఆయన తరహా నటనను కమల్ హాసన్, అమీర్ ఖాన్ వంటి దిగ్గజ నటులు సైతం ప్రదర్శించలేరని మిస్కిన్ ప్రశంసల వర్షం కురిపించారు. 2023లో ప్రారంభమైన ఈ చిత్రంలో శ్రుతి హాసన్, నాజర్, యుగి సేతు, నరైన్, కేఎస్ రవికుమార్, సంపత్ రాజ్



వంటి భారీ తారాగణం నటిస్తోంది. ఇందులో నరైన్ పోలీస్ అధికారిగా కనిపిస్తుండటంతో, ఇది మిస్కిన్ గత చిత్రం 'అంజాదే'కు కొనసాగింపు కావచ్చని, తద్వారా 'మిస్కిన్ సినిమాటిక్ యూనివర్స్'కు అంకురార్పణ జరుగుతోందని సినీ వర్గాల్లో ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఆగస్టులో చిత్ర విడుదల తేదీని త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు.

CHIEF EDITOR BY KANCHARLA ATCHUTA RAOPUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/A2169. PRINTED BY CHAITANYAVARADHI PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 08914540746

# మనసులోమాట

KANCHARLA

# తెలంగాణ

హైదరాబాద్ | రంగారెడ్డి | మహబూబ్ నగర్ | మెదక్ | నల్గొండ
నిజామాబాద్ | ఆదిలాబాద్ | కరీంనగర్ | వరంగల్ | ఖమ్మం

బుధవారం 15 జులై 2026 పేజీలు 16




# హైదరాబాద్‌కు నాలుగు కొత్త ట్యాంక్‌బండ్‌లు

- హుస్సేన్‌సాగర్ తరహాలో నాలుగు చెరువుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం
- ఫాక్స్‌సాగర్, అమీన్‌పూర్, అంబీర్‌చెరువు, సరూర్‌నగర్ చెరువులు ప్రాజెక్టులో భాగం
- మొత్తం రూ.536 కోట్లతో అభివృద్ధి ప్రతిపాదనలు సిద్ధం
- మొదటి దశలో చెరువు కట్ట బలోపేతం, రోడ్ల నిర్మాణానికి రూ.227 కోట్లు
- ఐఐటీ హైదరాబాద్ భాగస్వామ్యంతో హైడ్రా, హెచ్ఎండీఏ ప్రణాళికలు
- పర్యాటకం, ప్రజా వినోదం, పరిసర ప్రాంతాల అభివృద్ధికి ప్రాజెక్టు తోడ్పాటు

**హైదరాబాద్, జూలై 14 (మనసులో మాట):**

హుస్సేన్‌సాగర్ తరహాలో నగరంలోని నాలుగు పెద్ద చెరువులను సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేసే ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఐఐటీ హైదరాబాద్ భాగస్వామ్యంతో హైడ్రా, హెచ్ఎండీఏ అధికారులు ఇటీవల ఫాక్స్‌సాగర్, అమీన్‌పూర్, అంబీర్‌చెరువు, సరూర్‌నగర్ చెరువుల అభివృద్ధికి రూ.536 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించారు. చెరువు కట్టను బలోపేతం చేయడం, రోడ్ల నిర్మాణం, ఇతరత్రా ప్రధాన పనులను మొదటి దశలో, పార్కులు, ఇతర అభివృద్ధి పనులను రెండో దశలో, సుందరీకరణ పనులను మూడో దశలో చేపట్టాలని పూర్తిస్థాయి నివేదికను సిద్ధం చేశారు. పురపాలకశాఖ నివేదికను పరిశీలించి.. రూ.227 కోట్లతో చేపట్టాల్సిన ప్రధానమైన మొదటి దశ పనులకు పరిపాలన అనుమతి ఇస్తూ సోమవారం ఉత్తర్వు జారీ చేసింది. వెంటనే కార్యాచరణ చేపట్టాలని హైడ్రాను ఆదేశించింది. ప్రాజెక్టు వ్యయాన్ని హెచ్ఎండీఏ భరించాలని ప్రభుత్వం ఉత్తర్వులో స్పష్టం చేసింది.

**సీఎం ఏమన్నారంటే..**

“నగరం నలువైపులా హుస్సేన్‌సాగర్ లాంటి నాలుగు ట్యాంక్‌బండ్‌లను అభివృద్ధి చేస్తే.. ఆయా ప్రాంతాల ప్రజలు సెలవు రోజుల్లో కుటుంబ సమేతంగా ఆయా జలవనరులను సందర్శిస్తారు. చుట్టుపక్కల ప్రాంతాలకు పర్యాటకంగా ఆదరణ పెరుగుతుంది” అంటూ సీఎం రేవంత్‌రెడ్డి ఏడాది కిందట హైడ్రాను ఆదేశించారు. అందులో భాగంగా ఎంపిక చేసిన నాలుగు చెరువులకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఐఐటీ హైదరాబాద్ భాగస్వామ్యంతో అభివృద్ధి ప్రణాళికలు రూపొందించారు. అదే సమయంలో.. ఫాక్స్‌సాగర్ ఎగువన 40 ఎకరాల భూములకు సంబంధించిన భూ వినియోగ మార్పిడి ఉత్తర్వులను ప్రభుత్వం రద్దు చేసింది.




# గోదావరి-నల్లమలసాగర్‌పై నిర్లక్ష్యం బట్టబయలు

- కోర్టులో నిలవొద్దనే లోపభూయిష్ఠంగా వ్యాజ్యం
- సీఎంకు తెలంగాణ నీటి వాటాలపై శ్రద్ధ లేదు: హరీశ్‌రావు ఆరోపణ

**సంగారెడ్డి టౌన్జులై 14 (మనసులో మాట):**

గోదావరిబనకచర్ల, గోదావరినల్లమలసాగర్‌పై భారాస మొదటి నుంచీ హెచ్చరిస్తూనే ఉందని, తమ పార్టీ నిలదీయడంతోనే ప్రభుత్వం పాత తేదీలతో లేఖలు రాసిందన్నారు. సుప్రీంకోర్టులో తాజాగా గోదావరినల్లమలసాగర్‌పై తీర్పు వచ్చిందని, వ్యాజ్యం సరిగా ఫైల్ చేయలేదని రాష్ట్ర ప్రభుత్వానికి న్యాయస్థానం మొట్టికాయలు వేసిందని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. సోమవారం సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో, అంతకు ముందు ఖేడ్‌లో సర్, భారాస సభ్యత్వ నమోదుపై మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ‘కోర్టులో నిలవొద్దనే లోపభూయిష్ఠంగా దావా వేశారు. ముఖ్యమంత్రి ఆదేశం లేకుండా ఇంత బలహీనమైన దావా వేయడం సాధ్యం కాదు. కోర్టులో వాదనల కంటే ముందే ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించాల్సి ఉన్నా ఎందుకు

..మిగతా2లో



2

జీహెచ్ఎంసీ నోటీసులపై హైకోర్టును ఆశ్రయించిన ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్

# రూ.40 వేల కోట్ల బకాయి పెట్టి వెళ్లారు!

- పదేళ్లలో రూ.8 లక్షల కోట్లకు పైగా అప్పులు చేసి రూ.40 వేల కోట్ల రోడ్ల బకాయిలు మిగిల్చారని భారాసపై మంత్రి కోమటిరెడ్డి విమర్శ
- నారాయణపేట, జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లాల్లో రూ.1,271.48 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



2



2

## లంచం తీసుకుంటూ.. అనిశాకు చిక్కిన పెద్దపల్లి మున్సిపల్ ఏఈ

- ఇంటి సోదాల్లో రూ.32.31 లక్షల నగదు స్వాధీనం

# గోదావరి-నల్లమలసాగర్‌పై నిర్లక్ష్యం బట్టబయలు

(మొదటి పేజీ తరువాయి)

పట్టించుకోలేదు? భారాసను తిట్టడంపై ఉన్న శ్రద్ధ తెలంగాణ నీటి వాటాల రక్షణపై లేదు. రాష్ట్ర ప్రయోజనాల కంటే చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లించేందుకే ప్రాధాన్యం ఇస్తున్నారు. రేవంత్‌రెడ్డి తెలంగాణ ఉద్యమ ద్రోహి మాత్రమే కాదు జలద్రోహి కూడా. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ సహా ఏపీ అక్రమ ప్రాజెక్టులపై భారాస ప్రభుత్వ హయాంలో ఎన్నో స్టేలు తెచ్చాం. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఏపీకి పరోక్షంగా సహకరిస్తూ తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెడుతోంది. ఆదిత్యనాథ్‌దాస్‌ను నీటి పంపకాల కమిటీ సలహాదారుగా నియమించారు. తెలంగాణకు వెన్నుపోటు పొడిచిన వ్యక్తి ఆదిత్యనాథ్. కర్ణాటకలో ముగ్గురు సీఎంల సమావేశంలో ఏం చర్చించారో ప్రజలకు చెప్పాలి. 80 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెబుతున్నారు. మా ప్రభుత్వ హయాంలో 202021లోనే 90 లక్షల టన్నుల ధాన్యం కొన్నాం. దేవాదుల ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోంది.



**త్వరలోనే పాదయాత్ర చేస్తా**

సంగారెడ్డి జిల్లాలోని సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పనులను చేపట్టాలని డిమాండ్ చేస్తూ త్వరలోనే పాదయాత్ర చేపడతా. నారాయణఖేడ్, జహీరాబాద్, అందోలు నియోజకవర్గాల్లో పంటలు పండాలని కేసీఆర్ ఆయా ఎత్తిపోతల పథకాలకు ఖేడ్‌లో శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పనులు నిలిపివేసింది. సింగూరులో నీళ్లున్నా మరమ్మతుల కోసమంటూ ఖాళీ చేయడంతో తాగు, సాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు పట్టించుకోకపోవడంతోనే షాబాద్‌లో సైకో రాజ్‌కుమార్ ఆరుగురిని చంపాడు. పోక్సో కేసు నమోదైనా 45 రోజులపాటు అరెస్టు కాకుండా సీఎం సన్నిహితుడు రూ.20 లక్షలు తీసుకుని కాపాడినందునే హత్యలకు తెగబడ్డాడు. విలేకరుల సమావేశంలో సంగారెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.40 వేల కోట్ల బకాయి పెట్టి వెళ్లారు!



**మహబూబ్‌నగర్ (మనసులో మాట) జూలై 14:**

'పదేళ్ల పాలనలో రూ.8 లక్షల కోట్లకు పైగా అప్పులు చేశారు. అయినా ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్లకు రూ.40 వేల కోట్లు బకాయిలు పెట్టి వెళ్లారు' అని రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గత భారాస ప్రభుత్వాన్ని విమర్శించారు. సోమవారం ఆయన నారాయణపేట, జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లాల్లో పర్యటించారు. మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరిలతో కలిసి రూ.1,271.48 కోట్ల హ్యామ్ రోడ్లు, వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. 'భారాస పాలనలో రాష్ట్రంపై అప్పుల భారం మోపడంతో ప్రస్తుతం ఆర్థికంగా క్లిష్టపరిస్థితుల్లో ఉన్నాం. గత ప్రభుత్వం నాటి బిల్లుల కోసం ఇప్పటికీ గుత్తేదారులు తిరుగుతున్నారు. ప్రజలకు సురక్షితమైన రవాణా వ్యవస్థ అందించడమే లక్ష్యంగా మేం ముందుకెళ్తున్నాం.పదవి కోసం పగటి కలలు కంటున్న కేసీఆర్ ఫాంహౌస్ దాటి బయటికి రావడం లేదు. వచ్చే రెండేళ్లలో ఎస్ఎల్‌బీసీ, పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టులను పూర్తిచేస్తాం' అని తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్‌లో హ్యామ్ రోడ్ల శిలాఫలకంపై తనపేరు లేదని గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య ఛైర్‌పర్సన్ సరిత మంత్రి దృష్టికి తీసుకెళ్లి.. సాంబ వద్దకు రాకుండానే వెనుదిరిగారు.

# లంచం తీసుకుంటూ.. అనిశాకు చిక్కిన పెద్దపల్లి మున్సిపల్ ఏఈ

**పెద్దపల్లి (మనసులో మాట) జూలై 14:**

బిల్లులు చెల్లించేందుకు గుత్తేదారు నుంచి లంచం తీసుకుంటూ పెద్దపల్లి మున్సిపల్ ఏఈ సతీశ్‌ను అవినీతి నిరోధక శాఖ అధికారులకు దొరికిపోయాడు. పథకం ప్రకారం సతీశ్ కుమార్ నివాసం సమీపంలో మాటు వేసిన ఏసీబీ అధికారులు.. రూ.2 లక్షల లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయానికి తీసుకెళ్లి ప్రత్యేక గదిలో విచారణ నిర్వహించారు. ఈ మేరకు అనిశా డీఎస్పీ మహేందర్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. పెద్దపల్లి పురపాలిక పరిధిలోని కూనారం రోడ్డు, తెనుగువాడ స్మశాన వాటిలో చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులు రూ.12.20 లక్షల చెల్లించేందుకు గుత్తేదారును గత కొన్ని రోజులుగా ఏఈ సతీశ్ తన చుట్టూ తిప్పుకుంటున్నాడు. ఈ క్రమంలో రూ.4.5 లక్షల లంచం ఇస్తేనే బిల్లులను ప్రాసెస్ చేస్తానని చెప్పాడు. కానీ అంతమొత్తం చెల్లించేందుకు ఇష్టపడని గుత్తేదారు అనిశా అధికారులను సంప్రదించాడు. వారిచ్చిన సూచనల ప్రకారం రూ.2 లక్షలు ఇచ్చేందుకు ఏఈతో కాంట్రాక్టర్ ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం రంగంపల్లిలోని సతీశ్ కుమార్ నివాసానికి వెళ్లిన గుత్తేదారు.. రూ. 2లక్షల నగదును ఇస్తుండగా అక్కడే మాటు వేసిన అనిశా అధికారులు ఏఈని పట్టుకున్నారు. ఈ సందర్భంగా సతీశ్ నివాసంలో అధికారులు సోదాలు నిర్వహించగా రూ.32 లక్షల నగదు లభ్యమైనట్లు డీఎస్పీ వెల్లడించారు. అనంతరం ఏఈ సతీశ్‌ను అరెస్టు చేసి, ఏసీబీ కోర్టుకు తరలించారు.



## హైడ్రా యాక్షన్.. రామంతాపూర్ పెద్దచెరువులో భారీ ఆక్రమణల కూల్చివేత



**హైదరాబాద్ (మనసులో మాట) జూలై 14:**

ఉప్పల్ నియోజకవర్గంలోని రామంతాపూర్ పెద్ద చెరువు ఆక్రమణలను హైడ్రా మంగళవారం తొలగించింది. రామంతాపూర్ పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్ విస్తీర్ణం 30 ఎకరాలు కాగా.. 16 ఎకరాల వరకూ కబ్జాకు గురైంది. ఇందులో 12 ఎకరాల్లో శాశ్వత కట్టడాలు వచ్చాయి. వీటి జోలికి వెళ్లకుండా మరో 4 ఎకరాల మేర తాత్కాలిక షెడ్డులు, గుడిసెలుంటే వారికి డబుల్‌బెడ్ రూం ఇళ్లు మంజూరుకు హైడ్రా సిఫారసు చేసింది. ఇలా మొత్తం 18 ఎకరాల మేర చెరువును అభివృద్ధి చేస్తున్న క్రమంలో 1900 గజాల మేర జీ ప్లస్ 2 నిర్మాణంలో ఉన్న వాణిజ్య భవనంతో పాటు.. 280 గజాల మేర ఉన్న ఆటో గ్యారేజీని కూడా హైడ్రా మంగళవారం తొలగించింది. వర్షాకాలం చెరువు నిండితే గుడిసెలు మునిగిపోయేవి.. అక్కడ నివసిస్తున్న వారు ప్రతి ఏటా చాలా అవస్థలు పడుతుండేవారు. చెత్త సేకరణతో పాటు.. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించే వారికి డబుల్‌బెడ్‌రూం ఇళ్ల మంజూరీకి హైడ్రా సిఫారసు చేయగా.. ప్రభుత్వం సానుకూలంగా స్పందించిన విషయం విధితమే. ప్రభుత్వం కూడా కేటాయింపులో ప్రాధాన్యం ఇళ్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంది. దాదాపు రూ.19 కోట్లతో రామంతాపూర్ పెద్దచెరువును అభివృద్ధి చేస్తున్న క్రమంలో ఎఫ్‌టీఎల్ విస్తరణ పనులకు ఆటంకాలు తొలగాయి. రామంతాపూర్ చెరువు అభివృద్ధి పనుల్లో ఎలివేషన్‌కు ఈ ఆక్రమణలు తొలగింపు ఉపయోగపడనుంది.

# జీహెచ్ఎంసీ నోటీసులపై హైకోర్టును ఆశ్రయించిన ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్

**హైదరాబాద్ (మనసులో మాట) జూలై 14:**

జీహెచ్ఎంసీ నోటీసులపై ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్ హైకోర్టును ఆశ్రయించింది. ఈనెల 7న జారీ చేసిన నోటీసులను సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. హుస్సేన్‌సాగర్ ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు చేపట్టారని ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్‌కు జీహెచ్ఎంసీ నోటీసులు జారీ చేసింది. హుస్సేన్‌సాగర్ ఎఫ్‌టీఎల్ ప్రాథమికంగా నిర్ధరించలేదని ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్ పిటిషన్‌లో పేర్కొంది. ఎలాంటి చర్యలు చేపట్టకుండా జీహెచ్ఎంసీని ఆదేశించాలని హైకోర్టును కోరింది.



# కరువును కాళేశ్వరంతో ముడిపెట్టి రాజకీయాలు చేయడం సరికాదు: ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణరావు

- **ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకే కన్నేపల్లి పంప్‌హౌస్ నుంచి నీటి ఎత్తిపోతల నిలిపివేత**

**పెద్దపల్లి (మనసులోమాట) జూలై 14:**



కరువును కాళేశ్వరం ప్రాజెక్టుతో ముడిపెట్టి రాజకీయ లబ్ధి పొందాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యుడు చింతకుంట విజయరమణరావు విమర్శించారు. కరీంనగర్ ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కరీంనగర్ పర్యటనలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని అన్నారు. ముఖ్యమంత్రిని విమర్శించే ముందు వాస్తవాలను తెలుసుకోవాలని, వరుస రాజకీయ వైఫల్యాలే బీఆర్ఎస్ నాయకత్వ పనితీరుకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ సమయంలో భారీ ఎత్తున ప్రచారం చేసుకున్న బీఆర్ఎస్, ఇప్పుడు అదే ప్రాజెక్టును కరువు రాజకీయాలకు వేదికగా మార్చే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. మాజీ మంత్రి హరీష్‌రావు మరో మూడు నెలలు మంత్రి పదవి ఇస్తే కాళేశ్వరం సమస్యలను పరిష్కరిస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన మంత్రిగా ఉన్న కాలంలోనే కాళేశ్వరం నిర్మాణంలో లోపాలు బయటపడ్డాయని, ప్రస్తుతం చేస్తున్న వ్యాఖ్యలు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని విమర్శించారు. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించి ఉంటే మరింత ప్రయోజనం కలిగేదని, కానీ అప్పటి ప్రభుత్వం ఇతర నిర్ణయాలతో గోదావరిపై కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించిందని అన్నారు. నిర్మాణం పూర్తయి కొద్ది కాలానికే మూడు బ్యారేజీల్లో సమస్యలు తలెత్తడంపై బీఆర్ఎస్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన శ్రీరాంసాగర్, ఎల్ఎండీ, శ్రీపాద ఎల్లంపల్లి వంటి ప్రాజెక్టులు ఇప్పటికీ రైతాంగానికి ప్రయోజనం చేకూరుస్తున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి దూరదృష్టితో నిర్మించిన ఎల్లంపల్లి ప్రాజెక్టు ఉత్తర తెలంగాణకు జీవనాడిగా నిలిచిందని అన్నారు. కన్నేపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉందని నిపుణుల కమిటీ, ఎన్‌డీఎస్‌ఏ సూచించినందునే ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరిస్తోందని విజయరమణరావు తెలిపారు. నిపుణుల నివేదికల ఆధారంగానే ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. రైతు సంక్షేమంపై చిత్తశుద్ధి లేని బీఆర్ఎస్ ఇప్పుడు కాళేశ్వరం పేరుతో ప్రజల్లో గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ సూడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సయ్య, కార్పొరేటర్లు పడాల అజయ్ గౌడ్, చెల్లోజు రాజు, అజయ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

---

# గౌడ జాతి, పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్‌పై వ్యాఖ్యలను ఖండిస్తూ ఎల్బీనగర్‌లో బీసీ గౌడ సంఘాల నిరసన

**ఎల్బీనగర్ (మనసులోమాట) జూలై 14:**



గౌడ జాతి, యాదాద్రి దేవాలయ ట్రస్ట్ బోర్డు సభ్యురాలు పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్‌పై తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి, ఆయన తండ్రి జక్కిడి ప్రభాకర్ రెడ్డి చేసినట్లు ఆరోపించబడుతున్న అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ బీసీ, గౌడ సంఘాల ఆధ్వర్యంలో ఎల్బీనగర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. నిరసనకు ముందు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అఖిల భారత గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కూరెళ్ల వేములయ్య గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలు బీసీ, గౌడ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ జక్కిడి శివచరణ్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ పదవుల నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. బడుగు, బలహీన వర్గాలపై అవమానకర వ్యాఖ్యలు సహించబోమని, బీసీల జోలికి వస్తే సంఘటితంగా ఎదుర్కొంటామని హెచ్చరించారు. ఇటువంటి ఘటనలు పునరావృతమైతే తీవ్ర ఆందోళనలు చేపడతామని తెలిపారు. "రాజ్యాధికారమే దిశగా - మేమెంతో మాకంత" అనే నినాదంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ రాష్ట్ర అధ్యక్షుడు అంబాల మల్లేష్ గౌడ్, కల్లు గీత వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఐలి వెంకన్న గౌడ్, బీసీ సామైక్య రాష్ట్ర అధ్యక్షుడు దుర్గయ్య గౌడ్, ఉద్యమ వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు దేశగాని సాంబశివ గౌడ్, టీఆర్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టి జానయ్య యాదవ్, అఖిల భారత గౌడ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దగోని నగేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బత్తిని సురేందర్ గౌడ్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బందారం అనిల్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి చౌట బాలరాజ్ గౌడ్ తదితరులతో పాటు గౌడ, బీసీ, ఎస్సీ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

---

# మాసబ్ ట్యాంక్ రోడ్డులో గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



**హైదరాబాద్ (మనసులోమాట) జూలై 14:**

మాసబ్ ట్యాంక్ ఎన్ఎండిసీ రోడ్డు మార్గంలో మంగళవారం తెల్లవారుజామున ఒక గుర్తుతెలియని వ్యక్తి కేబుల్ వైర్‌తో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం సుమారు 4:00 నుంచి 5:00 గంటల మధ్య కాలంలో స్థానికులు దీనిని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడికి సుమారు 35 నుంచి 40 ఏళ్లు ఉండవచ్చు. హిందూ సంప్రదాయానికి చెందిన వ్యక్తిగా కనిపిస్తున్నారు. పసుపు, నలుపు రంగు చారల టీషర్ట్, నల్లటి ప్యాంట్ ధరించి ఉన్నారు. ఘటన స్థలంలో మృతుని చేతిలో ఒక హెల్మెట్ లభించింది. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న మెహదీపట్నం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఇబ్రహీంపట్నంలో వైద్య సేవల మెరుగుదలపై మంత్రి దామోదర, ఎమ్మెల్యే మల్‌రెడ్డి సమీక్ష

**ఇబ్రహీంపట్నం (మనసులోమాట) జూలై 14:** ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ప్రభుత్వ వైద్య సేవలను మరింత బలోపేతం చేసి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి నియోజకవర్గంలోని వైద్యారోగ్య పరిస్థితులు, ఆస్పత్రుల పనితీరు, మౌలిక సదుపాయాలపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది కొరత, మౌలిక వసతులు, వైద్య సేవలపై మంత్రి ఆరా తీశారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల పరిస్థితులపై సమగ్ర నివేదికను శనివారంలోగా సమర్పించాలని



అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని, అవసరమైన నిధులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ ఇబ్రహీంపట్నంలో పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా సూపర్ స్పెషాలిటీ స్థాయి ఆస్పత్రి అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. తాత్కాలికంగా కొనసాగుతున్న ఆస్పత్రిలో మరిన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని, పేద రోగులు బయట మందులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి రాకూడదని అధికారులను ఆదేశించారు. డాక్టర్లు, నర్సులు, సిబ్బంది విధులకు సమయానికి హాజరు కావాలని, బస్తీ దవాఖానాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. అత్యవసర సమయాల్లో, ముఖ్యంగా రాత్రి వేళల్లో డ్యూటీ వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, సీజనల్ వ్యాధుల నివారణపై ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు, గర్భిణులకు పోషకాహారం, ఇతర సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలయ్యేలా చూడాలని, రోగుల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. సమావేశంలో వైద్యారోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ సంగీత సత్యనారాయణ, డీహెచ్ రవీంద్ర నాయక్, డీఎంఈ నరేందర్ కుమార్, రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్ఓ స్వర్ణ కుమారి రెడ్డి, డీసీహెచ్ఎస్ అనురాగిణి రెడ్డి, తదితర అధికారులు పాల్గొన్నారు.

# 18న 'చలో గాంధీభవన్' కు బీసీ సంఘాల పిలుపు




**ఎల్బీనగర్ (మనసులోమాట) జూలై 14:** యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ బోర్డు సభ్యురాలు పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్‌పై యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్ రెడ్డి చేసినట్లు ఆరోపిస్తున్న వ్యాఖ్యలను నిరసిస్తూ ఈ నెల 18న 'చలో గాంధీభవన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీసీ సంఘాల జేఏసీ ప్రతినిధులు ప్రకటించారు. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈశ్వరమ్మ యాదవ్‌కు శివచరణ్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని, ఆయనను పార్టీ పదవి, ప్రాథమిక సభ్యత్వం నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. శాంతియుత నిరసనకు వెళ్లిన బీసీ, యాదవ సంఘాల నాయకులపై దాడులు జరిగాయని ఆరోపించిన జేఏసీ నేతలు, ఈ ఘటనపై కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం స్పందించాలని డిమాండ్ చేశారు. బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలు, ఘటనలను తీవ్రంగా ఖండించారు. ఈ అంశంపై రాష్ట్రవ్యాప్తంగా వారం రోజుల పాటు ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా జూలై 15న అన్ని జిల్లాల్లో విలేకరుల సమావేశాలు నిర్వహించి, వివిధ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు అందజేస్తామని చెప్పారు. జూలై 16న రాష్ట్రవ్యాప్తంగా శివచరణ్ రెడ్డి దిష్టిబొమ్మల దహనం, జూలై 17న మండల, జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు, ధర్నాలు నిర్వహిస్తామని వెల్లడించారు. అప్పటికీ స్పందన లేకుంటే జూలై 18న రాష్ట్ర నలు మూలల నుంచి పెద్ద ఎత్తున హైదరాబాద్‌కు చేరుకుని గాంధీభవన్ వద్ద 'చలో గాంధీభవన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలోని బీసీ, యాదవ, ఇతర కుల సంఘాలు, మహిళా సంఘాలు ఈ కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని బీసీ సంఘాల జేఏసీ ప్రతినిధులు పిలుపునిచ్చారు.

# ఉపాధ్యాయులకు షీ టీమ్ అవగాహన సదస్సు

- **మహిళల భద్రత, బాలల రక్షణ, సైబర్ నేరాలపై అవగాహన కల్పించిన అధికారులు**



**పెద్దపల్లి (మనసులోమాట) జూలై 14:** రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పెద్దపల్లి షీ టీమ్ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో మహిళల భద్రత, బాలల రక్షణ, సైబర్ నేరాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్ సభ్యురాలు స్నేహలత మాట్లాడుతూ, మహిళల భద్రతతో పాటు బాలల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. చిన్నారులకు గుడ్ టచ్ -బ్యాడ్ టచ్, యుక్తవయస్సులో వచ్చే శారీరక, మానసిక మార్పులు, టీనేజ్ దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. అలాగే మహిళలపై జరిగే వేధింపులు, ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై వివరించారు. మహిళల భద్రత కోసం షీ టీమ్ సిబ్బంది ప్రతిరోజూ బస్టాండ్లు, ప్రధాన కూడళ్లు, విద్యాసంస్థల పరిసర ప్రాంతాల్లో నిరంతరం గస్తీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా మహిళలు లేదా విద్యార్థినులు వేధింపులకు గురైతే భయపడకుండా 6303923700 నంబర్‌కు సంప్రదించాలని, ఫిర్యాదు చేసిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. సైబర్ నేరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, లోన్ యాప్‌లు, ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఒకవేళ ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని కోరారు. మహిళలకు ఎలాంటి ప్రమాదం, బెదిరింపులు లేదా అత్యవసర పరిస్థితులు ఎదురైనా వెంటనే 100 లేదా 112 అత్యవసర సేవల నంబర్లకు కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు షీ టీమ్ సభ్యులు సురేష్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# తలపై దాడితో వృద్ధుడి దారుణ హత్య

**కొడిమ్యాల (మనసులోమాట) జూలై 14:** జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం డబ్బు తిమ్మాయపల్లి గ్రామంలో మంగళవారం వృద్ధుడి హత్య స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. డబ్బు తిమ్మాయపల్లి గ్రామానికి చెందిన కాంపెల్లి హనుమయ్య (70)పై అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తలపై బలంగా దాడి చేసినట్లు సమాచారం. తీవ్ర గాయాల పాలైన హనుమయ్య అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న మల్యాల సీఐతో పాటు స్థానిక ఎస్సై నరేష్ కుమార్ ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. హత్యకు గల కారణాలపై పోలీసులు వివిధ కోణాల్లో విచారణ చేపట్టారు. ప్రాథమిక సమాచారం మేరకు భూ వివాదాల నేపథ్యంలో ఈ ఘటన జరిగినట్లు గ్రామస్థులు చర్చించుకుంటున్నప్పటికీ, దీనిపై అధికారికంగా పోలీసులు ఎలాంటి నిర్ధారణ చేయలేదు. నిందితుడి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.



# ఉద్యోగాల భర్తీకి వెంటనే నోటిఫికేషన్లు విడుదల చేయాలి సీపీఎం



**ఎల్బీనగర్ (మనసులోమాట) జూలై 14:**

నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ ఆరోపించారు. ఖాళీ పోస్టుల భర్తీకి వెంటనే నోటిఫికేషన్లు విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. జూలై 15న హైదరాబాద్ లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే సీపీఎం మహాధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం దిల్‌సుఖ్‌నగర్‌లోని పలు కోచింగ్ సెంటర్లలో కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన యూత్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన రెండేళ్లు గడిచినా జాబ్ క్యాలెండర్ విడుదల చేయక పోవడంతో పాటు రెండు లక్షల ఉద్యోగాల భర్తీ హామీ కూడా నెరవేర్చలేదన్నారు. సమగ్ర జాబ్ క్యాలెండర్ ప్రకటించి వెంటనే ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేయాలని కోరారు. ఉద్యోగాలు కల్పించే వరకు నిరుద్యోగ యువతకు నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతి ఇవ్వాలని, రాజీవ్ యువ వికాస్ పథకం కింద అర్హులైన యువతకు స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పోలీస్ శాఖలో సుమారు 20 వేల ఖాళీలు ఉన్నాయని డీజీపీ ప్రకటించినప్పటికీ కేవలం 7 వేల పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగులను నిరాశకు గురిచేస్తోందన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని, కేంద్ర మంత్రిత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను కూడా వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జూలై 15న ఇందిరాపార్క్ వద్ద జరిగే మహాధర్నాకు నిరుద్యోగ యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చంద్రమోహన్, సరూర్‌నగర్ సర్కిల్ కార్యదర్శి సీహెచ్ వెంకన్న, మల్లెపాక వీరయ్య, జి. మనోహర్, కట్ట శ్రీనివాస్, కె. రాములు, సీహెచ్ మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

# గుర్తుతెలియని మహిళకు అండగా జిల్లా సంక్షేమ శాఖ



- **ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ఆశ్రమానికి సురక్షిత తరలింపు**

**పెద్దపల్లి (మనసులోమాట) జూలై 14:**

పెద్దపల్లి జిల్లా కేంద్ర శివారులో మానసిక ఆరోగ్య సమస్యతో సంచరిస్తూ, భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్న గుర్తుతెలియని మహిళకు జిల్లా సంక్షేమ శాఖ అధికారులు తక్షణ సహాయం అందించి, సురక్షితంగా ఆశ్రమంలో చేర్పించారు. స్థానికుల సమాచారం మేరకు స్పందించిన జిల్లా సంక్షేమ శాఖ అధికారులు, జిల్లా సంక్షేమ అధికారి ఆదేశాలపై ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి శ్రీమతి స్వర్ణలత వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మహిళను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యుల పర్యవేక్షణలో అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. వైద్యుల సూచనల మేరకు మహిళ భద్రత, సంరక్షణ, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఆమెను నల్గొండ జిల్లా చౌటుప్పల్‌లోని 'అమ్మానాన్న' ఆశ్రమంలో సురక్షితంగా చేర్పించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ శాఖ అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, నిరాశ్రయులు, అనాథలు, వృద్ధులు, దివ్యాంగులు లేదా మానసిక ఆరోగ్య సమస్యలతో ఆపదలో ఉన్న వ్యక్తులు ఎవరైనా కనిపించినట్లయితే వెంటనే జిల్లా సంక్షేమ శాఖకు సమాచారం అందించాలని కోరారు. ఇటువంటి వారికి అవసరమైన రక్షణ, వైద్య సహాయం, పునరావాస సేవలు అందించేందుకు శాఖ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలిపారు.

# వంగా మధుసూదన్ రెడ్డి విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న ఎంపీలు ఈటల రాజేందర్ కొండ విశ్వేశ్వర్ రెడ్డి

**ఎల్బీనగర్ (మనసులోమాట) జూలై 14:**

ఎల్బీనగర్ నియోజకవర్గంలోని చంపాపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ దివంగత వంగా మధుసూదన్ రెడ్డి జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి మల్కాజ్గిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్, చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు ఆచార్య, వంగా సిద్ధార్థ రెడ్డిలు హాజరై, ఆయనకు ఘన నివాళులు అర్పించి, విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంగా మధుసూదన్ రెడ్డి ప్రజల అభిమాన నాయకుడని, అభివృద్ధి పనుల కోసం వందల కోట్ల రూపాయల నిధులు తీసుకువచ్చిన సేవాభావి అని కొనియాడారు. అతి చిన్న వయసు లోనే పరిణితి చెందిన నాయకుని లాగా ఎంతో అభివృద్ధి చేశారని కొనియాడారు. ఆధ్యాత్మికత, దాతృత్వం, ప్రజాసేవ పట్ల అంకిత భావం ఆయన ప్రత్యేకతలని పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా కావాలన్న ఆయన కోరిక నెరవేరకుండానే అకాల మరణం చెందడం బాధాకరమన్నారు. ఆయన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని వారు పిలుపునిచ్చారు. వంగా మధుసూదన్ రెడ్డి ఆశయాలను ఆయన కుమారుడు సిద్ధార్థ్ ముందుకు తీసుకెళ్తారని విశ్వాసం వ్యక్తం చేస్తూ, కుటుంబానికి పార్టీ సంపూర్ణ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రజాసేవే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అర్బన్ బిజెపి అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, రూరల్ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, మాజీ అధ్యక్షులు సామ రంగారెడ్డి, మాజీ కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్ రెడ్డి, కొప్పుల నరసింహారెడ్డి, పవన్ కుమార్, చంపాపేట్ డివిజన్ అధ్యక్షులు పోరెడ్డి రవీందర్ రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు లింగాల దశరథ గౌడ్, కళ్లెం రవీందర్ రెడ్డి, దాసరి మల్లేష్, అశోక్ గౌడ్, రవీందర్ గౌడ్, వివిధ కాలనీల అధ్యక్షులు, బిజెపి కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొని, వారికి ఘన నివాళులు అర్పించారు.





# ఏబీవీపీ రాష్ట్ర పిలుపు మేరకు కమాన్‌పూర్‌లో కళాశాలల బంద్

- **ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల విడుదలకు డిమాండ్**

**కమాన్‌పూర్ (మనసులోమాట) జూలై 14:**

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కమాన్‌పూర్ మండలంలో మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల బంద్ నిర్వహించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జంగపల్లి అభి మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సిన సుమారు రూ.11 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిధుల విడుదలలో జాప్యం కారణంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యను కొనసాగించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వెంటనే పెండింగ్ బకాయిలను విడుదల చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు బుర్ర యశ్వంత్, మల్యాల వర్షిత్, జంగపల్లి శివాజీ, మడిశెట్టి అనీష్‌తో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొని బంద్‌ను విజయవంతం చేశారు.

# పోక్సో కేసుల్లో దర్యాప్తు వేగవంతంగా పూర్తిచేయాలి: పోలీస్ కమిషనర్ సునీల్ దత్

**ఖమ్మం (మనసులోమాట) జూలై 14:**



పోక్సో కేసుల్లో దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేసి అభియోగపత్రాన్ని నిర్ణీత గడువులోగా న్యాయస్థానంలో సమర్పించాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పోలీస్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీస్ అధికారుల నేరసమీక్ష సమావేశం పోలీస్ కాన్ఫిరెన్స్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ... నేర విచారణలో నిందితులకు శిక్షల శాతం పెరగడం అత్యంత ముఖ్యమని, దీనికోసం పకడ్బందీ దర్యాప్తు, శాస్త్రీయ ఆధారాల సేకరణ, పోలీసుప్రాసిక్యూషన్ సమన్వయం అవసరమన్నారు. కొత్త చట్టాల ప్రకారం నిర్ణీత గడువులోగా ట్రయల్ పూర్తి చేయాలని, సాక్షులు భయపడకుండా భరోసా కల్పిస్తూ... న్యాయస్థానానికి హాజరయ్యేలా చూడాలన్నారు. ఎన్డీపీఎస్ కేసులో న్యాయస్థానంలో నేరాన్ని రుజువు చేయడానికి ఆయా కేసుల్లో స్వాధీనం చేసుకున్న గంజాయి, మాదకద్రవ్యాల స్వభావం, పరిమాణాన్ని శాస్త్రీయంగా నిర్ధారించే ఫోరెన్సిక్ సైన్స్ లేబరేటరీ నివేదిక ప్రధాన ఆధారమని అన్నారు. అదేవిదంగా జిల్లాలో గంజాయి రవాణా, విక్రయాలను అరికట్టడానికి స్పెషల్ దృష్టి పెట్టాలని, ఈగల్ బృందాలు, టాస్క్ ఫోర్స్, స్థానిక పోలీసుల సమన్వయంతో మూలలను కనిపెట్టాలని అన్నారు.

**రికవరీపై ప్రత్యేక దృష్టి పెట్టాలని...**

వారిపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నిఘా వ్యవస్థను బలోపేతం చేస్తూ నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. చోరీల నివారణకు, దొంగిలించబడిన సొత్తును బాధితులకు తిరిగి అప్పగించడానికి పోలీసులు సాంకేతికతను ఉపయోగిస్తూ రికవరీపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, నిందితుల గుర్తింపు, రికవరీ వేగవంతం చెయాలన్నారు. విచారణలో భాగంగా ప్రతి కేసును సాంకేతిక ఆధారాలు, ఫోరెన్సిక్ సాక్ష్యాలు, డిజిటల్ సాక్ష్యాలను సమర్థవంతంగా వినియోగించి దర్యాప్తు చేపట్టాలని సూచించారు. శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేస్తూ... నేరాలు జరిగిన తరువాత స్పందించడం కంటే..ముందస్తు నివారణ చర్యలు తీసుకోవడమే సమర్థవంతమైన పోలీసింగ్ అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.

**ప్రాణనష్టాన్ని నివారించడానికి...**

శాంతిభద్రతలు,నేరాల ధోరణి, పోలీస్ స్టేషన్ల పనితీరు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ నేరాల నివారణ, మాదక ద్రవ్యాల నిర్మూలన, కమ్యూనిటీ పోలీసింగ్, పోలీసింగ్‌లో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించి అవసరమైన సూచనలు చేశారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే హాట్‌స్పాట్‌లు లేదా బ్లాక్ స్పాట్‌లలో ప్రాణనష్టాన్ని నివారించడానికి రోడ్డు భద్రతా చర్యలు, ఇంజనీరింగ్ మార్పులు, కఠినమైన ట్రాఫిక్ నియంత్రణలు చాలా ముఖ్యమన్నారు.ప్రమాదకర మలుపులు, కూడళ్ల వద్ద స్పష్టమైన సైన్‌బోర్డులు, బ్లింకర్స్, స్పీడ్ బ్రేకర్లు, రంబిల్ స్ట్రిప్స్, గరిష్ఠ వేగపరిమితి సూచికలు పెట్టడం, రాత్రి సమయంలో స్పష్టత కోసం సోలార్ లైట్లు, వీధి దీపాలు మెరుగుపరచడం. గుంతలను పూడ్చడం, జారుడు రోడ్లకు తగిన గుర్తులు వేయడం వంటి చర్యలు సంబంధిత అధికారుల సమన్వయంతో ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ రామానుజం, ఏసీపీలు వసుందర యాదవ్, రమణమూర్తి, తిరుపతి రెడ్డి, సారంగపాణి, ఫణిందర్, నర్సింహారావు, సర్వర్, సత్యనారాయణ, సాంబరాజు పాల్గొన్నారు.

# కల్వచర్లలో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు శ్రీకారం



- **మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం : సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి**

**కమాన్‌పూర్ (మనసులోమాట) జూలై 14:**

రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి గ్రామపంచాయతీ ప్రాధాన్యం ఇస్తోంది. ఇందులో భాగంగా 10వ వార్డులో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించి పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ వరలక్ష్మితో కలిసి గ్రామ సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి మంగళవారం ప్రతిపాదిత ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక అంశాలను పరిశీలించిన అధికారులు, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పనులు చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని సర్పంచ్ తెలిపారు. అదే విధంగా గ్రామంలోని 7వ వార్డు కోమట్లవాడలో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో కొత్త డ్రైనేజీ నిర్మాణ పనులకు కూడా శ్రీకారం చుట్టారు. అసిస్టెంట్ ఇంజనీర్ వరలక్ష్మితో కలిసి డ్రైనేజీ నిర్మాణానికి అనువైన ప్రాంతాలను పరిశీలించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి మాట్లాడుతూ, గ్రామంలో ఎక్కడా మురుగునీరు నిల్వ లేకుండా సమర్థవంతమైన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే తమ లక్ష్యమని అన్నారు. గ్రామాభివృద్ధిలో భాగంగా అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పంచాయతీ రాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ వరలక్ష్మి, గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీధర్, వార్డు సభ్యురాలు చిందం కవిత, వార్డు సభ్యుడు కొట్టే నాగరాజు, గ్రామపంచాయతీ సిబ్బంది, స్థానిక గ్రామస్తులు పాల్గొన్నారు.

# భూ రీ-సర్వే కార్యక్రమానికి ప్రజలు, రైతులు సహకరించాలి: జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

- **జూలై 15 నుంచి మరో ఎనిమిది గ్రామాల్లో భూ రీ-సర్వే ప్రారంభం**

**పెద్దపల్లి (మనసులోమాట) జూలై 14:**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న భూ రీసర్వే కార్యక్రమానికి ప్రజలు, రైతులు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష కోరారు. ఈ మేరకు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన జిల్లాలో కొనసాగుతున్న భూ రీ సర్వే పనుల పురోగతిని వివరించారు. జిల్లాలో తొలి విడతగా ధర్మారం మండలం పైడిచింతలపల్లి, పెద్దపల్లి మండలం నిమ్మన్‌పల్లి, సుల్తానాబాద్ మండలం రెబ్బల్‌దేవ్‌పల్లి, రామగిరి మండలం పన్నూర్, మంథని మండలం మల్లాపల్లి గ్రామాల్లో భూ రీసర్వే కార్యక్రమం ప్రారంభమై కొనసాగుతోందని తెలిపారు. ఆయా గ్రామాల్లో గ్రామ సరిహద్దుల నిర్ధారణ పూర్తికాగా, ప్రస్తుతం గ్రామకంఠం సర్వే పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అలాగే జూలై 15 నుంచి అంతర్గాం మండలం సోమనపల్లి, ఎలిగేడు మండలం లోకపేట, పెద్దపల్లి మండలం రంగంపల్లి, పాలకుర్తి మండలం గూడిపల్లి, శ్రీరాంపూర్ మండలం మంగపేట, ఓడెల మండలం గూడెం, మంథని మండలం అంగుళూరు, ముత్తారం (మంథని) మండలం శుక్రవారంపేట గ్రామాల్లో భూ రీ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఈ గ్రామాల్లో ఇప్పటికే గ్రామసభలు నిర్వహించి, ప్రజలకు కార్యక్రమంపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో రీసర్వే ప్రారంభానికి ముందు గ్రామసభ నిర్వహించి, భూ యజమానులకు కార్యక్రమం ఉద్దేశ్యం, విధివిధానాలను వివరించిన అనంతరమే సర్వే చేపడుతున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. సర్వే అండ్ బౌండరీస్ చట్టం-1923 నిబంధనలకు అనుగుణంగా పూర్తిస్థాయి పారదర్శకతతో ఈ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. భూ రీసర్వే ద్వారా భూముల హద్దులు ఖచ్చితంగా నిర్ధారణ కావడంతో పాటు భూ రికార్డుల నవీకరణ, భూ వివాదాల పరిష్కారానికి ఇది దోహదపడుతుందని కలెక్టర్ వివరించారు. సర్వే సమయంలో భూ యజమానులు తమ భూములకు సంబంధించిన వివరాలను పరిశీలించుకోవడంతో పాటు అవసరమైన పత్రాలతో అందుబాటులో ఉండాలని సూచించారు. భూ రీసర్వే కార్యక్రమం విజయవంతం కావాలంటే సంబంధిత గ్రామాల ప్రజలు, రైతులు గ్రామసభల్లో పాల్గొని అధికారులు, సర్వేయర్లు, లైసెన్స్‌డ్ సర్వేయర్లకు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష విజ్ఞప్తి చేశారు.

# మొక్కజొన్న కొనుగోళ్లలో "సహకార" దోపిడి

ఇల్లెందు (మనసులోమాట) జూలై 14:

రైతులకు అండగా నిలవాల్సిన సహకార సంఘమే కొందరి చేతుల్లో ఆదాయ వనరుగా మారిందన్న ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. మొక్కజొన్న కొనుగోళ్లలో భారీ అక్రమాలు జరిగాయని, రైతులను అనేక రకాలుగా దోచుకుంటూ లక్షలాది రూపాయలు అక్రమంగా సంపాదించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతులకు పూర్తి మద్దతు ధర కల్పించాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, దళారులతో కుమ్మక్కై తక్కువ ధరలకు మొక్కజొన్నను కొనుగోలు చేసి, ప్రభుత్వ ధరకు విక్రయించడం ద్వారా భారీ లాభాలు ఆర్జించారని రైతులు మండిపడుతున్నారు.

**ఆన్‌లైన్ పేరిట ఒక్కో రైతు నుంచి రూ.1,000 వసూళ్లు**

ప్రభుత్వం రైతుల కోసం పూర్తిగా ఉచితంగా అందించే ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను సైతం ఆదాయ మార్గంగా మార్చుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కో రైతు నుంచి రూ.1,000 వరకు వసూలు చేసినట్లు బాధిత రైతులు చెబుతున్నారు. ఆన్‌లైన్ సేవకు ఎలాంటి రుసుము లేకపోయినా, "ఇలా చేయకపోతే కొనుగోలు జరగదు" అంటూ రైతులను భయపెట్టి డబ్బులు వసూలు చేశారని ఆరోపిస్తున్నారు.

**బస్తాలకు సైతం డబ్బులు కటింగ్ చేసి**

ఇక్కడితో ఆగకుండా ప్రతి బస్తాపై వివిధ పేర్లతో పైసలు కట్ చేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో రైతు నుంచి వందల రూపాయలు కోత విధించడం ద్వారా వేలాది బస్తాలపై భారీ మొత్తంలో అక్రమ వసూళ్లు జరిగినట్లు సమాచారం. ఈ కోతలకు ఎలాంటి అధికారిక రసీదులు ఇవ్వలేదని రైతులు చెబుతున్నారు.

**రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు**

మార్కెట్‌లో మంచి ధర ఉన్నప్పటికీ, రైతుల నుంచి క్వింటాలుకు రూ.500 నుంచి రూ.600 వరకు తక్కువ ధరకు మొక్కజొన్న కొనుగోలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. దళారులతో కుమ్మక్కై రైతుల నిర్బంధ పరిస్థితిని ఆసరాగా చేసుకుని తక్కువ ధరకు సరుకును తీసుకుని, అనంతరం ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించి భారీగా లాభాలు గడించారని రైతులు ఆరోపిస్తున్నారు.

**ప్రభుత్వ ధరకు విక్రయించి రూ.లక్షల్లో లాభాలు**

తక్కువ ధరకు కొనుగోలు చేసిన మొక్కజొన్నను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా పూర్తి ధరకు విక్రయించడం వల్ల లక్షలాది రూపాయల అక్రమ లాభాలు వచ్చినట్లు సమాచారం. రైతుల చెమటను కొందరు తమ ఆదాయంగా మార్చుకున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**విక్రయించిన మొక్కజొన్న పైసల్లో సైతం కోత**

మొక్కజొన్న విక్రయించిన తర్వాత కూడా రైతులకు పూర్తిస్థాయి చెల్లింపులు జరగలేదని ఆరోపణలు ఉన్నాయి. "తేమ ఎక్కువగా ఉంది", "గింజలు పాడయ్యాయి", "నాణ్యత తక్కువగా ఉంది" వంటి కారణాలు చూపుతూ ఒక్కో రైతు నుంచి 10 నుంచి 20 కిలోల వరకు తగ్గించి



చెల్లింపులు చేసినట్లు రైతులు చెబుతున్నారు. దీంతో ఇప్పటికే నష్టాల్లో ఉన్న రైతులు మరింత ఆర్థికంగా దెబ్బతిన్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అవినీతి సొమ్ము పంపకాల్లో పలు అధికారుల అసహనం..?**

ఈ మొత్తం వ్యవహారంలో అక్రమంగా వచ్చిన సొమ్ము పంపకాల విషయంలో అంతర్గత విభేదాలు నెలకొన్నాయని, కొందరు అధికారులు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారనే ప్రచారం సాగుతోంది. ఈ పరిణామం వ్యవహారం మరింత వివాదాస్పదంగా మారడానికి కారణమైందని స్థానికంగా చర్చ జరుగుతోంది. అయితే ఈ ఆరోపణలపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ వెలువడలేదు.

**అసహనం వ్యక్తం చేస్తున్న రైతన్నలు**

ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు సరైన ధర రాకపోవడం, కొనుగోలు ప్రక్రియలో అనేక రకాల కోతలు విధించడం, ఆన్‌లైన్ పేరిట డబ్బులు వసూలు చేయడం వంటి ఘటనలతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతుల సంక్షేమం కోసం ఏర్పాటైన సహకార వ్యవస్థే తమను దోచుకుందని పలువురు రైతులు వాపోతున్నారు.

**ఆందోళనకు సిద్ధమవుతున్న రైతులు**

తమకు జరిగిన అన్యాయంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదులు ఇవ్వడంతో పాటు, అవసరమైతే పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టేందుకు కూడా సిద్ధమవుతున్నట్లు సమాచారం. మొత్తం కొనుగోలు ప్రక్రియపై స్వతంత్ర దర్యాప్తు నిర్వహించి, అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# పుష్కరాలతో ధర్మపురి ఆలయాల వైభవాన్ని ప్రపంచానికి చాటుతాం


ధర్మపురి (మనసులోమాట) జూలై 14:

2027 జూలైలో జరగనున్న గోదావరి పుష్కరాల సందర్భంగా ధర్మపురి ఆలయాల చారిత్రక వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పడంతో పాటు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. మంగళవారం ధర్మపురిలో దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్తో కలిసి వివిధ శాఖల అధికారులతో పుష్కరాల ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. బాసర నుంచి భద్రాచలం వరకు ఉన్న ప్రధాన ఆలయాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. పుష్కరాలకు వచ్చే భక్తుల సౌకర్యాల కోసం ప్రభుత్వం రూ.1,000 కోట్లు కేటాయించిందని, ఇందులో భాగంగా ధర్మపురి, కోటిలింగాల క్షేత్రాల అభివృద్ధికి తొలి విడతగా రూ.117 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ధర్మపురిలో శ్రీ ఉగ్ర నరసింహస్వామి దేవాలయ అభివృద్ధితో పాటు వీఐపీ ఘాట్ల నిర్మాణం చేపడతామని, కోటిలింగాల దేవస్థానం అభివృద్ధి, వెల్గటూరు ప్రధాన రహదారి నుంచి కోటిలింగాల వరకు



నాలుగు లైన్ల రహదారి నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే ధర్మపురిలో అమ్మ ఫంక్షన్ హాల్ నుంచి రాజారం రోడ్డు వరకు ప్రత్యేక రహదారి నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. పుష్కరాల ఏర్పాట్ల కోసం ధర్మపురికి మరో రూ.60 కోట్ల అదనపు నిధులు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాలకు ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకొచ్చే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని, బాసర, కాళేశ్వరం, ధర్మపురి, భద్రాచలం వంటి పుణ్యక్షేత్రాలను మాస్టర్ ప్లాన్‌తో అభివృద్ధి చేసి టెంపుల్ సిటీలుగా తీర్చిదిద్దనున్నట్లు పేర్కొన్నారు. ధర్మపురి మాస్టర్ ప్లాన్‌ను కూడా త్వరలో అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావుతో కలిసి ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో పనిచేస్తున్న అర్చకులకు వేతనాల పెంపు ఉత్తర్వులను అందజేశారు. అనంతరం కోటిలింగాల క్షేత్రాన్ని సందర్శించి కోటేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ పుష్కరాల ఏర్పాట్లకు చేపట్టాల్సిన పనులను అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాజాగౌడ్, ఆర్డీవో మధుసూదన్ గౌడ్, తహసీల్దార్ శేఖర్, ఎంపీడీవో కృపాకర్, ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘనభట్ల దినేష్, ఆలయ చైర్మన్ పూదరి రమేష్, ఈవో శ్రీనివాస్, కాంతారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సీపీ చేతుల మీదుగా హుజురాబాద్ పోలీసులకు 'ఉత్తమ సేవా' ప్రశంసా పత్రాలు




హుజురాబాద్ (మనసులోమాట) జూలై 14:

విధుల పట్ల అంకితభావంతో ఉత్తమ సేవలు అందించిన హుజురాబాద్ పోలీసులకు ఉన్నతాధికారుల నుంచి అరుదైన గుర్తింపు లభించింది. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి అందించే **"ఉత్తమ సేవా ప్రశంసా పత్రాలు"** హుజురాబాద్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వరరావు, కానిస్టేబుల్ మహేందర్‌కు ప్రదానం చేశారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ (సీపీ) గౌస్ ఆలం చేతుల మీదుగా వారు ఈ గుడ్ సర్వీస్ సర్టిఫికెట్లను అందుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, విధి నిర్వహణలో కనబరిచిన ప్రతిభ, కర్తవ్యనిర్వహణలో అంకితభావాన్ని గుర్తిస్తూ ఈ ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ గౌస్ ఆలం అవార్డు గ్రహీతలను అభినందిస్తూ, ఇదే నిబద్ధతతో భవిష్యత్తులోనూ ప్రజలకు సేవలందించి పోలీసు శాఖకు మరింత మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. సీపీ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్న హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వరరావు, కానిస్టేబుల్ మహేందర్‌లకు స్థానిక పోలీసు అధికారులు, సహచర సిబ్బంది, ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు అభినందనలు తెలిపారు.

# డిమాండ్లు నెరవేర్చకపోతే ఉద్యమం ఉధృతం చేస్తాం

కామారెడ్డిటౌన్ (మనసులోమాట) జూలై 14:

తపస్ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు టీపీయుఎస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఉద్యోగ ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున ధర్నా చేశారు. వారి ప్రధాన డిమాండ్లు 1. 51% ఫిట్మెంట్‌తో పీఆర్సీ రిపోర్ట్ ప్రకటించాలి. పెండింగ్ 6 డీఏలు, బిల్లులు వెంటనే చెల్లించాలి. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలి. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాలి. ఎస్ఎస్ఏ, కేజీబీవీ, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి. ప్రమోషన్లు, బదిలీలకు ప్రతి ఏటా షెడ్యూల్ విడుదల చేయాలి. 2008 డీఎస్సీ కాంట్రాక్టు ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు భూనేకర్ సంతోష్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, రాష్ట్ర నేతలు రవీంద్రనాథ్ ఆర్య, పుల్లం రాఘవరెడ్డి, మహిళా కార్యదర్శి ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.



# జేపల్లిలో విషాదం..అనారోగ్యంతో విద్యుత్ లైన్ మెన్ మృతి



చారకొండ (మనసులోమాట) జూలై 14:

జేపల్లి గ్రామానికి చెందిన విద్యుత్ లైన్ మెన్ మల్లేపాకుల శ్రీనివాసులు అనారోగ్యంతో చికిత్స పొందుతూ మంగళవారం కన్నుమూశారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. 2006లో ఉద్యోగం పొందిన ఆయన రంగారెడ్డి జిల్లా, ఇర్విన్, వంగూర్, చారకొండ, రాచూరు ప్రాంతంలో 20సంవత్సరాల పాటు ఉత్తమ లైన్ మెన్ ఉద్యోగిగా సేవ లందిస్తూ గ్రామ ప్రజలు, రైతుల మన్ననలను పొందారు. ఆయన చివరిగా వెల్దండ మండల పరిధిలోని రాచూరు గ్రామంలో లైన్మెన్ విధులు నిర్వహిస్తూ ఉత్తమ సేవ లందించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ లోని కేర్ హాస్పిటల్ లో మంగళవారం ఉదయం 8.30 గంటలకు తుదిశ్వాస విడిచారు. శ్రీనివాసులు మృతి వార్తతో జేపల్లి గ్రామంలో విషాదఛాయలు అలు ముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు, సహచర ఉద్యోగులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

**శ్రీనివాసులు ఆకస్మిక మరణం తీవ్రంగా గ్రామస్తుల సంతాపం..**

విద్యుత్ శాఖలో తన కర్తవ్యాన్ని నిబద్ధతతో, నిజాయితీతో నిర్వర్తించిన లైన్ మెన్ శ్రీనివాసులు ఆకస్మిక మరణం మమ్మల్ని తీవ్రంగా కలచివేసిందని పలువురు ఉద్యోగులు, రాజకీయ నాయకు లు, గ్రామ ప్రజలు, యువత, పలువురు ప్రముఖులు కన్నీటి పర్యంతమయ్యారు. ఆయన సేవాభావం, సహోద్యోగుల పట్ల చూపిన ఆప్యాయత, ప్రజల పట్ల ఉన్న అంకిత భావం ఎప్పటికీ మరువలేనిము అని, శ్రీనివాస్ మరణం విద్యుత్ శాఖకే తీరని లోటు, వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని పలువురు సంతాపం ప్రకటించారు.

# ఒడిశా నుంచి గంజాయి తెప్పించి విక్రయాలు.. యువకుడు అరెస్ట్



మేడ్చల్ (మనసులోమాట) జూలై 14:

ఒడిశా నుంచి గంజాయిని తెప్పించి అక్రమంగా విక్రయిస్తున్న ఓ యువకుడిని మేడ్చల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మేడ్చల్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాకు చెందిన అలోక్ సర్కార్(20) ప్రస్తుతం కిస్తాపూర్ నివాసం ఉంటూ ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. తన స్నేహితుడు సోహైల్(22) సహకారంతో ఒడిశా నుంచి 2 కిలోల ఎండు గంజాయిని విక్రయాల కోసం తెప్పించినట్లు విచారణలో వెల్లడైంది. విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించిన పోలీసులు అలోక్ సర్కార్‌ను అదుపులోకి తీసుకుని అతడి వద్ద నుంచి సుమారు రూ.లక్ష రూపాయల విలువైన 2 కిలోల ఎండు గంజాయితో పాటు ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రధాన సహచరుడు సోహైల్ ప్రస్తుతం పరారీలో ఉండగా, అతని కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు మేడ్చల్ సీఐ సత్యనారాయణ వెల్లడించారు.

# చిరుత పులుల మృతి పై అటవీ అధికారుల విచారణ..

ధర్పల్లి (మనసులోమాట) జూలై 14:

ధర్పల్లి, భీంగల్ మండలాల్లోని రెండు చిరుత పులుల మృతి పై అటవీశాఖ అధికారులు దర్యాప్తు వేగవంతం చేశారు. చిరుత పులుల కళేబరాలు ధర్పల్లి మండల కేంద్రంలోని ఓ పాడుబడిన బావిలో లభించడంతో లోతుగా దర్యాప్తు జరుపుతున్నారు. కమ్మర్పల్లి రేంజ్ పరిధిలో చిరుత పులి మృతి పై విచారణలో తీగలాగితే ధర్పల్లిలో డొంక కదిలింది. జంతువులను పట్టేందుకు వల వేసిన వేటగాళ్లకు వలలో చిరుతతో పాటు అడవి పంది చిక్కిందని సమాచారం. రామడుగు అటవీ ప్రాంతంలో కొందరు వేటగాళ్లు వల వేయడంతో చిరుత పులి, అడవి పంది వలలో చిక్కింది. చిరుతను చంపేసి దాని గోర్లు, దంతాలు, చర్మంను ఉంచుకొని దానికలేబరాన్ని తమ్మలోడి బాగులో ఓ పాడుబడిన బావిలో పడేశారు. పులిచర్మంను సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో మరొక పాడుబడిన బావిలో పడేసినట్లు నిందితులు వివరించినట్లు తెలిసింది. చిరుత పులిని చంపి కళేబరాన్ని పడేసిన ధర్పల్లికి చెందిన ముగ్గురు ఎరుకల కులానికి చెందిన వారని తెలిసింది. చిన్నా చితక వ్యాపారాలు చేసుకోవడానికి వచ్చి మాల గుట్ట పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్నట్లు సమాచారం. రెండు రోజుల క్రితం ఈ ముగ్గురు నిందితులను అటవీ అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మరొక నిందితుడు రామారెడ్డికి చెందిన వ్యక్తిగా అటవీ అధికారులు గుర్తించారు. నిందితుడి కోసం వెతకగా పరారీలో ఉన్నట్లు తెలిసింది. నిందితులు అడవి పందిని అమ్ముకున్నట్లు తెలిసింది. చిరుత పులిని చంపి మూడు నెలలు గడిచినా అటవీ అధికారులు గుర్తించకపోవడం నిర్లక్ష్యంను తెలియజేస్తుంది. కమ్మర్పల్లి రేంజి పరిధిలోని ఓ చిరుతను చంపి పూడ్చివేసిన ఘటన పై విచారణ జరుపుతుండగా మరొక సంఘటన ధర్పల్లిలో చిరుత మృతి బయటపడడం అటవీ అధికారులను ఆశ్చర్యానికి గురిచేసింది. ధర్పల్లి మండలంలో అడవి పందులు, జింకలు, మనుబోతులు, కుందేళ్ళు, వంటి జీవరాసులకు ఉచ్చులు వేసి చంపుతున్నారు. వీటి మాంసానికి బాగా గిరాకి ఎక్కువగా ఉండటంతో గ్రామంలో నడిబొడ్డున అమ్ముతున్న అటవీ అధికారులు చూసి చూడనట్టు వ్యవహరించడం, అప్పటికప్పుడు స్మగ్లర్ వద్ద డబ్బులు నొక్కేయడం, లేదంటే కేసులు చేస్తామని బెదిరించడం వంటి అవినీతి సంఘటనలతో వన్యమృగాల వేట యదేచ్ఛగా సాగుతుంది. నిందితులను పట్టుకొని విచారించగా పులి మృతి కేసు పై క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. సంఘటన ఎలా జరిగిందో నిందితులు చెప్పిన విషయాలను బట్టి అటవీ అధికారులు జాగిలాలతో విచారణ జరిపారు. చిరుత పులి ఎక్కడ వలవేసి పట్టుకున్నారో ఎలా చంపారు ఎక్కడ పడేశారు అనే విషయం పై ఇందల్ వాయి రేంజి ఆఫీసర్ రవి మహేష్ బట్ అటవీ సిబ్బందితో క్షేత్రస్థాయిలో పరిశీలించి పాడుబడిన బావుల చుట్టూ రిబ్బన్ చుట్టి గుర్తులు పెట్టారు. వివరాలు వెల్లడించడానికి ఆయన నిరాకరించారు. పూర్తి విచారణ తర్వాత వివరాలు వెల్లడిస్తామని ఆయన తెలిపారు.



# ప్రభుత్వ ఉపాధ్యాయులు పాఠాల కంటే.. పక్క వ్యాపారాలకే పెద్దపీట?

ఖమ్మం (మనసులోమాట) జూలై 14:

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి, వారి భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయులు పాఠశాల బాధ్యతల కంటే పక్క వ్యాపారాలపై ఎక్కువ ఆసక్తి చూపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా రియల్ ఎస్టేట్, జీవిత బీమా పాలసీలు, చిట్‌ఫండ్లు, పెట్టుబడి పథకాలు, ఇతర ప్రైవేట్ వ్యాపారాల్లో కొందరు ఉపాధ్యాయులు చురుకుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు స్థానికంగా చర్చకు దారితీశాయి. ప్రభుత్వం ఉపాధ్యాయుల వ్యాపారం ఖమ్మం రూరల్ మండలం తో పాటు ఏదులాపురం మున్సిపాలిటీ పాలేరు నియోజకవర్గం లోని మిగతా మూడు మండలాల్లో కూడా విరీ వ్యాపారం బాగా విస్తరించి ఉందని ఆరోపణలు సైతం బలంగా ఉన్నాయి. ఏ వ్యాపారం ప్రారంభించాలన్న ఉపాధ్యాయులను సంప్రదిస్తే అది 100% సక్సెస్ ఫుల్ గా విజయవంతం అవుతుందని ప్రైవేట్ వ్యాపార వర్గాల చర్చ. జపాన్ దేశానికి చెందిన ఒక వాటర్ డివైస్ " కంగాన్ " అనే పేరుతో మార్కెట్లోకి వచ్చిన ఆ డివైస్ను విస్తృతంగా వ్యాపారం చేసింది కూడా ఉపాధ్యాయులే, దీనిపై కమిషన్ కూడా భారీ స్థాయిలో ఉపాధ్యాయులకు వస్తుండడంతో తోటి ఉపాధ్యాయులతో పాటు ఇతర ప్రముఖులతోనూ కొనిచ్చే పంతుళ్లు పనిలో నిమగ్నమయ్యారు. గ్రామాల్లో ప్రజలను కలిసే అవకాశాన్ని ఉపయోగించుకుని కొందరు ఉపాధ్యాయులు స్థలాల కొనుగోలు-అమ్మకాలకు మధ్యవర్తిత్వం చేయడం, బీమా పాలసీల కోసం ప్రచారం చేయడం, సెలవు రోజుల్లోనే కాకుండా విధి సమయాల్లో కూడా వ్యక్తిగత వ్యాపారాలకు ప్రాధాన్యం ఇస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీంతో విద్యార్థుల బోధనపై ప్రభావం పడుతోందని పలువురు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



**పాఠశాలలపై ప్రభావం?**

ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోవడం, తరగతులకు ఆలస్యంగా హాజరు కావడం, విద్యార్థుల సందేహాల నివృత్తికి తగిన సమయం కేటాయించకపోవడం వంటి అంశాలు కొన్ని చోట్ల వినిపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తుంటే, కొందరు ఉపాధ్యాయుల నిర్లక్ష్య వైఖరి వల్ల ప్రభుత్వ విద్యపై ప్రజల్లో నమ్మకం దెబ్బతింటోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**సేవా ధర్మం మరిచిపోతున్నారా?**

ఉపాధ్యాయ వృత్తి సమాజంలో అత్యంత గౌరవనీయమైనది. విద్యార్థులకు విజ్ఞానం మాత్రమే కాకుండా విలువలు, క్రమశిక్షణ, బాధ్యతలను నేర్పాల్సిన గురువులే వ్యక్తిగత లాభాల కోసం ఇతర వ్యాపారాల్లో నిమగ్నమవడం సమాజానికి మంచి సంకేతం కాదని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

**నిబంధనలు ఏమంటున్నాయి?**

ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వ సేవా నియమావళికి లోబడి ఉండాలి. ప్రభుత్వ అనుమతి లేకుండా ప్రైవేట్ వ్యాపారాలు నిర్వహించడం లేదా వ్యక్తిగత లాభాపేక్షతో వాణిజ్య కార్యకలాపాల్లో పాల్గొనడం సేవా నియమాలకు విరుద్ధమయ్యే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. అలాంటి ఆరోపణలు ఉంటే సంబంధిత అధికారులు విచారణ జరిపి వాస్తవాలు నిర్ధారించాల్సిన బాధ్యత ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**పర్యవేక్షణ ఎక్కడ?**

పాఠశాలలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాల్సిన ఉన్నతాధికారులు ఈ అంశంపై దృష్టి సారించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఫిర్యాదులు వచ్చినా సమగ్ర విచారణ జరగడం లేదని, దీంతో కొందరు నిర్భయంగా పక్క వ్యాపారాలు కొనసాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**తల్లిదండ్రుల డిమాండ్**

ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్న ఈ సమయంలో, విధి నిర్వహణను నిర్లక్ష్యం చేసి ఇతర వ్యాపారాల్లో నిమగ్నమయ్యే ఉపాధ్యాయులపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, ప్రజా సంఘాలు కోరుతున్నాయి. విద్యార్థుల చదువుకు ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రభుత్వ యంత్రాంగం కఠిన పర్యవేక్షణ చేపట్టాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

## హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు..



**ఖమ్మం (మనసులోమాట) జూలై 14:**

హత్య కేసులో వరంగల్ జిల్లా, ధర్మసాగర్ మండలం, పెద్ద పెండ్యాల గ్రామానికి చెందిన రాప్రోలు వెంకటేశ్వర్లు @ రాజు(32)కు జీవిత ఖైదు, 10 వేలరూపాయలు జరిమానా విధిస్తూ నాలుగోవ అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు గౌరవ న్యాయమూర్తి డా. జి.వి. మహేష్ నాథ్ తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. 2021 ఫిబ్రవరి 13 న రాత్రి సమయంలో ఖమ్మం నగరంలో వినోద్ థియేటర్ వద్ద ఓ వివాహితతో మాట్లాడుతున్న శీలం వెంకటేష్ అనే వ్యక్తిపై రాప్రోలు వెంకటేశ్వర్లు అనే వ్యక్తి పాత కక్ష పెంచుకొని హత్య చేసేందుకు కత్తితో పొడిచి పారిపోయాడు. బాధితుడి బంధువు అయిన ఇచ్చిన ఫిర్యాదుతో ఖమ్మం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు పూర్తి చేసి అభియోగ పత్రాన్ని న్యాయం స్థానంలో సమర్పించగా.. వాదోపవాదనలు విన్న న్యాయమూర్తిపై విధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్‌కు సహకరించిన పోలీసు అధికారులకు, ఇన్వెస్టిగేషన్ అధికారులు ఇన్స్పెక్టర్ చిట్టిబాబు, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి. స్వప్న, కోర్టు కానిస్టేబుల్ యం. రామకృష్ణ, కోర్టు లైజన్ ఎస్సై శ్రీకాంత్, హోంగార్డ్ శ్రీనివాస్ ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.

# రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు కేరళ మోడల్ హై స్కూల్ విద్యార్థుల ఎంపిక

**పెద్దపల్లి (మనసులోమాట) జూలై 14:**

పెద్దపల్లి అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సుల్తానాబాద్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో కేరళ మోడల్ హై స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. అండర్-16 బాలబాలికల విభాగంలో నిర్వహించిన ఒక కిలోమీటర్ పరుగుపందెంలో కె. యశ్వంత్, ఎ. వైశాలి ద్వితీయ స్థానం సాధించారు. అదే విభాగంలో రెండు కిలోమీటర్ల పరుగుపందెం లో టి. సాయి విష్ణు, పి. ఆరాధ్య రెండో స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో నిర్వహించిన 600 మీటర్ల పరుగుపందెంలో కె. వినూత్న ప్రథమ స్థానం సాధించగా, జి. చరిత ద్వితీయ స్థానం దక్కించుకొని రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ నెల 18వ తేదీన మెదక్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఎంపికైన విద్యార్థులు జిల్లా తరఫున పాల్గొననున్నట్లు పెద్దపల్లి అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కె. గట్టయ్య తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను కేరళ మోడల్ హై స్కూల్ ప్రిన్సిపాల్ సిజ్జు ఎస్. నాయర్, వైస్ ప్రిన్సిపాల్ స్మిత ఎస్. నాయర్, ఉపాధ్యాయులు రాజయ్య, కిరణ్, పీటీ ఉపాధ్యాయులు అజయ్, రాజుతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్రస్థాయిలోనూ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.



# ప్రచారయాత్రనా.. దండయాత్రనా...



**కొత్తగూడెం (మనసులోమాట) జూలై 14:**

శాసనసభ ఎన్నికల ఫలితాల తర్వాత మరోసారి కొత్తగూడెం నియోజకవర్గం వార్తల్లోకి ఎక్కింది. ఆనాడు కాంగ్రెస్ సీపీఐ పొత్తులో అ భాగంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుకు టిక్కెట్ కేటాయించడం భారీ మెజారిటీతో గెలవడం జరిగిపోయింది. అప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగూడెం నియోజకవర్గం గురించి చర్చ జరిగింది. మళ్ళీ రెండున్నర సంవత్సరాల తర్వాత కొత్తగూడెం ప్రాంతం గురించి చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఈ నియోజకవర్గానికి ఎటువంటి ఎన్నికలు లేవు. కానీ రాజకీయపార్టీలు మాత్రం ప్రచారంతో హోరెత్తిస్తున్నాయి. ఒకరి తర్వాత ఒకరు వారం రోజుల వ్యవధిలోనే పార్టీల అగ్రనాయకులు, కేంద్రమంత్రి, రాష్ట్ర మంత్రి, ఎంపీలు, మాజీ మంత్రులు భద్రాద్రికొత్తగూడెం జిల్లా కేంద్రంలో పర్యటించి తమ పార్టీలు చేస్తున్న, చేసిన అభివృద్ధి, సంక్షేమంపై చెబుతూ పట్టును నిలుపుకునేందుకు ప్రయత్నాలను చేస్తున్నారు.

**సింగరేణి అంశమే ప్రధాన ఎజెండా**

కేంద్ర, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్, నూతనంగా ఆవిర్భవించిన తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) సింగరేణి అంశమే ప్రధాన ఎజెండాగా పెట్టుకొని ముందుకుపోతున్నారు. తొలుత బీఆర్ఎస్ శాసనసభ పక్ష ఉపనేత, మాజీ మంత్రి హరీష్ రావు కొత్తగూడెం లో సింగరేణి కార్మికులతో ఆత్మీయ సమ్మేళనం' పేరిట సింగరేణిలో జరుగుతున్న అవినీతిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. లేనిబొగ్గును ఉన్నట్లు చూపెడుతున్నట్లు, సంస్థను దివాళ తీసేలా, నష్టం చేకూర్చేలా వ్యవహరిస్తున్నారని చెబుతూ తాము సంస్థకు, కార్మికులకు ఏ విధంగా లబ్ది చేకూర్చామో వివరించి ఓటు బ్యాంకును పదిలపరుచుకునే ప్రయత్నం చేశారు. ఇక ఆ తర్వాత ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకులు బీఆర్ఎస్ చేస్తున్న విష ప్రచారాన్ని తీవ్రంగా ఖండించి తాము సింగరేణి సంస్థ కోసం ఏం చేస్తున్నామో చెప్పారు.

**సందట్లో సడేమియాలా 'జనసేన' ఎంట్రీ**

బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, టీఆర్ఎస్ పార్టీలు తమ ఉనికిని కాపాడుకునేందుకు, ఓటు బ్యాంకును సుస్థిరం చేసుకునేందుకు పావులు కదుపుతుంటే సందట్లో సడేమియాలాగా ''జనసేన' పార్టీ అగ్రనాయకులు కొత్తగూడెంలో ఎంట్రీ ఇచ్చారు. ఇటీవల పార్టీలో చేరిన మాజీ హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు జిల్లా కేంద్రంలో తొలిసారి పర్యటించి భారీ ర్యాలీ నిర్వహించి, పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. రానున్న ఎన్నికల్లో కొత్తగూడెం నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానని చెప్పకనే చెప్పాడు. పార్టీ కార్యాలయాన్ని అట్టహాసంగా ప్రారంభించడంతో పాటు గతంలో తాను జీవీఎస్ఆర్ ట్రస్టు ద్వారా చేసిన సేవలను సమావేశంలో వివరించి తనకు క్యాడర్ ఉందని అగ్రనాయకుల ముందు సెలవిచ్చాడు.

**మంత్రి వివేక్ ప్రచారం...**

రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పనశాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి కొత్తగూడెం, భద్రాచలం ప్రాంతాలలో పర్యటించి తన సామాజికవర్గ నాయకులతో సమావేశవడం, అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం, పార్టీ చేస్తున్న కార్యక్రమాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కోసం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమపథకాలను వివరించే ప్రయత్నం చేశారు. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తలను, నాయకుల ను కొంతమేర ఉత్సాహపరిచే కార్యక్రమాన్ని మంత్రి చేపట్టారు. ఇలా అన్నీ పార్టీల నాయకులు రెండువారాల వ్యవధిలోనే కొత్తగూడెం కేంద్రంగా చేసుకొని పర్యటించి వార్తల్లో ఉండేలా చేశారు.

**అభివృద్ధి, పార్టీ బలోపేతంపై దృష్టి సారించిన ఎమ్మెల్యే**

కొత్తగూడెం నియోజకవర్గ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పార్టీల నాయకుల ప్రచారాలను, యాత్రలను ఏమాత్రం పట్టించుకున్నట్లుగా కనిపించడంలేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు పనిచేసుకుంటూ పోవడమే మన ముందున్న కర్తవ్యంగా సాగుతున్నట్లుగా కనిపిస్తోంది. అందుకే ఇటీవల సమావేశాల పేరిట బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, టీఆర్ఎస్, జనసేన నాయకులు భారీ కటౌట్లు, ర్యాలీలు, ప్రదర్శనల పేరిట హంగూ ఆర్భాటం చేసిన, ఎంతోమంది నాయకులు కొత్తగూడెం పర్యటనకు వచ్చినా ఎమ్మెల్యే వీటిని ఖతారు చేయకుండా నియోజకవర్గ అభివృద్ధితో పాటు, సీపీఐ కార్యకర్తల శిక్షణ తరగతులను నిర్వహించారు. ఒకవైపు అభివృద్ధి, సంక్షేమం, మరోవైపు పార్టీ బలోపేతంపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

**ప్రచారయాత్రనా.. దండయాత్రనా...**

కేంద్రమంత్రి, రాష్ట్ర మంత్రి, ఎమ్మెల్యేలు, ఎంపీలు కేవలం కొత్తగూడెం జిల్లా కేంద్రంలో పర్యటిస్తూ ఎన్నికల వాతావరణాన్ని మరిపించేలా ప్రచారాస్త్రాలు, విమర్శనాస్త్రాలు సంధించుకున్నారు. పార్టీల కార్యక్రమాల పేరు భరోసా యాత్ర, ఆత్మీయ సమ్మేళనం, బాయిబాట ఏదైనా కానీ మొత్తానికి ఈ కొత్తగూడెం గడ్డపై ఒకరి తర్వాత ఒకరు యాత్రలు, సమ్మేళనాల పేరిట ఒక మాదిరిగా దండయాత్ర చేసినట్లుగానే ఉందంటూ సగటు ప్రజానీకం అభిప్రాయపడుతున్నారు. భవిష్యత్ లో జరగబోయే ఎన్నికలకు ఇప్పటి నుంచే పార్టీలు తమ పట్టును నిలుపుకునేందుకు, క్యాడర్ ను పెంచుకునేందుకు అవసరమైన అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకునేందుకు ఇది ఒక ట్రయల్ గా ఉపయోగించుకుంటున్నట్లుగా కార్యకర్తలు చెబుతున్నారు. కొత్తగూడెం అంటేనే రాష్ట్రంలోనే ఒక ప్రత్యేకత సంతరించుకున్నదని చెప్పవచ్చు.

**మొత్తంగా కొత్తగూడెం నియోజకవర్గం సీటును..**

చాలా రాజకీయ చైతన్యవంతమైన నియోజకవర్గంగా దీనికి పేరుంది. అందుకే కాబోలు తెలంగాణ ఏర్పాట్లాక ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆనాడు రెండుసార్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీకి ఒక్క కొత్తగూడెం, ఖమ్మంలో ఒక్కొక్క సీటుకు పరిమితం చేయగా, ప్రస్తుతం రాష్ట్రంలోనే పోటీ చేసి, గెలిచిన ఏకైక కమ్యూనిస్టు ఎమ్మెల్యే ఉన్న నియోజకవర్గంగా కొత్తగూడెంను చెప్పుకోవచ్చు. మొత్తంగా కొత్తగూడెం నియోజకవర్గం సీటును సుస్థిరం చేసుకునేందుకు, పాగా వేసేందుకు రాజకీయపార్టీల నాయకులు ఇప్పటి నుంచే పావులు కదపడంలో బహుశా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని పార్టీ అభిమానులు, కార్యకర్తలు చెబుతున్నారు. పార్టీల అగ్రనాయకులు ప్రచారం చేసిన, దండయాత్ర చేసిన, భరోసా ఇచ్చిన, ఆత్మీయత చూపించిన సరే ఎవరికి లొంగము, అభివృద్ధి విషయంలో రాజీ పడతమేమో కానీ ఆత్మగౌరవం పై దెబ్బ కొడితే మాత్రం సహించమని మొదటినుంచి చెబుతూ వస్తున్నారు. అందుకే కొత్తగూడెం ఓటర్ ఎంతైనా డిఫరెంట్ అని చెప్పక తప్పదు.

# మొరాయించిన సర్వర్.. నిలిచిన రేషన్ బియ్యం పంపిణీ

**నిర్మల్ పట్టణం (మనసులో మాట) జూలై 14:**

వేసవి తీవ్రత దృష్ట్యా ఏప్రిల్, మే, జూన్ మాసాలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఏప్రిల్‌లోనే పంపిణీ చేశారు. జులైలో మళ్లీ పంపిణీ మొదలైంది. మొదటి వారంలో జనాలు ఎక్కువగా ఉంటారు. కాస్త ఆలస్యంగా తీసుకుందామని చాలామంది భావించారు. దీనికి తోడు రెండో శనివారం, ఆదివారం సెలవుదినాలుగా ఉంటాయనుకున్నారు. సోమవారం రేషన్ దుకాణాలకు వెళ్లి బియ్యం తెచ్చుకుందామనుకున్నారు. కానీ, వీలుపడలేదు. వెళ్లినవారు వెళ్లినట్లుగా తిరిగి రావాల్సిన పరిస్థితి. కారణం.. సర్వర్ పనిచేయకపోవడమే.

**ఉదయం నుంచి..**

ప్రస్తుతం రేషన్ బియ్యం పంపిణీ ఎలక్ట్రానిక్ పీఓఎస్ (పాయింట్ ఆఫ్ సేల్) పరికరాల ద్వారా జరుగుతోంది. లబ్ధిదారులు తమ రేషన్‌కార్డు నంబరు ఆధారంగా ఆధార్‌తో అనుసంధానించిన వేలిముద్రలు, ఐరిష్ స్కాన్‌ను ఉపయోగించి ఈ పరికరాల్లో తమ గుర్తింపును ధ్రువీకరిస్తారు. ప్రభుత్వ డేటాబేస్ నుంచి కుటుంబ సభ్యుల వివరాలను ధ్రువీకరించుకొని, పంపిణీ చేసిన వస్తువుల ఖచ్చితమైన పరిమాణాన్ని అక్కడ నమోదు చేస్తారు. దీనివల్ల నకిలీ రేషన్ కార్డుల నివారణకు, ఆహార ధాన్యాల దారి మళ్లింపును నిరోధించేందుకు మార్గం సుగమమైంది.ఆధునిక విధానంలో చేపట్టిన ఈ పంపిణీ ప్రక్రియ కొన్నేళ్లుగా సజావుగా సాగుతోంది. గతంలో ఎన్నడూ లేనిరీతిలో తొలిసారిగా సర్వర్ మొరాయింపు చోటుచేసుకుంది. ఉదయం 9.04 గంటల నుంచి ఈ పాస్ యంత్రాలు పనిచేయలేదు. ఆధార్‌తో అనుసంధానమైన సర్వర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతోనే ఈ పరిస్థితి నెలకొందని రేషన్ డీలర్లు చెబుతున్నారు. ఆదివారం రోజున కూడా ఇదే తరహా సమస్య తలెత్తిందని, దీనివల్ల పంపిణీకి ఇబ్బంది ఏర్పడిందన్నారు.సాయంత్రం వరకు సమస్య పరిష్కారం కాక బియ్యం పంపిణీ చేపట్టలేకపోయారు. ప్రతినెలా 15వ తేదీలోపు బియ్యం పంపిణీ ప్రక్రియ పూర్తిచేయాల్సి ఉంటుంది. సర్వర్ మొరాయింపుతో రెండు రోజులుగా ఇబ్బందులు ఏర్పడటంతో లబ్ధిదారులు చాలామంది బియ్యం పొందలేకపోయారు. గడువు ముగింపునకు రెండురోజులే ఉండటంతో, అందరికీ అందుతాయా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వం గడువు తేదీ పెంచితే ఇబ్బంది దూరమవుతుందని చెబుతున్నారు.




**జిల్లాలో ఇలా..**

మండలాలు : 19
రేషన్ దుకాణాలు : 412
లబ్ధిదారులు : 2,47,831.

## విద్యార్థులను అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలి



**ఆదిలాబాద్ క్రీడావిభాగం (మనసులో మాట) జూలై 14:**

పాఠశాల విద్యార్థులను అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని జిల్లా యువజన క్రీడల అధికారి దయానంద రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని క్రీడా ప్రాధికారిక సంస్థ కార్యాలయంలో క్రీడా పాఠశాల శిక్షకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోనే ఆదిలాబాద్ క్రీడా పాఠశాలను క్రీడాపోటీల్లో అగ్రగామిగా నిలపాలని సూచించారు. క్రీడా పరికరాలు అవసరం ఉన్నవారు ఇండెంట్ పంపాలని తెలిపారు. ఈ సమావేశంలో జూడో, బాక్సింగ్, అథ్లెటిక్స్, స్విమ్మింగ్, షటిల్, బ్యాడ్మింటన్ శిక్షకులు పాల్గొన్నారు.

## అక్కడ ముందుకు.. ఇక్కడ యథాతథం



**మెట్‌పల్లి (మనసులో మాట) జూలై 14:**

ఆర్మూర్‌జగిత్యాలమంచిర్యాల 63వ జాతీయ రహదారిని విస్తరించే ప్రక్రియకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 131.894 కిలోమీటర్ల మేర జాతీయ రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించాలని నిర్ణయించారు. రోడ్డు పనులు ప్రారంభించడానికి కావాల్సిన భూసేకరణకు గతంలోనే నోటిఫికేషన్ ఇచ్చారు. కోరుట్ల, జగిత్యాల డివిజన్లలో భూసేకరణ ప్రక్రియ జరుగుతుండగా.. మెట్‌పల్లి డివిజన్‌లో మాత్రం హైకోర్టు స్టేతో ముందుకు సాగడం లేదు.జిల్లాలో 69.300 కిలోమీటర్లు రహదారి విస్తరించనున్నారు. ఈ మార్గంలో మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి వంటి పట్టణాలుండటంతో వాహనాల రద్దీ అధికంగా ఉంటోంది. ఈ సమస్య అధిగమించడానికి పలు ప్రాంతాల్లో బైపాస్ రహదారుల నిర్మాణానికి ప్రతిపాదించారు. మెట్‌పల్లి శివారు నుంచి కోరుట్ల శివారు గ్రామాల మీదుగా సుమారు 17 కిలోమీటర్ల మేర బైపాస్ రహదారి కోసం ప్రతిపాదనలు పంపారు. ఆ తర్వాత 15 కిమీల రోడ్డు విస్తరణ అనంతరం 11 కిమీలు బైపాస్ నిర్మించనున్నారు.

## అంతా ఏకమయ్యారు.. అందినంత దండుకుంటున్నారు



- **అధికారుల అండతో ఇసుక అక్రమ రవాణా**

**శంకరపట్నం, చిగురుమామిడి, (మనసులో మాట) జూలై 14:**

జిల్లాలోని శంకరపట్నం, చిగురుమామిడి మండలాల్లో ఉన్న వాగులు, చెక్‌డ్యాం ప్రాంతాల్లోని ఇసుకను పెద్దఎత్తున అక్రమంగా తరలిస్తున్నారు. పగలు నిల్వల చేస్తూ, రాత్రి వేళల్లో ట్రాక్టర్లలో రవాణా చేస్తున్నారు. కేశవపట్నం, గద్దపాక, తాడికల్, మక్త, ఎరడపల్లి, అర్కండ్ల, ముత్తారంతోపాటు పలు గ్రామాల్లో ఈ అక్రమ వ్యాపారం చేస్తూ అందినంత సొమ్ము చేసుకుంటున్నారు. అడుగంటిన వాగులు, వంతెనల ప్రాంతాల్లో ఇసుక కనిపిస్తే చాలు.. ఇసుకాసురులు కుప్పలుగా మలుచుకొంటున్నారు. ఇంత జరుగుతున్నా.. పోలీస్, రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

**నిల్వలు కనిపిస్తున్నా పట్టదా!**

ఇళ్లు, ఇతర నిర్మాణాలు పెరిగిపోవడంతో అక్రమ ఇసుక వ్యాపారాన్ని రెట్టింపు చేసుకొని ముందుకు సాగుతున్నారు. దీనిని నియంత్రించాల్సిన అధికారులు సహకరిస్తున్నారని ఆరోపణలున్నాయి. గ్రామాల్లో ఆ శాఖల అధికారులు సందర్శనలకు వెళ్లినప్పుడు వాగుల్లో ఇసుక నిల్వలు కనిపిస్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

**ఒకే ఓటీపీతో అదనంగా..**

చిగురుమామిడి మండలం రామంచ గ్రామ వాగు ఇసుకకు మాత్రమే మైనింగ్ శాఖ అనుమతి ఉండగా.. ఆ శాఖకు సంబంధించిన ఒక అధికారి ఓటీపీ వచ్చిన క్రమంగా ట్రాక్టర్‌తో ఇసుక తరలించేందుకు అనుమతి ఇస్తున్నారు. మీసేవ కేంద్రంలో ఇసుక అవసరం ఉన్నవారు స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. స్లాట్ బుక్ అయిన తర్వాత ఓటీపీ నంబరు వస్తుంది. అయితే ఒకే నంబరుతో అదనంగా ఇసుకను ట్రాక్టర్ యజమానులు గ్రామాల దూరాన్ని బట్టి ధర నిర్ణయించి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రాత్రి వేళల్లో అయితే దీనికి హద్దే లేకుండా పోతుంది. ఇందుర్తి వాగు నుంచి ఎలాంటి అనుమతి లేకున్నా తరలిస్తున్నారు.

**పోలీసులు ఉంటే సమాచారం**

చిగురుమామిడి వైపు వెళ్లే ఇసుక ట్రాక్టర్ ముందు ఒకరు ద్విచక్ర వాహనంపై వెళతారు. మరొకరు చిన ముల్కనూర్ గ్రామంలో ఉంటాడు. పోలీసులు రామంచ వైపు వెళితే వెంటనే డ్రైవర్‌కు ఫోన్ చేసి సమాచారం అందిస్తారు. వెంటనే దారి మళ్లించి పోలీసుల కంట పడకుండా వెళతారు. మరొకరు చిగురుమామిడి ఠాణా సమీపంలో ఉంటూ.. పోలీసులు ఎటువైపు వెళ్తున్నారని గమనించి సమాచారం ఇస్తారు. ఎవరికి ఇసుక అవసరం ఉందో వారి ఇంటికి చేర్చుతారు.

# 60 వేల కేసుల పరిష్కారం పై కిషోర్ మక్వానా

**సికింద్రాబాద్ (మనసులో మాట) జూలై 14:**
గత రెండేళ్లలో రికార్డు స్థాయిలో 60 వేలకుపైగా కేసులను పరిష్కరించి జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్ (ఎన్‌సీఎస్‌సీ) చరిత్ర సృష్టించిందని కమిషన్ ఛైర్మన్ కిషోర్ మక్వానా తెలిపారు. హైదరాబాద్ కవాడిగూడలోని సీజీవో టవర్స్‌లో ఆధునికీకరించిన ఎన్‌సీఎస్‌సీ రాష్ట్ర కార్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలు, రాజ్యాంగంలోని 338వ అధికరణకు అనుగుణంగా అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణకు కమిషన్ కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు. ప్రతి ఫిర్యాదుదారుడికి సకాలంలో న్యాయం అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ మాట్లాడుతూ.. బాధితులకు న్యాయం చేయడంలో కమిషన్‌కు సమన్లు, నోటీసులు జారీ చేసే పూర్తి చట్టపరమైన అధికారాలు



ఉన్నాయని తెలిపారు. ఎస్సీ పారిశ్రామికవేత్తల అభివృద్ధికి విధాన రూపకర్తలు తగిన ప్రాధాన్యతనివ్వాలని కోరారు. కమిషన్ కార్యదర్శి గుడే శ్రీనివాస్ మాట్లాడుతూ, డిజిటల్ సాంకేతికతతో ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యాన్ని తగ్గిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయ డైరెక్టర్ డాక్టర్ జీ. సునీల్ కుమార్ బాబు మాట్లాడుతూ, 20242026 మధ్య 10,853 ఫిర్యాదులను పరిష్కరించి, అట్రాసిటీ నిరోధక చట్టం కింద బాధితులకు రూ.33.80 కోట్ల నష్ట పరిహారం అందించినట్లు తెలిపారు. అలాగే 177 సుమోటో కేసులు నమోదు చేసి, 127 చట్టబద్ధ విచారణలు నిర్వహించినట్లు వెల్లడించారు.

# రేవంత్, ఉత్తమ్‌లకు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సవాల్

**కాళేశ్వరం (మనసులో మాట) జూలై 14:**
కాళేశ్వరం ప్రాజెక్టు చుట్టూ అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య మాటల యుద్ధం మరింత ముదిరింది. పరస్పర విమర్శలతో రాష్ట్ర రాజకీయం అమాంతం వేడెక్కుతున్న తరుణంలో.. సీఎం రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు.

**బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సవాల్:**
ఎల్ నినో ఎఫెక్ట్ రైతులపై ఉండకుండా ఉండేందుకు కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి నీటిని వెంటనే ఎత్తిపోయాలని డిమాండ్ చేశారు.ఈ ప్రక్రియలో అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు ఏ చిన్న సమస్య వచ్చినా దానికి పూర్తి బాధ్యత బీఆర్ఎస్ ఎమ్మెల్యేలదే అని తెలిపారు. ఒకవేళ ఏదైనా సమస్య తలెత్తితే.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలమంతా తమ పదవులకు రాజీనామా చేస్తామని అన్నారు. అంతేకాకుండా మళ్లీ ఎన్నికల్లో కూడా పోటీ చేయబోమని స్పష్టం చేశారు. మా సవాల్‌ను స్వీకరించే దమ్ము ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఉందా అని ఆయన ప్రశ్నించారు.




**మా రక్తం తీసుకోండి.. రైతులకు నీళ్లివ్వండి:**
రేవంత్ సర్కార్ తీరుపై మండిపడ్డ కౌశిక్ రెడ్డి, రైతుల కోసం తాము ఎంతటి త్యాగానికైనా సిద్ధమని ప్రకటించారు. "ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ముఖ్యమంత్రి ఎదురుదాడికి దిగుతున్నారు. అవసరమైతే మా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కార్యకర్తల రక్తం తీసుకోండి.. కానీ రైతులకు మాత్రం వెంటనే నీళ్లు ఇవ్వండి" అని పాడి కౌశిక్ రెడ్డి కోరారు. కాళేశ్వరం విషయంలో ఇన్నాళ్లూ కాంగ్రెస్ చెప్పిన అబద్ధాలు ప్రజలకు ఎక్కడ తెలిసిపోతాయోనన్న భయంతోనే కన్నెపల్లి పంప్ హౌస్‌లను రన్ చేయడం లేదని కౌశిక్ రెడ్డి ఆరోపించారు. ఉత్తర తెలంగాణ రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందని మండిపడుతూ.. "కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి, మిమ్మల్ని అధికార పీఠంపై కూర్చోబెట్టడమే రైతులు చేసిన తప్పా?" అని నిలదీశారు. రైతులకు నీళ్లిస్తే ఎరువులు ఇవ్వాల్సి వస్తుందని, పండిన పంటను కొనుగోలు చేయాల్సి వస్తుందనే నెపంతోనే.. రేవంత్ రెడ్డి చిల్లర రాజకీయాలకు పాల్పడుతూ సాగునీరు విడుదల చేయడం లేదని తీవ్ర విమర్శలు గుప్పించారు. రైతుల ఆవేదనను చూసి కడుపు మంటతోనే తాను ఈ వ్యాఖ్యలు చేస్తున్నట్లు కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు.

# కేపీహెచ్‌బీ లులు మాల్‌లో గన్ కలకలం




**హైదరాబాద్ (మనసులో మాట) జూలై 14:**
కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లులు మాల్‌లో ఓ వ్యక్తి గన్‌తో కనిపించడం కలకలం రేపింది. మాల్ పార్కింగ్ వద్ద రెండు కుటుంబాల మధ్య ఘర్షణ జరగడంతో సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఇరువర్గాలను విచారిస్తుండగా పాతబస్తీకి చెందిన సిద్ధిఖీ జేబులో గన్ గుర్తించారు. పోలీసులు ఆయుధాన్ని స్వాధీనం చేసుకుని పరిశీలించగా.. దానికి చెల్లుబాటయ్యే లైసెన్స్ ఉన్నట్లు తేలింది. గన్‌తో వచ్చిన వ్యక్తిని మాల్‌లోకి అనుమతించే సమయంలో భద్రతా సిబ్బంది సరైన తనిఖీలు నిర్వహించలేదని గుర్తించిన పోలీసులు.. నిర్లక్ష్యంగా వ్యవహరించిన లులు మాల్ యాజమాన్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# రాజ్‌కుమార్ మృతదేహం మాకొద్దు.. కుటుంబసభ్యుల నిరాకరణ

**చేవెళ్ల, షాబాద్, (మనసులో మాట) జూలై 14:**
రాజ్‌కుమార్ మృతదేహాన్ని తీసుకెళ్లడానికి కుటుంబసభ్యులు నిరాకరించారు. పోలీసులు చేవెళ్ల మున్సిపాలిటీ సిబ్బంది సహకారంతో స్థానిక శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. రాజ్‌కుమార్ తల్లిదండ్రులు, సోదరుడు అయిష్టంగానే ఆసుపత్రి వద్దకు వచ్చారు. అంబులెన్స్‌లో ఉంచిన శవాన్ని చూసి వెనుతిరిగారు.

**పోస్టుమార్టం చేయడానికి ముందుకు రాని వైద్యురాలు..**
రాజ్‌కుమార్ మృతదేహానికి చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం రాత్రి పోస్టుమార్టం నిర్వహించారు. అంతకు ముందు డ్యూటీలో ఉన్న వైద్యురాలు ముందుకు రాకపోవడంతో మూడు గంటల పాటు పోలీసులు వేచి ఉండాల్సి వచ్చింది. వికారాబాద్ జిల్లా ఆస్పత్రి నుంచి వైద్యులను రప్పించడానికి ప్రయత్నించారు. సాధ్యం కాకపోవడంతో చేవెళ్ల ఆసుపత్రికి చెందిన వైద్యులు లక్ష్మీకాంత్ రెడ్డి, ప్రణీత్‌ను పిలిపించారు. ఎట్టకేలకు రాత్రి 9.30 తర్వాత పోస్టుమార్టం ప్రక్రియ ప్రారంభించారు.

**దివ్యాంగురాలికి రూ.10 లక్షల చెక్కు అందజేత**



బాధిత కుటుంబంలోని దివ్యాంగురాలికి అన్ని రకాలుగా అండగా నిలుస్తామని కలెక్టర్ నారాయణరెడ్డి, చీఫ్ విప్ మహేందర్ రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే యాదయ్యతో కలిసి బాధిత కుటుంబాన్ని కలిసి రూ.10 లక్షల చెక్కును బాలికకు అందజేశారు. ముఖ్యమంత్రి.. పరిహారం రెట్టింపు చేసినట్లు వారు తెలిపారు. ఇందిరమ్మ ఇంటితో పాటు ఆమె సంరక్షణ కోసం పునరావాస కేంద్రంలో చేర్పిస్తామని తెలిపారు. తండ్రి ప్రభుత్వ ఉద్యోగి అయినందున.. ఆయనకు అందే పింఛను ఆమెకు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ఈ డెక్క.. మా లెక్కలో లేనట్లే!



- **కలుపు మొక్కలతో దోమల కర్మాగారంలా మారిన మూసీ**

**హైదరాబాద్ (మనసులో మాట) జూలై 14:**

రాష్ట్ర ప్రభుత్వం మూసీ నదిని సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేయాలని యోచిస్తోంది.. మూసీ నది పరివాహక ప్రాంత అభివృద్ధి సంస్థ (ఎంఆర్‌డీసీఎల్) మాత్రం నదీ గర్భాన్ని దోమల కర్మాగారంలా మార్చింది. గుర్రపుడెక్క తొలగింపు పనుల పేరుతో రూ.కోట్లు ఖర్చవుతున్నా.. నదిలోని మొక్క చెక్కు చెదరట్లేదు. కలుపు మొక్కలు రోజురోజుకు మరింత విస్తరిస్తున్నాయి. దోమల సంతానోత్పత్తికి ఆలవాలమైన గుర్రపుడెక్కతో.. నదికి ఇరువైపులా ఉన్న జనావాసాలు నిత్యం నరకం చూస్తున్నాయి.

**నది పొడవునా సమస్యే..**

మూసీ నది నగరంలో 55 కి.మీ.. పొడవున ప్రవహిస్తుంది. జంట జలాశయాల నుంచి బాపూఘాట్ వరకు 21 కి.మీ.., బాపూఘాట్ నుంచి అత్తాపూర్ వరకు 1.9 కి.మీ. పొడవున గుర్రపుడెక్క విపరీతంగా పెరిగింది. దీనివల్ల నదిలో వ్యర్థాలను నిలువరించేందుకు ఎంఆర్‌డీసీఎల్ ఇంజినీర్లు ఏర్పాటు చేసిన జాలీలు (ఫ్లోటింగ్ ట్రాష్ కలెక్టర్లు) పని చేయట్లేదు. మురుగు, ప్లాస్టిక్, జంతు వ్యర్థాలు ఎక్కడికక్కడ పేరుకుపోతున్నాయి. ఇటీవల వర్షాల వల్ల.. మూసీ పరివాహక ప్రాంతాల్లో దోమల సమస్య క్రమంగా పెరుగుతోంది. అత్తాపూర్, లంగర్‌హౌస్, జియాగూడ, నాగోల్‌లో డెంగీ, మలేరియా జ్వరాలు పెరుగుతున్నాయి. సమస్యను పరిష్కరించాల్సిన ఎంఆర్‌డీసీఎల్, జీహెచ్‌ఎంసీ అధికారులు.. ఒకరిపై ఒకరు చెప్పుకొంటూ బాధ్యతను విస్మరిస్తున్నారు.

**సమస్య యథాతథం**

గతంలో మూసీ పొడవునా ఎంటమాలజీ బృందాలు దోమల మందును పిచికారీ చేసేవి. గుర్రపుడెక్క తొలగింపు పనులు చేపట్టేవారు. దోమ లార్వాను గుర్తించే సర్వే కూడా జరిగేది. ఏడాదిగా బల్దియా ఆధ్వర్యంలో అలాంటి కార్యక్రమాలు జరగట్లేదు. అయితే మూలలను వదిలేసి దోమల నియంత్రణకు నగరవ్యాప్తంగా ఏటా రూ.15 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకు వెచ్చిస్తున్నారు. అలాగే గుర్రపుడెక్క తొలగింపునకు రూ. 35నాలుగు కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఎంఆర్‌డీసీఎల్ ఆధ్వర్యంలోనూ రూ.కోటి వరకు వెచ్చిస్తుండటం గమనార్హం. ఇన్ని కోట్లు వ్యయమైపోతున్నా సమస్య అదేవిధంగా కొనసాగడం విశేషం.

# రైలు ఉంది.. స్టేషన్‌కు బస్సే లేదు




**హైదరాబాద్ (మనసులో మాట) జూలై 14:**

నగరంలోని సబర్బన్ రైల్వేస్టేషన్లకు నేరుగా ఆర్టీసీ బస్సు కనెక్టివిటీ లేకపోవడం ప్రయాణికులకు సమస్యగా మారింది. ప్రధాన రహదారులకు దూరంగా ఉండటంతో కిలోమీటర్ల మేర నడవాల్సి వస్తోంది. ఈ స్టేషన్ల నుంచి బస్సులు నడపాలన్న డిమాండ్ ఉన్నా ఇప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంపై ప్రయాణికుల సంఘాలు గుర్రుగా ఉన్నాయి. రైల్వేస్టేషన్ నుంచి మెట్రోస్టేషన్లకు లేదా బస్‌స్టాప్‌లకు మినీ బస్సులు, షటిల్ సర్వీసులు నడపాలని డిమాండ్ చేస్తున్నాయి.

**ఈ స్టేషన్లకు అవసరం..**

హైటెక్‌సిటీ స్టేషన్ ఈ స్టేషన్ ప్రధాన రహదారికి చాలా దూరంలో ఉంటుంది. ఐటీ కారిడార్‌లోని మైండ్‌స్పేస్, సైబర్ టవర్స్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వైపు వెళ్లడానికి రెగ్యులర్ సిటీ బస్సులు నేరుగా స్టేషన్ లోపలికి రావడం లేదు. ప్రయాణికులు ప్రైవేటు వాహనాలపై ఆధారపడాల్సి వస్తోంది.బోరబండ, భరత్‌నగర్ స్టేషన్లు: ఇవి నివాస ప్రాంతాల మధ్య ఉన్నాయి. ఇక్కడి నుంచి అంతర్గత కాలనీలకు, సమీప మెట్రోస్టేషన్లకు ఆర్టీసీ ఫీడర్ లేదా షటిల్ సర్వీసులు లేవు.ఫలక్‌నుమా, ఉందానగర్: పాతనగరం, శంషాబాద్ పరిసర ప్రాంతాల్లోని ఈ స్టేషన్ల నుంచి విమానాశ్రయం వైపు లేదా సమీప కాలనీలకు వెళ్లేందుకు నేరుగా నడిచే బస్సులు అరుదు.సనత్‌నగర్, జేమ్స్ స్ట్రీట్: పారిశ్రామిక ప్రాంతం, కమర్షియల్ హబ్‌లకు దగ్గరగా ఉన్నప్పటికీ నిరంతరంగా బస్సు సర్వీసులు లేవు.

# ఆషాఢ బోనాల

## జాతరకు సర్వం సిద్ధం



**హైదరాబాద్ (మనసులో మాట) జూలై 14:**

బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోందని హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జులై 16 నుంచి ఆగస్టు 13 వరకు జంటనగరాల్లో బోనాల ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో భక్తులకు అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. పాత జీహెచ్‌ఎంసీ పరిధిలోని 3,247 ఆలయాలకు రూ.15.05 కోట్లు విడుదల చేసినట్టు పేర్కొన్నారు.ఆలయాల వద్దఅన్ని ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. బోనాల సందర్భంగా గోల్కొండ, ఉజ్జయిని మహంకాళి, చిలకలగూడ కట్టమైసమ్మపోచమ్మ, హరిబౌలిలోని అక్కన్నమాదన్న ఆలయం, కార్వాన్ దర్బార్ మైసమ్మ, లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి, చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం, మీరాలంమండి శ్రీమహంకాళి ఆలయాలతో పాటు దాదాపు 30 ప్రధాన ఆలయాల్లో ప్రభుత్వం తరఫున మంత్రులు, ముఖ్య నేతలు, అధికారులు పట్టువస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. నగరంలో ఆషాఢ మాసం బోనాల సందడి మొదలు కానుంది. తెలంగాణలోని ప్రఖ్యాత లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆలయానికి నిర్వాహకులు రంగులు వేసి ముస్తాబు చేస్తున్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు.

# అక్రమంగా తరలిస్తున్న

## 3 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



**తాండూరు గ్రామీణ (మనసులో మాట) జూలై 14:**

తాండూరు మండలం వీర్ శెట్టిపల్లిలోని కాగ్న నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టణానికి చెందిన ఇమ్రాన్, వీరిశెట్టిపల్లికి చెందిన మరో ఇద్దరు వ్యక్తులు మూడు ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని కోనాపూర్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని నిందితులను అదుపులోకి తీసుకొని, వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

# దర్యాప్తును పరిగెత్తిస్తూ తప్పించుకునే దారులు మూసేస్తూ

- కీలక పాత్ర పోషిస్తున్న ఇన్వెస్టిగేషన్ మానిటరింగ్ సెల్

హైదరాబాద్ (మనసులో మాట) జూలై 14:



నగరంలో ఏటా 20 వేలకుపైగా కేసులు నమోదవుతున్నాయి. వాటితోపాటు పెండింగ్ కేసులు పెరిగిపోతున్నాయి. తగినంత సమయం లేకపోవడం, బందోబస్తుల కారణంగా పోలీసు అధికారులు దర్యాప్తుపై పూర్తిస్థాయి దృష్టి సారించలేకపోయేవారు. సాక్ష్యాల సేకరణలో విఫలమవడంతో నిందితులు తేలికగా తప్పించుకునేవారు. ఈ సమస్యను అధిగమించి నేరస్థులకు శిక్షలుపడేలా చేయాలనే సంకల్పంతో నగర సీపీ వీసీ సజ్జనర్ పర్యవేక్షణలో 'ఇన్వెస్టిగేషన్ మానిటరింగ్ సెల్' ఏర్పాటు చేశారు. దర్యాప్తు అధికారులకు అవసరమైన తోడ్పాటును అందించటం, సాంకేతిక ఆధారాల సేకరణలో సహకరించటం ద్వారా ప్రతి కేసునూ పకడ్బందీగా దర్యాప్తు చేసే వాతావరణం కల్పించారు. ఫలితంగా 6 నెలల వ్యవధిలో 2,469 కేసుల్లో నిందితులకు న్యాయస్థానాలు శిక్షలు ఖరారు చేశాయి. 18 కేసుల్లో నిందితులకు 20 ఏళ్లకు పైగా కారాగార శిక్షలు పడ్డాయి. 12 కేసుల్లో జీవితఖైదు, ఒక కేసులో ఉరిశిక్ష విధించారు. సనత్‌నగర్ ఠాణా పరిధిలో బాలుడి హత్య కేసులో నిందితుడికి మరణశిక్ష పడేందుకు అవసరమైన సాక్ష్యాలు, సాంకేతిక ఆధారాల సేకరణలో మానిటరింగ్ సెల్ చురుకైన పాత్ర పోషించింది. దర్యాప్తు పూర్తయి విచారణ ప్రారంభమైన తరువాత కేసులను సమర్థంగా పర్యవేక్షించేందుకు 'కోర్టు మానిటరింగ్'ను 'ఇన్వెస్టిగేషన్ మానిటరింగ్ సెల్' కట్టుదిట్టంగా అమలు చేస్తోంది. ప్రతి న్యాయస్థానానికి ప్రత్యేక లైజన్ ఆఫీసర్‌ను నియమించారు.

**అధికారులకు వెన్నుదన్ను**

బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగినపుడే పోలీసింగ్ వ్యవస్థకు సార్థకత చేకూరుతుందని సీపీ వీసీ సజ్జనర్ అన్నారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు దర్యాప్తు అధికారులకు ఇన్వెస్టిగేషన్ మానిటరింగ్ సెల్ వెన్నుదన్నుగా నిలుస్తుందని స్పష్టంచేశారు. సంప్రదాయ పద్ధతులతోపాటు ఆధునిక శాస్త్రీయ ఆధారాలను మేళవించటం ద్వారా న్యాయస్థానాల్లో నేర నిరూపణ సాధ్యమవుతుందన్నారు. రాబోయే రోజుల్లో సాంకేతిక సవాళ్లను సమర్థంగా ఎదుర్కొంటూ శాంతిభద్రతలను పరిరక్షిస్తామని వివరించారు.

# పుర పాలకులకు.. ముడుపుల మరక!

- నిర్మాణాల పేరిట ప్రజాప్రతినిధుల అక్రమ దందా
- ఫిర్యాదు చేస్తే పదవికే ఎసరు

కామారెడ్డి (మనసులో మాట) జూలై 14:



ఇందిరమ్మ ఇంటి మంజూరుకు రూ.లక్ష డిమాండ్ చేస్తున్నాడంటూ రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల మున్సిపల్ వైస్ ఛైర్మన్‌పై ఓ మహిళ అక్కడి కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా పోలీసులు వైస్ ఛైర్మన్‌పై కేసు నమోదు చేశారు. అధికారులే కాదు.. ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలు వసూళ్లకు పాల్పడినా ఫిర్యాదు చేయొచ్చని, అలాంటి వారిపై చర్యలు తప్పవని ఈ ఉదంతం రుజువు చేస్తోంది. జిల్లాలోని పురపాలికల్లోనూ కొందరు ప్రజాప్రతినిధులు పనులకు డబ్బులు దండుకుంటూ అవినీతికి పాల్పడుతున్నారు. ప్రజలకు నిస్వార్థంగా సేవ చేస్తామని ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చిన కొందరు ప్రజాప్రతినిధులు.. చేయి తడపనిదే పనులు చేయడంలేదు. ప్రధానంగా పురపాలక సంఘాల్లోని కొందరు కౌన్సిలర్లు అధికారాన్ని అడ్డుపెట్టుకుని అడ్డగోలు వసూళ్లకు పాల్పడుతున్నారు. వెంచర్ల ఏర్పాటు, భవన నిర్మాణ అనుమతులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు తదితరాల్లో రూ.వేలల్లో దండుకుంటున్నారు. నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోతే ఇబ్బందులు ఎదురవుతాయని కొందరు యజమానులు.. ప్రజాప్రతినిధులు అడిగినంత ముట్టజెప్పుతున్నారు. తమపై ఎవరూ ఫిర్యాదు చేయబోరు అని, తమపై చర్యలు తీసుకునే అధికారం అధికారులకు ఉండదు అన్న ధోరణితోనే చాలా మంది రాజకీయ నాయకులు అమాయకుల నుంచి వసూళ్లకు తెగబడుతున్నారు. కానీ, అధికారులకు బాధితులు ఫిర్యాదు చేస్తే తమ పదవికి ఎసరు వస్తుందన్న విషయాన్ని గుర్తించకపోవడం గమనార్హం.

**సొమ్ములిస్తే సక్రమం..**

కొందరు భవన యజమానులు పురపాలికలో తీసుకున్న అనుమతుల ప్రకారం కాకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్నారు. అడ్డుకోవాల్సిన ప్రజాప్రతినిధులు ముడుపులు తీసుకుని అక్రమ కట్టడాలకు వత్తాసు పలుకుతున్నారన్న విమర్శలున్నాయి. మొదట కౌన్సిలర్లు, తమ అనుచరులు యజమానుల వద్దకు వెళ్లి అక్రమంగా ఎలా నిర్మాణాలు చేపడతారని ప్రశ్నిస్తారు. తర్వాత డబ్బులు ఇవ్వగానే మిన్నకుండిపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందిస్తూ అక్రమ నిర్మాణాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. బాధితులు ఫిర్యాదు చేస్తే తమ కౌన్సిలర్ పదవి ప్రమాదంలో పడే అవకాశం ఉంటుందన్న విషయాన్ని గుర్తించాలని అభిప్రాయపడుతున్నారు.

**డబ్బులు ఇస్తేనే అనుమతి**

కామారెడ్డి పురపాలికలో ఓ వ్యక్తి నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణం చేపట్టారు. ఆయనను బెదిరించి కొందరు కౌన్సిలర్లు ఇటీవల రూ. లక్ష వరకు డబ్బులు వసూలు చేశారు. ఎల్లారెడ్డి పురపాలికలో ఓ వ్యక్తి అన్ని అనుమతులు తీసుకుని భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. వెంటనే అక్కడ వాలిపోయిన కౌన్సిలర్ రూ.20 వేలు డిమాండ్ చేశాడు. తర్వాత ఇబ్బందులు వస్తాయేమో అన్న బెంగతో ఆ యజమాని.. కౌన్సిలర్ అడిగినంత డబ్బు ముట్టజెప్పారు. నూతన పురపాలికగా ఏర్పడిన బిచ్కుందలో ఎన్నికైన కొందరు కౌన్సిలర్లు వసూళ్లకు తెరలేపారు. గ్రామపంచాయతీగా ఉన్న సమయంలో జీ+1 నిర్మాణాలకు అనుమతులు తీసుకున్న యజమానులు ఇప్పుడు మరో అంతస్తులో నిర్మాణాలు చేపడుతున్నారు. తమకు డబ్బులు ఇస్తేనే అనుమతి ఇస్తామంటూ యజమానుల నుంచి రూ. 20 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నారు. బాన్సువాడ పురపాలికలోని కొందరు కౌన్సిలర్లు సైతం కొన్ని వాణిజ్య భవనాల నిర్మాణాలకు ఎక్కువ మొత్తంలో డబ్బులు గుంజుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

# శబ్దం.. శ్రుతి తప్పుతోంది



జనగామ టౌన్ (మనసులో మాట) జూలై 14:

బుల్లెట్ బైకులతో ఇతర అత్యాధునిక ద్విచక్ర వాహనాలను ఇటీవల యువత ఎక్కువగా వాడుతున్నారు. అయితే కొందరు ఆకతాయి యువకులు తమ వాహనాలకు ఉన్న సైలెన్సర్లను తొలగించి, అనధికారికంగా బయట విపరీతమైన శబ్ద కాలుష్యం చేసే సైలెన్సర్లను వినియోగిస్తున్నారు. ఇటీవల జనగామ జిల్లా కేంద్రంలో పోలీసులు 40 మందికి చెందిన అనధికారికంగా బిగించుకున్న సైలెన్సర్లను స్వాధీనం చేసుకుని రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు.

**అనుమతించదగిన సామర్థ్యం..**

కేంద్ర రవాణా నిబంధనల ప్రకారం ద్విచక్ర వాహనాల నుంచి వచ్చే శబ్దం నిర్దేశిత డెసిబెల్ పరిమితి దాటకూడదు. సాధారణంగా ద్విచక్ర వాహనాల తయారీ కంపెనీలు అందించే సైలెన్సర్లు 80 డెసిబెల్ నుంచి 85 డెసిబెల్ లోపు ధ్వనిని మాత్రమే విడుదల చేస్తాయి. ద్విచక్ర వాహనాల రిజిస్ట్రేషన్ల కంపెనీ ఫిట్ చేసిన సైలెన్సర్లు మాత్రమే చట్టబద్ధం. కానీ కొందరు అత్యాధునిక ద్విచక్ర వాహనాలు వాడే వారు షార్ట్ బాటిల్, ఇండోర్, పటాకా శబ్దాలు వచ్చేలా మార్కెట్లో అనధికారికంగా దొరుకుతున్న సైలెన్సర్లను బిగిస్తున్నారు. ఇవి 100 నుంచి 110 డెసిబెల్ ధ్వనిని విడుదల చేస్తాయి. దీంతో నివాస ప్రాంతాల్లో తీవ్రమైన అలజడితోపాటు వృద్ధులు, పిల్లలకు ఇబ్బందితో పాటు గుండె జబ్బుల ఉన్నవారికి గుండెపోటుకు దారితీసే ప్రమాదం ఉంది. అలాగే వాయు కాలుష్యంతో ప్రమాదకరమైన కార్బన్ మోనాక్సైడ్, హైడ్రో కార్బన్ల వంటి విష వాయువులను విడుదల చేస్తాయి. దీంతో గాలి విషపూరితంగా మారుతుంది.

**వాహనాలకూ నష్టమే..**

శబ్దం విపరీతంగా వచ్చే సైలెన్సర్లను వాడటం వల్ల వాహనాలకు కూడా తీవ్ర నష్టం ఏర్పడుతుంది. ఇంజిన్ దెబ్బతింటుంది. అందులో వాల్వ్‌లు త్వరగా పాడవుతాయి. మైలేజీ కూడా పడిపోతుంది. బుల్లెట్ వంటి బైకులకు ఈ అదనపు వేడి వల్ల త్వరగా ఆయిల్ చిక్కదనాన్ని కోల్పోతుంది.

**చట్టపరంగా కఠిన నిబంధనలు..**

అనధికారికంగా అధిక శబ్దాలను విడుదల చేసే సైలెన్సర్లను వినియోగిస్తూ పట్టుబడే వాహనదారులకు చట్టపరంగా భారీ జరిమానాలు విధిస్తున్నారు. తనిఖీల్లో మొదటిసారి పట్టుబడితే మోటారు వాహన చట్టం ప్రకారం రూ.1000 నుంచి రూ.2వేల వరకు జరిమానా విధిస్తారు. రెండోసారి అంతకంటే ఎక్కువగా పట్టుబడితే రూ.5వేల జరిమానా/3నెలల వరకు జైలుశిక్ష, లేకుంటే రెండూ విధించే అవకాశం ఉంది. అలాగే కొన్ని సందర్భాల్లో పోలీసులు అనధికారి సైలెన్సర్లను వాడే ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేస్తారు. సైలెన్సర్లను అక్కడికక్కడే తొలగించడమే కాకుండా వాటిని రోడ్డు రోలర్లతో తొక్కిస్తూ ధ్వంసం చేస్తున్నారు. ఈ విషయమై వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్ మాట్లాడుతూ.. నిబంధనలు ఉల్లంఘిస్తూ బైకులకు అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లను వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# శేరిలింగంపల్లిలో ఎస్ఐఆర్ వేగవంతం



**శేరిలింగంపల్లి (మనసులో మాట) జూలై 14:**

ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి వజ్రాయుధం. కానీ, ఆ ఓటరు జాబితాలో తప్పులుంటే? ఒకే వ్యక్తికి రెండు, మూడు చోట్ల ఓట్లు ఉంటే? ఇలాంటి అక్రమాలకు చెక్ పెడుతూ, అత్యంత పారదర్శకమైన, నిజమైన ఓటరు జాబితాను రూపొందించేందుకు ఎన్నికల సంఘం ఒక మహాక్రతువుకు శ్రీకారం చుట్టింది. అదే స్పెషల్ ఇంటెన్సివ్ రివ్యూ (సర్ - SIR). శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఈ 'సర్' ప్రక్రియ ప్రస్తుతం శరవేగంగా కొనసాగుతోంది. అసలు ఈ 'సర్' అంటే ఏమిటి? బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్ఓలు) ఇంటింటికీ వెళ్లి ఏయే వివరాలు సేకరిస్తున్నారు? దశాబ్దాల క్రితం నాటి ఓట్ల వివరాలను ఎందుకు ఆరా తీస్తున్నారు,స్పెషల్ ఇంటెన్సివ్ రివ్యూ (Special Intensive Review) అనగా ఓటరు జాబితాను సమగ్రంగా, లోతుగా పరిశీలించి తప్పులు లేని పారదర్శక జాబితాను రూపొందించడం. శేరిలింగంపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న అన్ని పోలింగ్ బూత్‌ల పరిధిలో ఈ కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. నకిలీ ఓటర్ల ఏరివేత, వలస వెళ్లిన వారి వివరాల తొలగింపు, అర్హులైన కొత్త ఓటర్ల నమోదు తదితర అంశాలను ఇందులో ప్రధానంగా పరిగణనలోకి తీసుకుంటున్నారు.

---

## ఆడిపాడిస్తూ.. అక్షరాలు నేర్పిస్తూ



**హైదరాబాద్ (మనసులో మాట) జూలై 14:**

నగరంలో సర్కారు బడుల్లో ప్రవేశాలు పెంచాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రీప్రైమరీ విభాగాలకు చిన్నారులు వచ్చేలా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. హైదరాబాద్ జిల్లాలోని 275 సర్కారు బడుల్లో ప్రీప్రైమరీ విభాగాలను ప్రారంభించి ఇన్‌స్ట్రక్టర్లను, ఆయాలను తాత్కాలికంగా నియమించనున్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక వారు పిల్లలకు ఆటపాటలతోపాటు తెలుగు, ఇంగ్లిష్ పదాలను నేర్పనున్నారు. గతేడాది 28 పాఠశాలల్లో ప్రీప్రైమరీ సెక్షన్లను ప్రారంభించగా.. పదుల సంఖ్యలో చిన్నారులు చేరారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాలు విద్యార్థులతో ఉండి.. మధ్యాహ్నం భోజనం తినిపించి ఇళ్లకు పంపుతున్నారు. రాజ్‌భవన్, చిలకలగూడ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగడంతో సెక్షన్లను కూడా పెంచారు. ప్రీప్రైమరీ విభాగాల బాధ్యత పూర్తిగా ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాలదేనని విద్యాశాఖ అధికారులు వారికి స్పష్టం చేశారు. ఇన్‌స్ట్రక్టర్‌కు రూ.8వేలు, ఆయాకు రూ.6 వేల జీతం నిర్ణయించారు. వీరు ఉదయం 7.45 గంటలకు బడులకు రావాలని, పిల్లలు వచ్చేలోపు ఆటవస్తువులు, పెన్నులు, పెన్సిళ్లు సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. తెలుగు, ఆంగ్ల పద్యాలు, పాటలను వారితో పాడిస్తూ.. అక్షరాలు నేర్పిస్తూ.. బడిలో ఉన్నామన్న ఆలోచన చిన్నారులకు రాకుండా చూసుకోవాలని ఉన్నతాధికారుల సూచించారు.

# రేవంత్ రెడ్డిది అవగాహన లేని పాలన.. సీఎం వ్యాఖ్యలపై ఈటల ఫైర్

**హైదరాబాద్ (మనసులో మాట) జూలై 14:**



సీఎం రేవంత్ రెడ్డి తనపై చేసిన విమర్శలకు బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఘాటుగా సమాధానమిచ్చారు. రేవంత్ రెడ్డి నీచమైన భాషను పక్కనపెట్టి రాష్ట్రంలో సాగునీరు, తాగునీరు అందించే చర్యలపై దృష్టి సారించాలని హితవు పలికారు. కేవలం వార్తా పత్రికల్లో హెడ్‌లైన్స్ కోసం, రాజకీయ కోణంలో మాట్లాడే అలవాటును సీఎం మానుకోవాలని ఆయన మండిపడ్డారు. సుందిళ్ల, అన్నారం బ్యారేజీలకు 2024లోనే మరమ్మతులు పూర్తయినట్లు జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ (NDSA) నివేదిక స్పష్టం చేస్తోందని ఈటల గుర్తుచేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని, తాగునీటి ఎద్దడి కూడా తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ఎన్డీఎస్ఏ నివేదికను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం వెంటనే సుందిళ్ల, అన్నారం బ్యారేజీల్లో నీటిని నిల్వ చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. చిత్తశుద్ధి ఉంటే 'ఎల్ నినో' ప్రభావంపై సీఎం వెంటనే ఇంజనీర్లతో అత్యవసర సమావేశం నిర్వహించాలని సూచించారు.ఖిలాడీ ఎవరో తెలంగాణ సమాజమే తేలుస్తుంది!: బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులతో కూడిన "ఖిలాడీ కమిటీ"లో ఈటల చేరారంటూ రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా ధ్వజమెత్తారు. అసలైన 'ఖిలాడీ' ఈటల రాజేందరా లేక రేవంత్ రెడ్డా అనేది తెలంగాణ సమాజమే నిర్ణయిస్తుందని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై స్పందిస్తూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అక్కడ అవినీతి జరిగినట్లు రుజువైతే, బాధ్యులపై చట్టపరంగా తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అంతేకానీ దానిని రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవద్దని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు.

# యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ నిర్మాణ పనుల్లో జాప్యం..డీజీపీ ఆగ్రహం

- **తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేసిన డీజీపీ సీవీ ఆనంద్**
- **నిర్లక్ష్యం, ఆలస్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరిక**
- **మిగిలిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం**
- **దేశంలోనే ఆదర్శ విద్యాసంస్థగా తీర్చిదిద్దాలి**
- **పరిపాలన బలోపేతానికి వివిధ కమిటీల ఏర్పాటు**
- **డీజీపీ అధ్యక్షతన స్కూల్ సొసైటీ కమిటీ సమీక్ష సమావేశం**

**హైదరాబాద్ సిటీబ్యూరో (మనసులో మాట) జూలై 14.**

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ నిర్మాణ పనుల్లో జాప్యంపై డీజీపీ సీవీ ఆనంద్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం, ఆలస్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. మిగిలిన పనులను యుద్ధప్రాతిపదికన నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులను ఆయన కఠినంగా ఆదేశించారు. ప్రతి పనిని నిరంతరం పర్యవేక్షిస్తూ నాణ్యతతో పాటు వేగానికి కూడా అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దేశంలోనే తొలిసారిగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక విద్యాసంస్థలో పోలీస్ కుటుంబాల పిల్లలతో పాటు సాధారణ కుటుంబాల పిల్లలకు కూడా ప్రపంచ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో అత్యాధునిక మౌలిక వసతులు, బోధనా విధానాలు, విలువలతో కూడిన విద్య, క్రీడలు, సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యత కల్పిస్తూ విద్యాబోధన కొనసాగుతోంది. ఈమేరకు సోమవారం తెలంగాణ ప్రభుత్వం, పోలీస్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా మంచిరేవుల గ్రామంలో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ (వైఐపీఎస్) అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపు, మౌలిక వసతుల విస్తరణ, భవిష్యత్ కార్యాచరణపై డీజీపీ, యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ సొసైటీ అధ్యక్షుడు సీవీ ఆనంద్ అధ్యక్షతన సొసైటీ కమిటీ సమావేశం జరిగింది. పాఠశాల రెండో విద్యా సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఇప్పటివరకు సాధించిన పురోగతిపై డీజీపీ ఆరా తీశారు. 202526 విద్యా సంవత్సరంలో 345 మంది విద్యార్థులు అడ్మిషన్ తీసుకోగా, 202627 విద్యా సంవత్సరానికి 360 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందినట్లు అధికారులు వివరించారు. గత విద్యా సంవత్సరంలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు తరగతులు నిర్వహించగా, ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఆరో తరగతిని ప్రారంభించారు. ప్రస్తుతం నర్సరీ నుంచి ఆరో తరగతి వరకు బోధన కొనసాగుతున్న ఈ పాఠశాలలో 202627 విద్యా సంవత్సరంలో మొత్తం 360 మంది విద్యార్థుల్లో 184 మంది పోలీస్ కుటుంబాలకు చెందినవారు, 176 మంది నాన్‌పోలీస్ కుటుంబాలకు చెందినవారు ఉన్నట్లు సమావేశంలో వెల్లడించారు. యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌లో అందిస్తున్న



నాణ్యమైన విద్యపై ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసానికి ఇది నిదర్శనమని సభ్యులు అభిప్రాయపడ్డారు. పాఠశాల విస్తరణలో భాగంగా నూతనంగా 17 తరగతి గదులతో కూడిన నూతన అకాడమిక్ బ్లాక్ నిర్మాణ నమూనాను డీజీపీకి వివరించారు. అనంతరం డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను దేశంలోనే అత్యుత్తమ విద్యాసంస్థలలో ఒకటిగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, నైతిక విలువలు, సామాజిక బాధ్యత, సృజనాత్మకతను పెంపొందించేలా ప్రపంచ స్థాయి విద్యను అందించాలని పేర్కొన్నారు. విద్యతో పాటు అత్యాధునిక మౌలిక వసతులు, సురక్షితమైన విద్యా వాతావరణం, ఆధునిక బోధనా పద్ధతులను కల్పించడంతో పాటు క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని డీజీపీ సూచించారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో శారీరక, మానసిక దృఢత్వం, క్రమశిక్షణ పెంపొందడంతో పాటు మాదకద్రవ్యాలు వంటి సామాజిక దురలవాట్లకు దూరంగా ఉండే అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు.

# అనుకున్నంతా అయ్యింది



- మూడు పాల శీతలీకరణ కేంద్రాలు మూసివేత

**ఖమ్మం వ్యవసాయం (మనసులో మాట) జూలై 14:**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ రంగ సంస్థ విజయ డెయిరీ మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. డెయిరీని బలోపేతం చేస్తామని రాష్ట్ర స్థాయి అధికారులు ప్రకటనలు చేస్తున్నా అందుకు విరుద్ధంగా అడుగులు పడుతున్నాయి. ఖమ్మం జిల్లాలోని కల్లూరు, కామేపల్లి, భద్రాద్రికొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం మినీ పాల శీతల కేంద్రాల(బీఎంసీయూ)ను రద్దు చేస్తూ తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ జనరల్ మేనేజర్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. వీటిలో కల్లూరులో రోజుకు 500 లీటర్లు, కొత్తగూడెంలో 400 లీటర్లు, కామేపల్లిలో 400 లీటర్ల పాల సేకరణ చేస్తున్నారు. మినీ కేంద్రాల మూసివేతతో దశాబ్దాల తరబడి వీటిపై ఆధారపడిన పాడి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది.

**ఏడులో ఐదు ఖతం..**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మొత్తం 7 మినీ పాలశీతల కేంద్రాలు(బీఎంసీయూ) ఉన్నాయి. వీటిలో ఇప్పటికే రోజుకు 500 లీటర్ల పాల సేకరణ మూసివేశారు. తాజాగా రద్దు చేసిన వాటితో కలిపి వీటి సంఖ్య ఐదుకు చేరింది. ఎర్రుపాలెం బీఎంసీయూను ఇందిరా డెయిరీ మహిళాశక్తి సంఘానికి కేటాయించారు. ఇప్పుడు ఖమ్మంలో ఖమ్మం, భద్రాద్రి జిల్లాలో ఇల్లెందు బీఎంసీయూలు మాత్రమే మిగిలాయి. వీటిలో ఖమ్మంలో రోజుకు 1,500 లీటర్లు, ఇల్లెందులో 500 లీటర్ల పాల సేకరణ జరుగుతోంది.

**పొంతన లేని మాటలు..**

పాడి రైతులకు ఉపయోగకరంగా ఉన్న బీఎంసీయూలను రద్దు చేసి, భవిష్యత్తులో విజయ డెయిరీని బలోపేతం చేస్తామని అధికారులు ప్రకటించటం పట్ల రైతులు ఆగ్రహంగా ఉన్నారు. బీఎంసీయూల రద్దుతో ప్రత్యామ్నాయం లేక ప్రైవేటు డెయిరీలను రైతులు ఆశ్రయిస్తారు. అలాంటప్పుడు డెయిరీని ఎలా అభివృద్ధి చేస్తారో అధికారులకే తెలియాలి. బీఎంసీయూల మూసివేతతో డెయిరీ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని, జిల్లాకు చెందిన మంత్రులు జోక్యం చేసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# అక్రమాలు కొండంత.. వసూళ్లు గోరంత

- ఉపాధి హామీ పనుల్లో అవినీతి
- సామాజిక తనిఖీలో వెల్లడి

**పాల్వంచ గ్రామీణం (మనసులో మాట) జూలై 14:**

వలసలు తగ్గించి, పనులు కల్పించాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన ఈజీఎస్ పనులు కొందరు అక్రమార్కులకు వరంగా మారాయి. కొందరు క్షేత్రసహాయకులు కూలీలు పనులకు రాకున్నా వచ్చినట్లు హాజరు వేసుకొని కూలీల నుంచి డబ్బులు వసూల్ చేస్తున్నారు. ఇంకొందరు పనులు చేసినా హాజరు వేయకపోవడంతో చాలా మంది నష్టపోయారు. నిబంధనల ప్రకారం పనులు చేయకుండా సోషల్ ఆడిట్‌లో అడ్డంగా దొరికిపోయారు. అన్నపురెడ్డిపల్లి మండలంలో రూ.లక్షలు వెచ్చించి పెంచిన మొక్కల్లో 30 శాతం మొక్కల్లేవని సామాజిక తనిఖీ బృందం ఇటీవల తేల్చింది. నిబంధనలకు విరుద్ధంగా పనులు చేశారని ఈజీఎస్ సిబ్బందిపై రూ.4 వేలు రికవరీకి అధికారులు ఆదేశించారు.

పాల్వంచ మండలంలోని బంద్రుగొండ పంచాయతీలో చనిపోయిన వారి పేర్లతో, ఊర్లో లేని వారి పేర్లతో నిధులు కాజేశారని సామాజిక తనిఖీ బృందానికి గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. కొందరు పనులు చేయకున్నా చేసినట్లు మస్టర్లు సృష్టించారని తెలిపారు. గతేడాది సుమారు రూ.40 వేలు రికవరీకి ఆదేశించారు.

**నోటీసులు ఇస్తూ..**

202526 సంవత్సరంలో జిల్లాలో రూ.70,97,016 నిధులు దుర్వినియోగమైనట్లు తేల్చారు. కానీ వీటికి ఇంకా బాధిత అధికారులు ఆధారాలు సమర్పిస్తున్నారు. ఈ ప్రక్రియ అనంతరం కలెక్టర్ నుంచి రాష్ట్ర స్థాయికి వెళ్తే అక్కడ పరిశీలించి రికవరీ చేయనున్నారు. వీటిల్లో రూ.లక్షల్లో తేలే అవకాశముంది. దీనిపై ఈజీఎస్ అధికారులు మాట్లాడుతూ.. దుర్వినియోగం చేసిన అధికారులకు నోటీసులు ఇచ్చామని, వీరి నుంచి రికవరీ చేస్తున్నామన్నారు.



**2025-26లో ఉపాధి హామీ సామాజిక తనిఖీ వివరాలు (రూ.లలో):**

అక్రమాలు జరిగినట్లు తేల్చిన నగదు: 2,20,85,359
ఆధారాల సమర్పణ తర్వాత తేలింది: 66,09,640
రికవరీ సొమ్ము: 16,48,440
ఇంకా రావల్సిన మొత్తం: 49,61,200

**జిల్లాలో:**

జాబ్ కార్డులు: 2,22,471
కూలీల సంఖ్య: 4,43,901
క్రియాత్మక కార్డులు: 1,30,789
పనుల్లో పాల్గొన్న కూలీలు: 2,16,686

**రికవరీలో వెనుకబాటు:**

కూలీలు ఎర్రటి ఎండల్లో సరైన వసతులు లేకున్నా పనులు చేశారు. కానీ కొందరు అధికారుల తప్పిదాలు, మస్టర్ల తప్పులతో కూలీలు నష్టపోయారు. సోషల్ ఆడిట్ అధికారులు (ఎస్సార్పీ, డీఆర్పీలు) గ్రామీణ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిల్లో తనిఖీలు నిర్వహించి నిజాలను నిగ్గు తేల్చినప్పటికీ రికవరీల్లో వెనుకబడ్డారు. నాలుగేళ్లలో రూ.66 లక్షలు అక్రమం జరిగినట్లు గుర్తించినా కేవలం రూ.16 లక్షలు మాత్రమే వసూళ్లు చేయడం గమనార్హం.

## మత్తు సూదిమందు విక్రయ
# ముఠా గుట్టురట్టు



**ఆదిలాబాద్ నేర విభాగం (మనసులో మాట) జూలై 14:**

వైద్యులు శస్త్ర చికిత్సల సమయంలో ఉపయోగించే మత్తు సూదిమందు విక్రయ ముఠా గుట్టును ఆదిలాబాద్ పోలీసులు రట్టు చేశారు. ఎస్పీ అఖిల్ మహాజన్ సోమవారం రాత్రి పాత్రికేయులకు వివరాలు వెల్లడించారు. గంజాయి తదితర మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారిన వారికి ఈ ముఠా మత్తు మందు సీసాలు, సిరంజీలను సరఫరా చేస్తోందన్నారు. ఆదివారం రాత్రి ఆర్టీసీ బస్టాండ్ వద్ద పోలీసులను చూసి ఆర్ఎంపీ వైద్యుడు షిండె జగన్నాథ్ ద్విచక్ర వాహనంపై పారిపోయేందుకు యత్నించారు. పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా ముఠా గుట్టు వెలుగులోకి వచ్చిందన్నారు. నిందితులు మెడికల్ ఏజెన్సీల నుంచి రూ.390 ధర ఉన్న సూది మత్తు మందును కొని రూ.1,500 వరకు విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో తేలిందన్నారు.ఈ వ్యవహారంలో ఆదిలాబాద్ పట్టణం శాంతినగర్‌కు చెందిన ఆర్ఎంపీ వైద్యుడు షిండె జగన్నాథ్, జగదాంబ ఫార్మసీ, సర్జికల్స్ యజమాని రమేష్‌గౌడ్, పాత బస్టాండ్‌లోని గెట్‌వెల్ మెడికల్ యజమాని సయ్యద్ ఖమర్‌ఉద్దీన్, ముషారఫ్(ప్రస్తుతం జైలులో ఉన్నాడు), సమీర్, ఇర్ఫాన్‌ఖాన్, ముఖీద్‌లపై కేసులు నమోదు చేశారు. నిందితులు షిండె జగన్నాథ్, సయ్యద్ ఖమర్‌ఉద్దీన్‌లను అరెస్టు చేశామన్నారు. వారి నుంచి 190 ఇన్సులిన్ సిరంజీలు, 50 మత్తు మందు సీసాలు, ద్విచక్రవాహనం, రెండు చరవాణులు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరో నలుగురి కోసం గాలిస్తున్నామన్నారు. ఈ కేసును ఛేదించిన డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, టూటౌన్ ఇన్‌స్పెక్టర్ కే.నాగరాజు, ఎస్ఐలు అఖిల్, ప్రణయ్‌కుమార్‌లను ఎస్పీ అభినందించారు.

## రైల్వే స్టేషన్‌ను సందర్శించిన డీఆర్ఎం




**కారేపల్లి (మనసులో మాట) జూలై 14:**

ఖమ్మం జిల్లాలోని కారేపల్లి రైల్వే స్టేషన్‌ను డివిజనల్ రైల్వే మేనేజర్(డీఆర్ఎం) గోపాలకృష్ణ సందర్శించారు. అక్కడ జరుగుతున్న రైల్వే రెండో లైన్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు అందుతున్న సేవలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. గతంలో రద్దైన రైళ్లను పునరుద్ధరించాలని గ్రామస్థులు ఈ సందర్భంగా ఆయనను కోరారు.

# కళ్లకు గంతలు కట్టుకుని వినూత్న నిరసన



**సంగారెడ్డి గ్రామీణం (మనసులో మాట) జూలై 14:**

మైక్రో బాక్స్ ఫ్యాక్టరీలో విధుల నుంచి తొలగించిన తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కార్మికులు వినూత్నంగా నిరసన తెలిపారు. సంగారెడ్డిలో సీఐటీయూ ఆధ్వర్యంలో వారు కళ్లకు గంతలు కట్టుకుని ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. తమ తప్పు లేకున్నా విధుల నుంచి తొలగించడం అన్యాయమని, ఎనిమిది నెలలుగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టడానికి సిద్ధంగా ఉన్నామని సీఐటీయూ నాయకులు హెచ్చరించారు.

# సిబ్బంది చేతివాటం చెల్లదిక



**హైదరాబాద్ (మనసులో మాట) జూలై 14:**

పేదల కార్పొరేట్ ఆసుపత్రిగా పేరొందిన నిమ్స్‌లో రోగుల సేవల్లో జరుగుతున్న జాప్యం.. సిబ్బంది నిర్లక్ష్య ధోరణిపై చర్యలు షురూ అయ్యాయి. ఇప్పటికే నిమ్స్‌లో ఓ ఔషధ దుకాణ నిర్వాహకుడి ఆగడాలపై డైరెక్టర్ ప్రొఫెసర్ రాహుల్‌దేవ్‌రాజ్ దృష్టిపెట్టారు. తర్వాత రోగులకు అందుతున్న సేవలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించారు. రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఇప్పటికే ప్రకటించిన ఆయన తాజాగా తీరు మార్చుకోని ఓ ఉద్యోగిపై చర్యలకు ఉపక్రమించారు. రోగుల పట్ల అమర్యాదగా ప్రవర్తిస్తున్నట్లు తనిఖీల్లో గుర్తించడంతో సదరు ఉద్యోగిని వారంపాటు విధులకు దూరంగా ఉండాలని ఆదేశించారు.నిమ్స్ అత్యవసర విభాగంలో పడక దొరకాలంటే గగనమే. నిరంతరం వచ్చే అత్యవసర కేసుల్లో 30 శాతం వెనక్కి వెళుతుంటారు. ఇక్కడ 100 పడకలున్నా వివిధ కారణాలతో అత్యవసర రోగులకు వైద్యం అందక ఇబ్బందులు తప్పడం లేదు. ఎన్నిసార్లు చర్యలు తీసుకుంటున్నా పరిస్థితి మొదటికే వస్తోంది. పడకలు లభించక స్ట్రెచర్లపై పెట్టి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో నిరంతర పర్యవేక్షణతో వెనక్కి పంపే కేసులను 5 శాతానికి తగ్గించారు. అత్యవసర విభాగానికి వచ్చిన రోగుల పరిస్థితి కొంత కుదుటపడ్డాక వెంటనే ఆయా విభాగాలకు తరలించి ఇక్కడ పడకలు ఖాళీగా ఉండేలా చర్యలు తీసుకున్నట్లు డాక్టర్ రాహుల్‌దేవ్‌రాజ్ తెలిపారు. అత్యవసర పడక కోసం వచ్చిన వారిని తిరిగి పంపకుండా చేర్చించుకునేలా ప్రణాళిక తయారు చేస్తున్నట్లు తెలిపారు.

# ఆక్రమించి అద్దెకిచ్చారు

- **బీదర్ చౌరస్తాలో యథేచ్ఛగా భూదందా**

**జహీరాబాద్ (మనసులో మాట) జూలై 14:**



జహీరాబాద్ శివారులోని బీదర్ చౌరస్తా పరిసరాల్లో భూముల విలువలు భారీగా పెరిగాయి. ముంబయిహైదరాబాద్ జాతీయ రహదారి, బీదర్‌హైదరాబాద్ ప్రధాన రహదారులు అనుసంధానమైన ఈ కూడలి, పరిసర ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. దీంతో కొందరు అక్రమార్కులు రహదారి పక్కన, లోపలి వైపున్న ప్రభుత్వ స్థలాలపై కన్నేశారు. షెడ్లు నిర్మించి.. దర్జాగా వ్యాపారాలు చేసుకుంటూ జేబులు నింపుకొంటున్నారు. కొన్ని షెడ్లను వ్యాపారాల నిర్వహణకు అద్దెకిచ్చారు. ఈ రహదారి మీదుగా నిత్యం అధికారులు, ప్రజాప్రతినిధులు రాకపోకలు సాగిస్తున్నా.. ఆక్రమణలు పట్టించుకోవడం లేదనే విమర్శ లొస్తున్నాయి. క్రమంగా ప్రభుత్వ స్థలాలు కనుమరుగవుతున్నాయి.

**కళ్లెదుటే పరాధీనమవుతున్నా పట్టింపేది?**

మహీంద్రా పరిశ్రమ ప్రహరీ నుంచి కాశీంపూర్‌నకు వెళ్లే మార్గంలో నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమి ఉండేది. ఇందులో కొంత భాగంలో ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించారు. ఇంకొంత భాగంలో పేదలు గుడిసెలు వేసుకున్నారు. మిగతా ఖాళీ స్థలాన్ని కొందరు క్రమంగా ఆక్రమించుకుంటున్నారు. ప్రధాన రహదారి వెంట ఉన్న ఈ స్థలంలో కొందరు తాత్కాలిక రేకుల షెడ్లతో మడిగెలు నిర్మించారు. వాటిని అద్దెకిచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. మరి కొందరు ఆక్రమించుకున్న స్థలాలను లీజుకిచ్చారు. కాశీంపూర్ రహదారికి ఇరువైపులా ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి.

**ఇకనైనా అధికారులు దృష్టి సారించాలి**

ప్రభుత్వ స్థలాలు లేకపోవడంతో పలు డివిజనల్ స్థాయి ప్రభుత్వ కార్యాలయాలు జహీరాబాద్ పట్టణంలోని ఇరుకైన అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఇప్పటికే బీదర్ చౌరస్తాకు సమీపంలో ఆబ్కారీ శాఖ, పశుసంవర్ధక శాఖ డివిజనల్ కార్యాలయాలు ఉన్నాయి. ఇక్కడి ఆక్రమణలు పూర్తిగా తొలగించి మరికొన్ని ప్రభుత్వ కార్యాలయాలు నిర్మిస్తే ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని పలువురు సూచిస్తున్నారు.

**పరిశీలించి చర్యలు తీసుకుంటాం**

బీదర్ చౌరస్తాలో ఆక్రమణలపై గతంలో ఫిర్యాదులు వచ్చాయి. త్వరలోనే అధికారులతో పూర్తిస్థాయి విచారణ చేయిస్తాం. నివేదిక ఆధారంగా ఆక్రమణలకు అడ్డుకట్ట వేస్తాం. ప్రభుత్వ స్థలాలను కాపాడుతాం.

# అనుమతి కొమ్మలకైతే.. తొలగించేది వృక్షాలనే..!



- **అనుమతి కొమ్మలకైతే.. తొలగించేది వృక్షాలనే..!**

**తూప్రాన్, శివ్వంపేట, (మనసులో మాట) జూలై 14:**

శివ్వంపేట మండలం చిన్నగొట్టిముక్ల వద్ద ప్రధాన రహదారిపై భారీ వృక్షాలతో విద్యుత్తు తీగలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, కేవలం కొమ్మలను తొలగించడానికి గుత్తేదారుకు పని అప్పగించారు. సదరు గుత్తేదారు నిబంధనలను ఉల్లంఘించి యంత్రాలతో వాటిని నరికివేయించాడు. లారీలలో తరలించి విక్రయించేశాడు. ప్రధాన రహదారిపై ఇంత తతంగం జరుగుతున్నా పట్టించుకునే వారే కరవయ్యారు.తూప్రాన్ మండల పరిషత్ కార్యాలయం సమీపంలో 20 ఏళ్ల కింద నాటిన మొక్కలు పెరిగి పచ్చదనం సంతరించుకుంది. సదరు కార్యాలయంలో కోర్టు భవనం ఏర్పాటు చేస్తుండగా, అడ్డంగా ఉన్న కొమ్మలను తొలగించాలని ఓ గుత్తేదారుకు పని అప్పగించారు. 15 రోజుల కిందట గుత్తేదారు భారీ వృక్షాలను నామరూపాలు లేకుండా నరికేసి, సామిల్లకు తరలించారు. అధికారులు మాత్రం మాకేమీలే అన్నట్లుగా వ్యవహరించారు.జిల్లాలో పచ్చదనంపై అక్రమార్కుల గొడ్డలి వేటు పడుతోంది. గతంలో ఎప్పుడో నాటిన విత్తనాలు పెరిగి భారీ వృక్షాలుగా ఎదిగాయి. నలుగురికి నాలుగు రకాలుగా ఉపయోగపడుతున్న ఆ చెట్లపై అక్రమార్కుల కన్ను పడింది. కొందరు రహస్యంగా రాత్రివేళ నరికేస్తుండగా మరికొందరు పట్టపగలే నామరూపాలు లేకుండా చేస్తున్నారు. ప్రధాన రహదారులు, పొలాల వద్ద ఏళ్ల నాటి చెట్లను యంత్రాలతో కోస్తూ అక్రమంగా వ్యాపారం చేస్తున్నారు. పల్లెలు, పట్టణాలు అన్న తేడా లేకుండా పచ్చని చెట్లపై వేటు వేస్తున్నారు.

**అడ్డంగా ఉన్నాయన్న సాకుతో..**

ప్రధాన రహదారుల వెంట కరెంట్ తీగలకు భారీవృక్షాల కొమ్మలు తగిలి తెగిపోతుంటాయి. గాలిదుమారం వీచినప్పుడల్లా విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. అందుకే ఏటా వర్షాకాలం ముందు కొమ్మలు తొలగిస్తుంటారు. ఈ పనిని గుత్తేదారులకు అప్పగిస్తుంటారు. కూలీలను నియమించి గొడ్డళ్లతో వాటిని నరికివేయించాలన్నది నిబంధన. కానీ గుత్తేదారులకు ఇవేమీ పట్టవు. ఏకంగా చెట్లనే నేలకూలుస్తున్నారు. కొందరు నాయకులు అండగా ఉంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇందుకు మరో కారణం.

**సమన్వయలేమి..**

ప్రధాన రహదారుల వెంట ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలంటే అటవీ అధికారుల అనుమతి తప్పనిసరి. కానీ ఇరు శాఖల మధ్య సమన్వయలేమితో చెట్లు నేలకూలుతున్నాయి. పలువురు అటవీ అధికారులు కలప వ్యాపారులతో కలిసి ఇదంతా చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సామిల్ల యజమానుల వద్ద వసూళ్లు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.